www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 27-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 282 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 8.35 తదుపరి చతుర్దశి; నక్షత్రం: మూల ఉ. 9.02 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ.7.23-9.02, రా.6.36-8.12; దుర్ముహూర్తం: మ.12.50-1.35, మ.3.04-3.49; అమృతఘడియలు: తె.4.10-5.46; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.04 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 27 జనవరి 2025



సెమీస్‌లో భారత్

అండర్-19 టీ20 వరల్డ్‌కప్

- చెలరేగిన బౌలర్లు
- బంగ్లాదేశ్ 64 ఆలౌట్
- రాణించిన త్రిష

కౌలాలంపూర్: అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల జట్టు వరుసగా నాలుగో విజయాన్నందుకుంది. దీంతో సెమీఫైనల్లోనూ చోటు దక్కించుకుంది. సూపర్ సిక్స్ గ్రూప్ 1లో భాగంగా ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో నెగ్గింది. బౌలింగ్‌లో లెఫ్టామ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ (3/15) ప్రత్యర్థిని కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో తెలుగు తేజం ఓపెనర్ జి. త్రిష (40) మరోసారి తన ఫామ్‌ను చాటుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 64 పరుగులు మాత్రమే చేసింది. 22 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినా.. కెప్టెన్ సుమయ్యా అక్తర్ (21 నాటౌట్), జన్నతుల్ మౌవా (14) ఆరో వికెట్‌కు 31 పరుగులు జోడించారు. త్రిష, షబ్నం, జోషితలకు ఒక్కో వికెట్ దక్కింది. ఆ తర్వాత స్వల్ప ఛేదనను భారత్ 7.1 ఓవర్లలో 66/2 స్కోరుతో అలవోకగా పూర్తి చేసింది. బంగ్లా బౌలర్లపై 8 ఫోర్లతో చెలరేగిన ఓపెనర్ త్రిష ఏడో ఓవర్‌లో వెనుదిరిగింది. మరోవైపు గ్రూప్ 1లోనే శ్రీలంక-స్కాట్లాండ్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా టాస్ వేయకుండానే రద్దయ్యింది. కాగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ఇప్పటికే సెమీస్‌కు చేరుకున్నాయి.

సిన్నర్.. మళ్లీ విన్నర్

వరుసగా రెండోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం

టోర్నీ ఆరంభం నుంచి ప్రదర్శించిన దూకుడును వరల్డ్ నెం.1 జానిక్ సిన్నర్ చివరిదాకా కొనసాగించాడు. డిఫెండింగ్ చాంపియన్ ముద్రకు వన్నె తెస్తూ మరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. రెండో సీడ్ జ్వెరేవ్‌తో ఫైనల్‌ను వరుస సెట్లలో ముగించి విజేతగా నిలిచాడు. ఈక్రమంలో ఇటలీ కుర్రాడు ఎన్నో రికార్డులను సొంతం చేసుకున్నాడు.



మెల్‌బోర్న్: టాప్ సీడ్ జానిక్ సిన్నర్ అంచనాలను నిలబెట్టుకున్నాడు. వరుసగా రెండో ఏడాదీ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సిన్నర్ (ఇటలీ) 6-3, 7-6 (4) 6-3తో రెండో సీడ్ అలెగ్జాండ్ జ్వెరేవ్ (జర్మనీ)ని చిత్తు చేశాడు. తద్వారా 23 ఏళ్ల సిన్నర్.. 1992-93లో జిమ్ కొరియర్ తర్వాత పిన్న వయస్సులో వరుసగా రెండుసార్లు మెల్‌బోర్న్ పార్క్ విజేతగా నిలిచిన రికార్డును అందుకున్నాడు. మరోవైపు మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోనూ జ్వెరేవ్‌కు ఓటమి తప్పలేదు. ఇంతకుముందు 2020 యూఎస్ ఓపెన్, 2024 ఫ్రెంచ్ ఓపెన్ తుదిపోరులో జర్మనీ ఆటగాడికి నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ పోరులో నెం.1, నెం.2 సీడెడ్‌లు తలపడడం 2019 తర్వాత ఇదే తొలిసారి. ఆ సంవత్సరం నెం.1 నొవాక్ జొకోవిచ్ కూడా వరుస సెట్లలో నెం.2 రఫెల్ నడాల్‌ను ఓడించడం గమనార్హం. 2024 ప్రారంభం నుంచి సిన్నర్ ఐదు ప్రధాన టోర్నీలలో మూడింటిలో టైటిళ్లు కైవసం చేసుకున్నాడు. ఇందులో నిరుటి యూఎస్ ఓపెన్ కూడా ఉంది. ఇక ఈ సమయంలో జానిక్ గెలుపోటముల రికార్డు 80-6కాగా మొత్తం తొమ్మిది టోర్నీలలో విజేతగా నిలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ సహా గత 21 మ్యాచ్‌ల్లో వరుస విజయాలు సాధిస్తూ వచ్చాడు. ఇంకా..ఓపెన్ ఎరా (1968లో ప్రారంభం)లో.. కెరీర్ ఆరంభంలో ఆడిన 3 గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లోనూ నెగ్గిన ఎనిమిదో ఆటగాడిగా జానిక్ చరిత్ర సృష్టించాడు.

సునాయాసంగా..: మ్యాచ్ ప్రారంభం నుంచే జానిక్ సిన్నర్ జోరు కనబర్చాడు. అద్భుతమైన పవర్, నెట్ ప్లేతో జ్వెరేవ్‌ను బెంబేలెత్తించాడు. అయితే రెండో సెట్లో జ్వెరేవ్ కొంతమేర సిన్నర్‌ను ప్రతిఘటించాడు. ఇక..కోర్టు నలుమూలలనుంచి షాట్లు సంధించిన జానిక్ సులువుగా మొదటి సెట్ నెగ్గాడు. జ్వెరేవ్ పుంజుకొని పోరాడడంతో రెండో సెట్ ఉత్కంఠ భరితమైంది. రెండో సెట్‌లో ఓ దశలో జ్వెరేవ్ 5-4తో ముందంజలో నిలిచాడు. కానీ తేరుకున్న సిన్నర్ వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 5-5తో స్కోరు సమం చేయడంతోపాటు సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించాడు. టైబ్రేకర్‌లో తిరుగులేని స్థితిలో నిలిచి సెట్‌ను చేజిక్కించుకున్నాడు. అదే ఊపుతో మూడో సెట్‌లో మ్యాచ్‌లో జయకేతనం ఎగుర వేశాడు. 2 గంటల 42 నిమిషాల ఈ మ్యాచ్‌లో జ్వెరేవ్ 12 ఏస్‌లు సంధించగా, జానిక్ ఆరింటికే పరిమితమయ్యాడు. ఇద్దరూ చెరో రెండు డబుల్‌ఫాల్ట్‌లు చేయగా, విన్నర్లలో ప్రత్యర్థి (25)పై జానిక్ (32) ఆధిక్యం చూపాడు.

సినియకోవా జోడీకి డబుల్స్ కిరీటం

టాప్ సీడ్ సినియకోవా (చెక్ రిపబ్లిక్)/టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా) జోడీ మహిళల డబుల్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఫైనల్లో సినియకోవా/టేలర్ జంట హీ సూవీ (తైవాన్)/జెలెనా ఓస్టాపెంకో (లాత్వియా) ద్వయాన్ని ఓడించింది.



'రికార్డు' స్వర్ణం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): తెలుగు అథ్లెట్ జ్యోతి యర్రాజి ఈ ఏడాది పోటీపడ్డ తొలి రేసులోనే సత్తా చాటింది. ఫ్రాన్స్‌లోని నాన్‌టెస్‌లో జరిగిన ఎలీట్ ఇండోర్ మీటింగ్ టోర్నీలో విశాఖపట్నానికి చెందిన జ్యోతి 60 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం సాధించింది. అది కూడా జాతీయ రికార్డు టైమింగ్‌తో విజేతగా నిలిచింది. వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ టూర్ లెవెల్ మీట్‌లో భాగంగా జరిగిన ఈ రేసులో జ్యోతి రెండుసార్లు తన జాతీయ రికార్డును అధిగమించడం విశేషం. తొలుత హీట్స్‌లో 8.07 సెకన్ల టైమింగ్ నమోదు చేసిన జ్యోతి.. ఫైనల్స్‌లో ఏకంగా 8.04 సెకన్లలోనే గమ్యాన్ని చేరుకుంది. ఈ క్రమంలో గతంలో తన పేరిటనున్న 8.12 సెకన్ల ప్రదర్శనను జ్యోతి మరింత మెరుగుపరచుకుంది. అయితే, ఈ ఏడాది మార్చిలో చైనాలో జరిగే ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్‌కు అర్హత మార్క్ 7.84 సెకన్ల టైమింగ్‌ను మాత్రం ఇంకా అందుకోవాల్సి ఉంది. ఇక, ఇదే టోర్నీ పురుషుల 60 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ తేజాస్ షిర్సే 7.68 సెకన్ల టైమింగ్‌తో కాంస్య పతకం అందుకున్నాడు.

మీ 5 లక్షలు మాకొద్దు!

తిరస్కరించిన కర్ణాటక ఖో-ఖో క్రీడాకారులు

మహారాష్ట్రలో రూ.2.50 కోట్ల ప్రోత్సాహకం

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఖో-ఖో ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు క్రీడాకారులు గౌతమ్, చైత్ర రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సన్మానం చేసి.. ప్రకటించిన రూ.5 లక్షల ప్రోత్సాహకాన్ని తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్, ఫుట్‌బాల్ తరహాలోనే ఖో-ఖో ఆటకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఖో-ఖో ప్రపంచకప్ విజేత జట్టు సభ్యులకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.2.25 కోట్ల పారితోషికం, ఎ-గ్రేడ్ ఉద్యోగం ప్రకటించిందని తెలిపారు. కాగా క్రీడామంత్రి నాగేంద్ర అవినీతి ఆరోపణలతో గతేడాది జూన్‌లో పదవి నుంచి దిగిపోవడంతో ప్రస్తుతం ఆ శాఖ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వద్దే ఉంది. ఇదిలావుండగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై జేడీఎస్ తీవ్రంగా మండిపడింది. వరల్డ్‌కప్ నెగ్గిన క్రీడాకారులకు చిల్లరకాసులు పడేశారని విమర్శించింది. క్రీడాకారుల తిరస్కరణతోనైనా ప్రభుత్వానికి సిగ్గురావాలని పేర్కొంది.


సీఎంతో చైత్ర, గౌతమ్

బంగర్ శిక్షణలో విరాట్

ముంబై: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్ ద్వారా ఫామ్ అందుకోవాలనుకుంటున్నాడు. బీసీసీఐ కఠిన నిర్ణయం ప్రకారం భారత జట్టు ఆటగాళ్లంతా దేశవాళీల్లో ఆడుతున్న విషయం తెలిసిందే. అయితే మెడ నొప్పి కారణంగా ఢిల్లీ తరఫున సౌరాష్ట్రతో రంజీ మ్యాచ్‌లో విరాట్ ఆడలేదు. ఈనెల 30 నుంచి రైల్వేస్‌పై విరాట్ బరిలోకి దిగనున్నాడు. ఈనేపథ్యంలో మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ శిక్షణలో విరాట్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ముంబైలో శనివారం వీరిద్దరు నెట్స్‌లో ఉన్న వీడియో సోషల్ మీడియాలో దర్శనమిచ్చింది. ఇందులో విరాట్ బ్యాక్‌ఫుట్ ఆటపై బంగర్ దృష్టి సారిస్తూ బంతులు విసిరాడు. సహజంగా కోహ్లీ ఫ్రంట్‌ఫుట్ ఆడేందుకు ఇష్టపడుతుంటాడు. 2014-2019 మధ్య కాలంలో బంగర్ భారత జట్టు బ్యాటింగ్ కోచ్‌గా పనిచేశాడు. ఆ సమయంలో విరాట్ సగటు 55.10గా ఉండడం విశేషం.


బంగర్, కోహ్లీ (ఫైల్ ఫొటో)

ఆంధ్రకు మరో డ్రా

పుదుచ్చేరి: ఆంధ్రప్రదేశ్ జట్టు ఈ సీజన్ రంజీ ట్రోఫీలో వరుసగా మూడో మ్యాచ్‌ను డ్రా చేసుకొంది. గ్రూప్-బిలో పుదుచ్చేరితో మ్యాచ్ ఫలితం తేలకుండా ముగిసింది. ఆటకు నాలుగో, ఆఖరి రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 248/5తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 319/6 వద్ద డిక్లేర్ చేసి, ప్రత్యర్థి ముందు 363 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. కరణ్ షిండే (119 నాటౌట్) సెంచరీ చేశాడు. అంకిత్ శర్మ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో పుదుచ్చేరి రెండో ఇన్నింగ్స్‌లో 152/0 స్కోరు చేసింది. శ్రీధర్ రాజు (75 నాటౌట్), జై పాండే (59 నాటౌట్) అర్ధ శతకాలు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 303, పుదుచ్చేరి 260 రన్స్ చేశాయి.

దేశం నాకెంతో ఇచ్చింది!

పద్మభూషణ్ అవార్డుపై శ్రీజేష్



న్యూఢిల్లీ: హాకీకి తాను చేసిన సేవకంటే.. దేశం తనకు ఎంతో ఎక్కువ ఇచ్చిందని మాజీ గోల్‌కీపర్ శ్రీజేష్ అన్నాడు. కేంద్ర ప్రభుత్వం తనకు ప్రతిష్ఠాత్మక పౌరపురస్కారం 'పద్మభూషణ్' ప్రకటించిన నేపథ్యంలో శ్రీజేష్ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'గతం మొత్తం ఒక్కసారి అలా కళ్లముందు తిరిగింది. 20 ఏళ్లుగా హాకీకి నేను చేసిన దానికంటే.. దేశం నాకెంతో ఎక్కువ ఇచ్చింది. పద్మభూషణ్ లాంటి అత్యున్నత పురస్కారం ప్రకటించడం ఇంకా కలగానే అనిపిస్తోంది. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ తర్వాత ఈ అవార్డును అందుకోనుండడం నిజంగా నా అదృష్టం' అని శ్రీజేష్ చెప్పాడు. రిటైర్మెంట్ తర్వాత అతడు భారత జూనియర్ జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు.

హరి, అర్జున్‌కు డ్రా

వికాన్ జీ: టాటా స్టీల్ మాస్టర్స్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్లు పెంటేల హరికృష్ణ, అర్జున్ ఇరిగేసి ఎనిమిదో రౌండ్‌ను డ్రాగా ముగించారు. ఆదివారం అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో జరిగిన గేమ్‌ను హరి 30 ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించాడు. అలెక్సీ సరానా (సెర్బియా)తో గేమ్‌ను అర్జున్ 23 ఎత్తుల అనంతరం డ్రా చేసుకున్నాడు. గుకేష్, ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ కూడా డ్రాగా ముగిసింది. 8 రౌండ్ల తర్వాత గుకేష్, ప్రజ్ఞానంద చెరో 5.5 పాయింట్లతో..హరి 4, అర్జున్ 2 పాయింట్లతో ఉన్నారు.

ఐసీసీ.. ఓ ఈవెంట్ కంపెనీ

ఇయాన్ చాపెల్ విమర్శ



సిడ్నీ: ఐసీసీ క్రికెట్‌ను నడపలేదని, అది ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలా వ్యవహరిస్తోందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ విమర్శించాడు. అలాగే బీసీసీఐ చేతిలో బొమ్మలా మారిపోయిందని, వారికి అనుకూలంగా క్రికెట్ షెడ్యూల్‌ను సైతం మార్చే పరిస్థితికి దిగజారిందని ఆరోపించాడు. ధనిక క్రికెట్ బోర్డుల హవా నడుస్తోందని, వారికి తగ్గట్టుగానే కార్యకలాపాలుంటున్నాయని తెలిపాడు. ఐసీసీ తీరు మారకపోతే ఆ బోర్డులు తమకిష్టమైన రీతిలోనే క్రికెట్ షెడ్యూల్‌ను ఏర్పాటు చేసుకుంటాయని చాపెల్ హెచ్చరించాడు.

పాక్ లక్ష్యం 254.. ప్రస్తుతం 76/4

ముల్తాన్: వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ ఇక్కట్లలో పడింది. 254 పరుగుల లక్ష్యంతో రెండోరోజైన ఆదివారం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన పాక్ ఆట ఆఖరికి 76/4 స్కోరు చేసింది. అంతకుముందు వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 244 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 163, పాకిస్థాన్ 154 పరుగులు చేశాయి.

బిజినెస్

ద్విచక్ర వాహనాలు లగ్జరీ కాదు..

పన్ను భారం తగ్గించండి..

- హోండా మోటార్‌సైకిల్ డైరెక్టర్ యోగేశ్ మాథుర్



న్యూఢిల్లీ: ప్రస్తుత భారత మార్కెట్లో ద్విచక్ర వాహనాలు లగ్జరీ వస్తువు ఏ మాత్రం కాదని, వాటిపై పన్ను తగ్గించాలని హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) డైరెక్టర్ (సేల్స్ మార్కెటింగ్) యోగేశ్ మాథుర్ అన్నారు. భరించగల స్థాయి అనేది ఒక సమస్య కావడంతో వచ్చే ఏడాది పరిశ్రమ ఒక అంకె వృద్ధికి దిగజారే ముప్పును ఎదుర్కొంటున్న విషయం ఆయన గుర్తు చేశారు. మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి ఆదాయపు పన్ను రేట్లను హేతుబద్ధీకరించడం కూడా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. గ్రామీణ మార్కెట్లలో డిమాండ్ తగ్గినందు వల్ల ఈ ఏడాది స్కూటర్, మోటార్ సైకిళ్ల అమ్మకాలు ప్రోత్సాహకరంగా లేవని మాథుర్ చెప్పారు. 350 సీసీ వరకు టూ వీలర్లను ప్రభుత్వం 28 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లో పెట్టగా ఆ పై సామర్థ్యం గల వాహనాలకు 3 శాతం సెస్ కూడా అదనంగా విధిస్తోంది. ఫలితంగా అధిక సామర్థ్యం గల టూ వీలర్లపై పన్ను 31 శాతం వరకు ఉంటోంది. ఈ పన్ను భారాన్ని తగ్గించడం వల్ల టూవీలర్ పరిశ్రమకు భారీ ఊరట లభిస్తుందని మాథుర్ అన్నారు.

ఆటో ఎగుమతుల్లో 19% వృద్ధి: గత ఏడాది ఆటోమొబైల్ ఎగుమతుల్లో 19 శాతం వృద్ధి నమోదైంది. ద్విచక్ర వాహన ఎగుమతులు పెరగడం ఇందుకు కారణం. 2023 లో 42,85,809 వాహనాలు విక్రయించగా 2024లో మొత్తం 50,98,810 వాహనాలు విక్రయించినట్లు భారత ఆటోమొబైల్ ఉత్పత్తిదారుల సంఘం (సియామ్) గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రధానంగా లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో భారత వాహనాలకు డిమాండ్ పెరిగిందని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ అన్నారు.

ఎంఎఫ్‌లకు 'ఈక్విటీ' ధమాకా

- 2024లో రూ.4 లక్షల కోట్లు
- ఒక్క సిప్‌ల ద్వారానే రూ.2.5 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: గత ఏడాది (2024) దేశంలోని ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు బాగానే కలిసొచ్చింది. ఈ పథకాల ద్వారా ఎంఎఫ్ పరిశ్రమ గత ఏడాది రికార్డు స్థాయిలో రూ.3.94 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. అంతకు ముందు సంవత్సరం సమీకరించిన రూ.1.61 లక్షల కోట్లతో పోలిస్తే ఇది రూ.2.33 లక్షల కోట్లు ఎక్కువ. దీంతో 2024 డిసెంబరు నాటికి ఈక్విటీ పథకాల ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.30.57 లక్షల కోట్లకు చేరింది. 2023 డిసెంబరుతో పోలిస్తే ఇది రూ.8.77 లక్షల కోట్లు ఎక్కువ. గత ఏడాది ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన రూ.3.94 లక్షల కోట్ల పెట్టుబడుల్లో రూ.2.5 లక్షల కోట్లు క్రమానుగత పెట్టుబడుల (సిప్) ద్వారా సమకూరాయి.

ఈ ఏడాది కష్టమే: అయితే ప్రస్తుత సంవత్సరం (2025) ఈ పెట్టుబడులు అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. మార్కెట్ ఆటుపోట్ల కారణంగా గత ఏడాది డిసెంబరు నుంచే ఈ పథకాల్లోకి పెట్టుబడుల వేగం తగ్గినట్టు జెర్మినేట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈఓ సంతోష్ జోసెఫ్ చెప్పారు. సాధారణంగా ఈ పథకాల్లోకి పెట్టుబడులు మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. దీంతో ఈ సంవత్సరం కొత్త ఈక్విటీ పథకాలు కూడా మార్కెట్‌కు పెద్దగా రాకపోవచ్చని భావిస్తున్నారు. అయితే దీర్ఘకాలిక మదుపరులకు మాత్రం ప్రస్తుత మార్కెట్ అత్యంత అనువైనదనే అంచనాలు వినిపిస్తున్నాయి.

సెబీ డిజిటల్ నాలెడ్జ్ రిపాజిటరీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మరో కీలక చర్య తీసుకుంది. దరోహర్ పేరుతో ఆదివారం ప్రత్యేక డిజిటల్ నాలెడ్జ్ రిపాజిటరీ ప్రారంభించింది. ఈ రిపాజిటరీలో దేశ క్యాపిటల్ మార్కెట్‌కు సంబంధించిన సమస్త సమాచారం డిజిటల్ రూపంలో లభిస్తుంది. 150 ఏళ్ల దేశ సెక్యూరిటీస్ మార్కెట్లో ఇదో ప్రధాన మైలురాయి అని సెబీ పేర్కొంది. విద్యార్థులు, మదుపరులు, పరిశోధకులు, పాత్రికేయులు, మార్కెట్ వర్గాలు, సాధారణ ప్రజలు ఎవరైనా ఈ రిపాజిటరీలోని సమస్త సమాచారాన్ని వినియోగించుకోవచ్చు.

యాక్సిస్ నిఫ్టీ 500 మూమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. నిఫ్టీ 500 మూమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 మూమెంటమ్ 50 టీఆర్ఐ బెంచ్ మార్క్ ఇండెక్స్‌గా ఉంటుంది. ఆరు నుంచి ఏడాది కాలవ్యవధిలో మంచి పనితీరు కనబరుస్తున్న స్టాక్స్‌ను ఎంపిక చేసుకుని ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ముగింపు తేదీ ఫిబ్రవరి 7.

ఎల్ఐసీ ఎంఎఫ్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్.. మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈక్విటీ, డెట్, బంగారంలో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. దీర్ఘకాలంలో మంచి లాభాలు ఆర్జించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఫిబ్రవరి 7. కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో నెలకు రూ.200 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

ఈ త్రైమాసికంలోనే 'హైడ్రోజన్' ట్రక్

టాటా మోటార్స్ ఈడీ గిరీశ్ వాఘ్



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ మరో వినూత్న ప్రయోగానికి సిద్ధమవుతోంది. పూర్తిగా హైడ్రోజన్‌తో నడిచే వాణిజ్య వాహనం (సీవీ) 'టాటా ప్రైమా హెచ్.28' ట్రక్కును ఈ త్రైమాసికంలో ప్రయోగాత్మకంగా జంషెడ్‌పూర్-కళింగనగర్, ముంబై-అహ్మదాబాద్, ముంబై-పుణె మార్గాల్లో నడపబోతోంది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీశ్ వాఘ్ ఈ విషయం వెల్లడించారు. ఇటీవల ఢిల్లీలో ముగిసిన 'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025'లో టాటా మోటార్స్ ఈ ట్రక్కును ప్రదర్శించింది. ఒకసారి ఇంధనం నింపితే 550 కిలోమీటర్ల వరకు ఈ ట్రక్కుకు మళ్లీ ఇంధనం నింపాల్సిన అవసరం ఉండదు. ఈ పరీక్షలు విజయవంతమైతే వాణిజ్య స్థాయిలో ఈ ట్రక్కులను పెద్దఎత్తున మార్కెట్లో ప్రవేశపెట్టాలని కంపెనీ భావిస్తోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)తో కలిసి టాటా మోటార్స్ ఈ ట్రక్కును అభివృద్ధి చేసింది.

23,400 పైన బుల్లిష్

(జనవరి 27-31 తేదీల మధ్య వారానికి)

అస్ట్రో గైడ్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,436-22,977 పాయింట్ల మధ్యన కదలాడి 111 పాయింట్ల నష్టంతో 23,092 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,169, 23,217, 23,328, 23,622 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,400
బ్రేక్‌డౌన్ స్థాయి: 22,800
నిరోధ స్థాయిలు: 23,300, 23,400, 23,500 (23,200 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,900, 22,800, 22,700 (23,000 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	480
వరంగల్	467	గోదావరి	475
చిత్తూరు	523	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	136
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	112
కర్నూలు	120	నెల్లూరు	117
విశాఖపట్నం	127	అనంతపురం	117
గోదావరి	136		

ఆటుపోట్లు తప్పవు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ సమీపిస్తుండటం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో కొన్ని రంగాల షేర్లకు ఆటుపోట్లు ఎదురుకావచ్చు. ప్రస్తుతం నిఫ్టీ 23,000-23,350 శ్రేణిలో కదలాడుతోంది. మరికొన్ని రోజులు ఇదే స్థాయిలో నిలకడగా రాణిస్తే అక్యుములేషన్ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. డాలర్ ఇండెక్స్, రూపాయి బలహీనత క్రమంగా తగ్గుతోంది. బంగారం జీవితకాల గరిష్ఠాన్ని చేరుతుండటం అంతర్జాతీయంగా అనిశ్చితిని సూచిస్తోంది. కంపెనీల ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ సంకేతాలను అనుసరించి ట్రేడర్లు పొజిషన్ తీసుకోవటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఎంఫసిస్: ప్రస్తుతం ఐటీ స్టాక్స్ జోరును ప్రదర్శిస్తున్నాయి. మెరుగైన ఫలితాలు విడుదల చేయటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం భారీ వాల్యూమ్‌తో 3.5 శాతం మేర పెరిగింది. పైగా కీలక స్థాయి వద్ద మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.3,009 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,950 స్థాయి వద్ద పొజిషన్ తీసుకుని రూ.3,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,910 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

లారస్ ల్యాబ్స్: ఈ ఫార్మా స్టాక్ నిఫ్టీతో పోలిస్తే జోరును ప్రదర్శిస్తోంది. కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. పైగా 2022 నాటి గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గత వారం మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించటంతో ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ భారీగా పెరిగింది. గత శుక్రవారం 2.99 శాతం లాభంతో రూ.602 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.590 వద్ద పొజిషన్ తీసుకుని రూ.660/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్: ప్రస్తుతం ఈ షేర్లు అక్యుములేషన్ జోన్‌లో ఉన్నాయి. సుదీర్ఘకాలంగా డౌన్ ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ స్టాక్స్ ఇప్పుడు కీలకమైన రూ.550 వద్ద మద్దతు తీసుకున్నాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి 13 శాతం మేర పెరిగాయి. గత శుక్రవారం ఈ షేరు 2.10 శాతం లాభంతో రూ.594 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.580 వద్ద పొజిషన్ తీసుకుని రూ.650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.565 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విప్రో: ఈ షేరు జీవితకాల గరిష్ఠం వైపు పరుగులు తీస్తోంది. తాజా ఆర్థిక ఫలితాల తర్వాత మంచి వాల్యూమ్‌తో పెరుగుతోంది. గత శుక్రవారం రూ.320 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో రూ.310/300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.410/450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.285 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏసీసీ: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర కరెక్షన్ అయిన ఈ షేరు ప్రస్తుతం కీలకమైన రూ.1,850 వద్ద మద్దతు తీసుకుంది. కొద్దిగా స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.2,058 వద్ద ముగిసిన కౌంటర్‌లో మదుపరులు రూ.2,020 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,200 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,980 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

23,000 వద్ద గట్టి పరీక్ష

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ ఈ వారంలో మరింత అప్రమత్త ట్రెండ్‌లో కొనసాగే అవకాశం ఉంది. మరోసారి ప్రధాన మానసిక అవధి 23,000 స్థాయికి చేరువవుతోంది. వారం రోజుల్లో ఈ స్థాయి వద్ద పరీక్ష ఎదుర్కొనడం ఇది నాలుగోసారి కావడంతో భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో కీలక స్థాయి 23,000 వద్ద మద్దతు తీసుకుని కన్సాలిడేట్ కావాలి. తదుపరి ప్రధాన నిరోధం 23,200. ఆ పైన టార్గెట్ స్థాయిలు 23,350, 23,500.

బేరిష్ స్థాయిలు: కీలక స్థాయి 23,000 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. అప్రమత్తత అవశ్యం.

బ్యాంక్ నిఫ్టీ: రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మానసిక అవధి, ప్రధాన మద్దతు స్థాయి 48,000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

పాటర్న్: సానుకూలత కోసం మార్కెట్ ఇప్పుడు 23,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. ఇది గతంలో ఏర్పడిన బాటమ్ కూడా కావడం వల్ల ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే మరింత బ్రేక్‌డౌన్ అయినట్లు భావించి అప్రమత్తం కావాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	23,130, 23,200
మద్దతు	23,000, 22,940

www.andhrajyothy.com

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

సోమవారం | 27-1-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో యుద్ధ ట్యాంకుల కవాతు



‘ఉగ్ర’ డ్రోన్ల ఉపద్రవం!

ఆఫ్రికా దేశాల్లో కొన్నేళ్లుగా నిఘా, పర్యవేక్షణకు డ్రోన్లను వినియోగించిన ఉగ్రవాద సంస్థలు

ఇప్పుడు పౌరులపై దాడులతో భయోత్పాతం.. సూడాన్ ఆస్పత్రిపై డ్రోన్ దాడి ఆ కోవలోనిదే

ఇదే రీతిలో ఇక్కడ ఉగ్రమూకలు దాడి చేస్తే? ఎదుర్కొనే సామర్థ్యం పోలీసులకు ఉందా?

మణిపూర్‌లో విద్రోహశక్తుల డ్రోన్ దాడులు.. ఆ ప్రాంతాల్లో యాంటీడ్రోన్ వ్యవస్థ ఏర్పాటు

పోలీసులకూ రోగ్ డ్రోన్లను ఎదుర్కొనే శిక్షణ ఇవ్వాలన్న ఎన్ఎస్‌జీ మాజీ చీఫ్ గణపతి

సుడాన్‌లో సౌదీ ఆస్పత్రిపై డ్రోన్ దాడి.. 70 మంది మృతి, 19 మందికి గాయాలు

10

ఏ పరికరమైనా.. పరిజ్ఞానమైనా.. వాడుకునేవారి మనస్తత్వాన్ని బట్టి ఉపయోగం ఉంటుంది. ప్రయాణికులను చేరవేయడానికి వాడే విమానాలనే ఆయుధాలుగా మార్చి అమెరికాలో జంట హర్మ్యాలను కూల్చేసిన అల్‌ఖైదా దురాగతం ఇందుకు ఓ ఉదాహరణ. ఇప్పుడు కాలం మారింది. ప్రాణాలను రిస్క్ చేసి మరీ పెద్ద విమానాలను హైజాక్ చేయాల్సిన పని లేకుండా.. ఉగ్రవాదులు దాడులకు చిన్నగా ఉండే డ్రోన్లను వాడటం మొదలుపెట్టారు.



ప్రత్యేక ఆకర్షణగా మన ‘ఏటికొప్పాక’ శకటం

చేతులూపుతూ ప్రధాని మోదీ అభివాదం

చప్పట్లతో కేంద్ర మంత్రి రామ్మోహన్ సంతోషం

కర్తవ్యపథ్‌లో సైనిక సత్తా

గణతంత్ర పరేడ్‌లో త్రివిధ దళాల విన్యాసాలు

సాయుధ పాటవానికి అద్దం పట్టిన వేడుకలు

3 మిగ్-29 ఎయిర్‌క్రాఫ్ట్‌లతో ఐఏఎఫ్ ఫ్లై-పాస్ట్

ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు సుబియాంటో

రాష్ట్రపతి ముర్ముతో కలిసి బగ్గీలో ప్రాంగణానికి రాక

శకటాల నుంచి విన్యాసాల వరకూ నారీ భేరి

10

7 నెలలు.. 6 లక్షల కోట్లు!

4 లక్షల ఉద్యోగాలు కూడా

రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రభుత్వ వివరణ

దావోస్ పర్యటనకు ముందే క్యూకట్టిన పెట్టుబడిదారులు

ప్రపంచ ఆర్థిక సదస్సులో మార్మోగిన ‘బ్రాండ్ ఏపీ’

మున్ముందు మరిన్ని రాక..

పారిశ్రామిక అనుబంధ సంస్థలు సైతం పుంజుకోవాలి: నిపుణులు

ప్రపంచస్థాయి దిగ్గజ సంస్థల రాక ఒకవైపు, జగన్ పాలనలో భయపడి వెళ్లిపోయిన వారి రాక మరోవైపు.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న సానుకూల వాతావరణాన్ని కళ్లకు కడుతున్నాయి. ముఖ్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై పారిశ్రామిక వేత్తల్లో ఏర్పడిన నమ్మకం.. ఏడు మాసాల స్వల్ప కాలంలోనే రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చింది. ఇటీవల ముగిసిన దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సుకు ముందే లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడతామంటూ అనేక మంది ముందుకువచ్చారు.



ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, సీఎం సతీమణి భువనేశ్వరి, గవర్నర్ సతీమణి సమీరా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో గడిచిన ఏడు మాసాల కాలంలో రూ.6,33,726 కోట్ల మేరకు పెట్టుబడులు వచ్చినట్టు ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రపంచస్థాయి దిగ్గజ వ్యాపార వేత్తలు సహా పెట్టుబడిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు పలుమార్లు భేటీ అయి పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, అనుకూల వాతావరణం సహా నైపుణ్యంతో కూడిన యువత విషయాలను సమగ్రంగా వివరించారు. దీంతో ఏడు నెలల్లోనే లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ముఖ్యంగా ‘విజన్-2047’ సహా

మిగతా 12వ పేజీలో...

తిరిగొచ్చిన గతం

2019-24 మధ్య జగన్ పాలనాకాలంలో రాష్ట్రానికి చెప్పుకోదగ్గ ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. అదానీ, రిలయన్స్ వంటి సంస్థలు జగన్ ప్రభుత్వ కాలంలో ఒప్పందాలు చేసుకున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. కానీ, కూటమి సర్కారు పగ్గాలు చేపట్టాక రాష్ట్రానికి పునర్వైభవం తిరిగి వచ్చిందని పారిశ్రామిక వేత్తలు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు విజన్, ఆయన

మిగతా 12వ పేజీలో...



గణతంత్ర వేడుకల్లో గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఆకలితో ఏ కుటుంబమూ నిద్రపోకూడదు

అందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం

10 సూత్రాల అమలుతో లక్ష్యాల సాధన

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ఊతం

2026 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి

స్వర్ణాంధ్ర సాకారానికి 15% వృద్ధిరేటు

2047నాటికి దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీ నిలుస్తుంది


ఏపీ బ్రాండ్ విలువను తిరిగి తీసుకొస్తాం

గణతంత్ర వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. 10 సూత్రాల అమలు ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని వివరించారు. ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను గవర్నర్ ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రసంగించారు. గత ప్రభుత్వం భారీగా

మిగతా 11వ పేజీలో...

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా!



ప్రజా సమస్యల పరిష్కారానికి ‘ఆంధ్రజ్యోతి’ మహత్తర కార్యక్రమం

రేపు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు.. ప్రజల చెంతకే అధికారులు, ప్రజా ప్రతినిధులు

నేరుగా సమస్యలు విన్నవించే చాన్స్.. పరిష్కారమయ్యే దాకా ప్రజలకు అండగా

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ‘అక్షరమే ఆయుధం’గా అక్షర సేద్యం చేస్తున్న ‘ఆంధ్రజ్యోతి’.. ప్రజా సమస్యల పరిష్కారానికీ నడుం బిగిస్తోంది. ఇప్పటి వరకు ప్రజల గొంతుకగా వారి సమస్యలను ఎప్పటికప్పుడు ఎలుగెత్తి చూపుతున్న ‘ఆంధ్రజ్యోతి’.. ఇకపై ఆ సమస్యల పరిష్కారానికి ఆచరణీయ పద్ధతిలో ముందుకు కదులుతోంది. ‘అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా’ అంటూ.. ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. దీని ద్వారా అధికారులు-ప్రజాప్రతినిధులకు, ప్రజలకు నడుమ వారధిగా మారనుంది. ఐదేళ్లుగా ఎక్కడికక్కడ పేరుకుపోయిన సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు తోడుగా నిలవనుంది. ప్రజల వద్దకే ప్రజా ప్రతినిధులను, అధికారులను తీసుకువచ్చి స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా చూపి, వాటికి పరిష్కారం సాధించడమే ‘ఆంధ్రజ్యోతి’ చేపడుతున్న ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా ప్రజలు తమ స్థానిక సమస్యలను నేరుగా నివేదించుకునేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక సదస్సులను నిర్వహించనుంది. తొలి కార్యక్రమం మంగళవారం పలు నగరాలు, పట్టణాల్లో జరుగుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు విని, పరిష్కార మార్గాలపై దృష్టిసారించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడనుంది. వెలగని వీధి దీపాల నుంచి రోజుల తరబడి తొలగని చెత్త దాకా.. రోడ్లపై గుంతల నుంచి కుళాయిల్లో రాని నీళ్ల దాకా.. ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టడం నుంచి ఆక్రమణలకు ముగింపు పలుకుతూ ప్రభుత్వ స్థలాలకు ప్రహరీలు నిర్మించే దాకా.. ఇలా ప్రజలు ప్రస్తావించే పలు సమస్యలపై అధికారులు, నేతలు దృష్టిసారిస్తారు. సమస్య తీవ్రత, నిధుల లభ్యతను బట్టి వారు తగిన నిర్ణయాలు తీసుకుంటారు. అలాగే ఈ సదస్సుల్లో నేతలు, అధికారులు ఇచ్చిన హామీలు పరిష్కారమయ్యేదాకా ‘ఆంధ్రజ్యోతి’ స్థానిక ప్రజల వెంట ఉంటుంది. ఆయా సమస్యలపై ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తుంది.

నాటి అరాచకాలపై దండయాత్ర!

లోకేశ్ పాదయాత్రకు రెండేళ్లు

జగన్ నిరంకుశత్వంపై గొంతెత్తిన యువనేత

జనం కన్నీళ్లు తుడుస్తూ.. బాధితులకు భరోసా ఇస్తూ.. 226 రోజుల పాటు ‘యువగళం’

అది సాగిన 97 నియోజకవర్గాల్లో 90 చోట్ల టీడీపీ కూటమిదే విజయం

యువత, మహిళలు, వృద్ధులు సహా వివిధ రంగాలకు హామీలు

ముఖ్యంగా ‘మిషన్ సీమ’ డిక్లరేషన్

ఆయన హామీలకే ‘సూపర్ సిక్స్’ రూపం

వాటి అమలుకు ప్రత్యేక యంత్రాంగం

12





‘ఎన్నికల’రోడ్లు రద్దు!

ఇప్పటిదాకా మొదలుపెట్టనివి.. 25% దాటని పనులు కూడా

2023-24 మధ్య రూ.2,300 కోట్ల విలువైన రోడ్ల పనులకు టెండర్లు

అత్యధిక వర్కులు వైసీపీ పెద్దలకే ఇంకొన్ని వారి బినామీలకు అప్పగింత

ఒక్క పనీ పూర్తిచేయని వైనం

వాటన్నిటినీ పరిశీలించి.. రద్దుచేసిన కూటమి సర్కారు

అయినా పాత కాంట్రాక్టర్లతోనే చేయించాలని కొందరు నేతల ఒత్తిడి

వైసీపీ నేతలతో రహస్య ఒప్పందాలు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయంలో జగన్ ప్రభుత్వం మంజూరుచేసిన రోడ్లు భవనాల (ఆర్ అండ్ బీ) శాఖ రహదారులు రద్దయ్యాయి. ఇప్పటి వరకు మొదలుపెట్టని రోడ్లు, ప్రారంభించినా 25 శాతంలోపే పురోగతి ఉన్న ప్రాజెక్టులను రద్దు చేస్తూ కూటమి సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో

మిగతా 12వ పేజీలో...



తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి బుధవారం జరిగే ప్రయోగం కోసం వేదికపై సిద్ధంగా ఉన్న జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్

నావిక్‌కు సరికొత్త కిక్

పౌర, సైనిక జీపీఎస్ సేవలు మరింత మెరుగు

29న ఎన్‌వీఎస్-02 ఉపగ్రహ ప్రయోగం

షార్‌లో వందో ప్రయోగానికి ఇస్రో సిద్ధం

జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా నింగిలోకి

10



సైనిక విమానాల్లో గెంటేస్తారా?

అక్రమ వలసదారులతో అమెరికా పంపిన రెండు విమానాలను తిరస్కరించిన కొలంబియా

యూఎస్ ప్రభుత్వం వలసదారులను నేరగాళ్లలా చూస్తోందంటూ కొలంబియా అధ్యక్షుడి ట్వీట్

గ్వాటెమాలకు.. 2 విమానాల్లో 160 మంది

డీపోర్టేషన్‌కు మిలటరీ విమానాలు వాడడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి

సైనిక విమానాలపై మెక్సికో అభ్యంతరం

నేపథ్యంలో ఇమ్మిగ్రేషన్ విమానాల్లో తరలింపు

12

మరింత చేరువగా సచివాలయాలు

జనాభా పరంగా ఏ, బీ, సీలుగా వర్గీకరణ

వైజ్ఞానిక సమాజ సృష్టి కేంద్రాలుగా మార్పు

ప్రభుత్వ బహుళ అవసరాలు, సాంకేతికత, ఆకాంక్ష విభాగాలుగా సిబ్బంది నియామకం

గిరిజన ప్రాంతాలకూ అనుసంధానం

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలను హేతుబద్ధీకరిస్తూ సచివాలయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులను ప్రభుత్వ బహుళ అవసరాలు, సాంకేతికత, ఆకాంక్ష(ఆస్పిరేషన్)లకు అనుగుణంగా విభజించనున్నారు. అదేవిధంగా 3,500 పైబడి జనాభా ఉన్న సచివాలయాలను ‘విభాగం-ఏ’గా, 2,501-3,500 జనాభా కలిగిన సచివాలయాలను ‘విభాగం-బీ’గా, 2,500

మిగతా 12వ పేజీలో...

రంగంలోకి బడా ‘పుష్ప’లు!

స్మగ్లర్ల రహస్య గోడౌన్లలో భారీగా ఎర్రచందనం నిల్వలు

ప్రభుత్వం దగ్గర ఉన్నదానికంటే ఎన్నో రెట్లు అధికంగా

గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు తరలించే యత్నాలు

చైనాలో పరిశ్రమలు తెరవడంతో ఎర్ర దుంగలకు డిమాండ్

దాడుల్లో పట్టుబడుతున్న వారిలో అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

గ్లోబల్ టెండర్లు పిలిస్తే మంచి ధర పలికే అవకాశం



(తిరుపతి(మంగళం)- ఆంధ్రజ్యోతి)

ఒకవైపు శేషాచలం అడవుల్లో ఎర్రచందనం దొంగల కదలికలు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు సోదాల్లో పెద్దఎత్తున ఎర్ర దుంగలు పట్టుబడుతున్నాయి. ఈ ధోరణి నిఘా వర్గాలకు మింగుడు పడటంలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడవుల్లో ఎర్రచందనం చెట్ల నరికివేత బాగా తగ్గింది. దొరికితే కఠిన చర్యలుంటాయని కూలీలు భయపడుతున్నారు. దీంతో స్మగ్లింగ్‌పై పట్టు సాధించామని టాస్క్‌ఫోర్స్ సంతృప్తి పడుతున్న సమయంలో ఎర్ర దుంగలు పెద్దసంఖ్యలో పట్టుబడుతున్నాయి. దీనిపై ఆరా తీసిన అధికారులు ఎర్ర స్మగ్లర్ల రహస్య గోడౌన్లలో భారీ ఎత్తున నిల్వలున్నట్టు గుర్తించారు. ఇన్నాళ్లుగా చప్పుడు లేకుండా ఉండిపోయిన స్మగ్లర్లు ఇటీవల వీటిని బయటకు తీసి మళ్లీ విదేశాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో దొరికిపోయిన వారినుంచి సేకరించిన

మిగతా 12వ పేజీలో...



నా గుండెలపై కూర్చున్న వ్యక్తిని గుర్తించా

అప్పట్లో తులసిబాబు ముఖానికి కట్టుకున్న కర్చీఫ్ జారింది


హత్యకు కుట్ర జరిగిందనడానికి నాటి కలెక్టర్ లేఖే ఆధారం

పరారీలో ఉన్న ప్రభావతి ఏ కలుగులో దాగారో?

నిందితుడు సునీల్‌కుమార్‌ను ఇంకా ఎందుకు సస్పెండ్ చేయడం లేదో?

గుంటూరు జిల్లా జైలులో నిందితుడి గుర్తింపు ప్రక్రియకు రఘురామ హాజరు

12



"జీవితంలోంచి వచ్చిన కథలే కాలంతో పాటు నిలుస్తాయి."

– గంధం యాజ్ఞవల్క్య శర్మ

గంధం యాజ్ఞవల్క్య శర్మ కథలన్నీ మధ్య తరగతి జీవితాల చుట్టూ తిరుగుతూ, ఆ జీవితాల్లోని ఈతి బాధలను చూపిస్తాయి. కథల్లోని పాత్రలతో మనల్ని మనం పోల్చుకుంటాం. పాతతరం రచయితల్లో మిగిలిన ఒకరిద్దరిలో ఆయన ఒకరు. వాకాటి పాండు రంగారావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, బీనా దేవి వంటి రచయితలు ఆయన సమకాలికులు. 1937 ఆగస్టు 16న సీతాపతి శర్మ, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. చదువు లింగంగుంట్ల, మాచర్ల, బాపట్ల, అమలాపురం, గుంటూరు ఇలా పలుచోట్ల సాగింది. 1958లో కో ఆపరేటివ్ డిపార్ట్మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి, 1995లో నరసరావుపేటలో సబ్ రిజిస్ట్రార్‌గా రిటైరయ్యారు. 170 కథలు, అరడజను నవలలు, కొన్ని నవలికలు, రేడియో నాటికలు రాశారు.

ఇంటర్వ్యూ ■ కరీం
✆ 99667 57407

మీ సాహితీ ప్రస్థానం ఎలా మొదలైంది?

మా తండ్రి గంధం సీతాపతి గారు కవి, పండితులు. మా పెద్దన్న గంధం వెంకా స్వామి శర్మ 1950వ దశకంలో చైతన్య పేరుతో మంచి కథలు రాశారు. ఆ వాతావరణం నాకు ఆసక్తి కలిగించి రచనా వ్యాసంగం వైపు రావడానికి దోహదం చేసింది. బీఎస్సీ చదువుతున్నప్పుడు 'గుంటూరు గోల' అనే కథ రాశాను. ఆంధ్ర పత్రికలో ప్రచురితమైంది. అది నా మొదటి రచన. మిత్రులు వాకాటి ప్రోత్సాహంతో కథలు, నవలలు, నవలికలు రాశాను. మధ్యలో కొంత కాలం రాయడం ఆపేసాను. మిత్రులు రచన శాయి నాచే మళ్ళీ రాయించారు. ఇప్పుడు వార్ధక్యం వల్ల పూర్తిగా రాయడం ఆపేసాను.

మీ కథలు ఎక్కువ మధ్య తరగతి జీవితాల్లోంచి వచ్చినవే అయ్యుంటాయి ఎందుకు?

నేను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఆ జీవితాలను, వ్యక్తులను దగ్గరగా చూశాను. వాళ్ళ సాధక బాధలను గమనించేవాణ్ణి. అవే ఇతివృత్తాలుగా కథలు రాశాను. అప్పట్లో పాఠకులు ఎక్కువగా మధ్య తరగతికి చెందిన వారే కావడంతో నా కథలు కనెక్ట్ అయ్యాయి అనుకుంటాను. నేనెప్పుడూ కల్పించి కథలు రాయలేదు. జీవితంలోంచి వచ్చిన కథలే కాలంతో పాటు నిలుస్తాయని నమ్ముతాను. నాకు బాగా పేరు తెచ్చిన 'సెలవయింది' కథ నిజ జీవిత ఘటన ఆధారంగా రాసిందే. చిన్నతనంలో మా ఊర్లో రాజు గారని పండరి భజన కళాకారుడు ఉండేవాడు. పండుగలకు, పబ్బాలకు గుళ్ళో పండరి భజన ప్రదర్శించే వాడు. ఆయన ప్రదర్శన చూడటానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం వచ్చేవారు. అంత పేరు. కాలక్రమంలో ఆ కళ నిరాదరణకు గురి కావడంతో చివరి రోజుల్లో దుర్భర పరిస్థితులు అనుభవించాడు. ఒకనాడు గుంటూరులో మా ఇంటికి వస్తే మా అమ్మ భోజనం పెట్టి, కొంత డబ్బిచ్చింది. ఆయన దుస్థితి చూసి చలించిపోయి, ఆయన పాత్రతో కథ రాశాను. ఈ కథను త్రివేణి పత్రిక సంపాదకులు కోలవెన్ను రామ కోటేశ్వర రావుగారు మెచ్చుకోవడం నాకు దక్కిన గొప్ప ప్రశంస. బుచ్చిబాబు, మధురాంతకం రాజారాం నా అభిమాన రచయితలు.

కోలవెన్ను రామ కోటేశ్వరరావు గారితో మీ సాంగత్యం ఎలా సాధ్యమైంది?

ఇప్పటి తరం వాళ్లకు వారి గురించి తెలీదు. వారు స్వాతంత్ర్య సమర యోధులు. స్వాతంత్ర్యానికి పూర్వం పల్నాడు ప్రాంత శాసన సభ్యులుగా ఉన్నారు. బందరు జాతీయ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. వారి సంపాదకత్వంలో 'త్రివేణి' పత్రిక వెలువడింది. నెహ్రూ, సర్వేపల్లి, సరోజినీ నాయుడు వంటి ప్రముఖులు కూడా 'త్రివేణి'కి రచనలు పంపేవారు. నేను ఉద్యోగ రీత్యా నరసరావుపేటకు వెళ్ళవలసి వచ్చినప్పుడు, మా తండ్రి గారికి ఈ విషయం చెబితే, ఆయన 'అక్కడ మా గురువు కోలవెన్ను రామకోటేశ్వరరావు గారు వుంటారు వారిని కలిసి సాష్టాంగ నమస్కారం చేయ'మన్నారు. నరసరావుపేటకు వెళ్ళినప్పుడు వారిని కలిశాను. ఫలానా వారి అబ్బాయిని అని చెప్పా. అప్పటి నుండి వారు చనిపోయేవరకు మా అనుబంధం కొనసాగింది. వారి సాంగత్యంలో నేనెంతో నేర్చుకున్నాను. ఆయనను కలవడానికి వచ్చిన ప్రముఖులెందరినో చూడగలిగాను. కంటి చూపు మందగించటంతో ఎన్నో ఇంగ్లీష్ పుస్తకాలను ఆయనకు చదివి వినిపించే వాణ్ణి. ఆ క్రమంలో నా ఇంగ్లీష్ ఎంతో మెరుగైంది. వారి సాంగత్యం నా పూర్వజన్మ సుకృతం.

మీకు సాహిత్యంలో రావల్సిన గుర్తింపు రాలేదు. ఎందుకంటారు?

నేను పుంఖాను పుంఖాలుగా రాసిన వాణ్ణి కాదు. సంఘటనలకు స్పందించి మాత్రమే రాశాను. స్వభావ రీత్యా నేను అంతర్ముఖంగా వుంటాను. సాహిత్యంలో గుర్తింపు రావాలంటే చొరవ ముఖ్యం. అది నాకు తక్కువ. పైగా ఉద్యోగరీత్యా వచ్చి నేను నరసరావుపేటలోనే స్థిరపడిపోయాను. సాహిత్య సభలు, సమావేశాలు నగర కేంద్రంగా జరుగుతాయి. అలాంటప్పుడు నన్ను ఎవరు పట్టించుకుంటారు. గుర్తింపును నేనెప్పుడూ ఆశించలేదు. అందుకే రాలేదన్న భాధా లేదు.

మీ అబ్బాయి నాగరాజు గంధం గురించి చెప్పండి?

మా అబ్బాయి నాగరాజు గంధం మరణం నాకు తీరని లోటు. మంచి చదువరి. అతని కల్పన శక్తి అమోఘం. నాగరాజు మొదటి కథ 'చెరువు'కు ఎంతో పేరు వచ్చింది. ఆంగ్లంలోకి అనువదించబడింది. ఆ తర్వాత చాల కథలు, నవలలు రాశాడు.



> **నాకు సాహిత్యంలో పెద్దగా గుర్తింపు రాలేదు గాని, గంధం నాగరాజు తండ్రిగా నన్ను చాలామంది గుర్తించారు. ఇప్పటికీ ఎవరైనా నాకు నేను పరిచయం చేసుకున్నప్పుడు స్పందించిన దాని కంటే, మా అబ్బాయి పేరు చెప్పగానే "మీరు నాగరాజు ఫాదరా!" అంటూ ఆశ్చర్యంగా స్పందిస్తుంటారు.**

నాటకాలు, నాటికలు రాశాడు. నంది బహుమతుల వచ్చాయి. సినీ దర్శకులు క్రిష్‌తో కలిసి 'గమ్యం' సినిమా చేశాడు. ఆ సినిమా మా అబ్బాయికి, క్రిష్‌కు తొలి ప్రయత్నమే. ఇద్దరికీ మంచి పేరు వచ్చింది. నాగరాజు సంభాషణలకు గొప్ప రెస్పాన్స్ వచ్చింది. ఆ సినిమా తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. 'ఇంకోసారి', 'బాణం', 'గాయం-2', 'బెట్టింగ్ బంగార్రాజు' సినిమాలకు మాటలు అందించాడు. సినిమా రంగంలో నిలదొక్కుకుంటున్నాడని అనుకుంటున్న తరుణంలో మాకు విషాదాన్ని మిగిల్చి వెళ్ళిపోయాడు. నాకు సాహిత్యంలో పెద్దగా గుర్తింపు రాలేదు గాని, గంధం నాగరాజు తండ్రిగా నన్ను చాలామంది గుర్తించారు. ఇప్పటికీ ఎవరైనా నాకు నేను పరిచయం చేసుకున్నప్పుడు స్పందించిన దాని కంటే, మా అబ్బాయి పేరు చెప్పగానే "మీరు నాగరాజు ఫాదరా!" అంటూ ఆశ్చర్యంగా స్పందిస్తుంటారు.

ప్రస్తుతం కథా సాహిత్యంపై మీ అభిప్రాయం?

ఇంటర్నెట్ ప్రపంచీకరణ నేపథ్యంలో కథా సాహిత్యం ఇతివృత్తంలోనూ, శైలిలోనూ ఉన్నత స్థాయిలో వుంది. ఖదీర్ బాబు, కుప్పిలి పద్మ, సుజాత వేల్పూరి, కల్పన రెంటాల వంటి కథకులు తమకే ప్రత్యేకమైన శైలిలో గొప్ప కథలు రాస్తున్నారు. ఈ తరం తెలుగు సాహిత్యంతో పాటు ఆంగ్ల సాహిత్యం చదువుతుండటం అభినందించదగ్గ విషయం. ఎక్కువ చదివి తక్కువ రాయమని కొత్తగా రాసేవాళ్ళకు నా సలహా.


సోమవారం 27 జనవరి 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్





బాలార్కుడు

ఒక పున్నమి రాత్రి చందమామ మా ఇంటి మీదుగా వెళ్తుంటే జాబిల్లిలోని కుందేలు పిల్ల ఒక్క ఉదుటున పెరట్లోని జాం చెట్టు కొమ్మ పైకి దూకి చూస్తుండగానే మాయమై పోయింది. లోపలి గది లోకెళ్లి చూడగా మా అమ్మాయి పొత్తిళ్లలో మా మనవడు.

నిన్నటి నుండీ ఆమే నేనూ పండిన పెసరచేను ఎండకు పగులుతున్నట్టు ఒకటే పగులుతున్నాం. చేను, చెక్కా లేని మాకు ఈ చిటపటలేంటి అని చూస్తే ఇల్లంతా పచ్చని పెసర చేనులా పరుచుకున్న మా మనవడు.

నిర్మలంగా, నిశ్చలంగా ఉన్న కొలనులో నింగికి నమస్కరిస్తూ నిలుచున్న కలువ మొగ్గ గండుచేప తోక విసురుకు ఒక్కసారిగా చలించినట్లు దేహమంతా ఒకటే అనుకంప. చేపలు పట్టేవాడు వెదురు బద్దల బుట్టతో చెరువు అంతా గాలించి గాలించి చివరికి లోపలికి చేయి పెట్టి బయటికి తీసిన చేపలా మా మానస సరోవరంలో ఈదులాడే చేప మా మనవడు.

ఊరంతా సద్దుమణిగాక
దూరం నుండి లీలగా
గజ్జెలసవ్వడి... ఢంకా ధ్వానం.
ఎక్కడో శివారుపల్లెలో జాతర జరుగుతుందేమో
అనుకున్నాను. లోపలికి వెళ్లి చూస్తే
వెల్లకిలా పడుకొని
కాళ్లు చేతులతో
గాలి సైకిల్ తొక్కుతూ
మా మనవడు.

దుర్గమారణ్యాల
ఇరుకు దారులగుండా
గులకరాళ్ళను వొరుసుకుంటూ
దిగువకు దొర్లుకుంటూ వస్తున్న
సన్నటి సెలయేటి గల గల.. ఎక్కడెక్కన్నుంచీ అని
తరచి చూస్తే నా మనసు చేదబావిలో గిలకలు వేస్తూ
తరంగిస్తున్న మనవడు తాబేలు.


నడి రాత్రి గాఢ సుషుప్తిలో
దూరపు వనాల నుండి
ఒక్కటే కేకుల క్రేంకారావాలు.
వనాలకోసం ఊరంతా కలయ చూస్తుంటే
మా లోపలే మా మనసు మోడు చెట్లకు
చిగురుటాకుల పసరిక ను అద్దుతూ కొమ్మ కొమ్మకు గెంతుతూ
మా మనవడు నెమలి.

ప్రాచీ దిశ దిగంతరేఖ మీద కొండంత ప్రభాత సంధ్య.
ఇంటికొచ్చి చూస్తే
ఇంట్లో జ్వలించే శత సహస్ర అంచుల గొప్ప కాంతిపుంజం.
కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకుని పరికిస్తే
అనంత కోటి నవ్వుల కిరణాల బాలార్కుడు మా మనవడు.

■ శిఖామణి
✆ 98482 02526

దేవలోకపు పాటకు ప్రేమలేఖ

"రఫీ శ్రావ్యమైన గొంతులో పాట నీ దాకా వచ్చినప్పుడు అది చుట్టూ ఉన్న రద్దీ నుంచి నిన్ను దూరంగా ఒక దేవలోకంలోకి తీసుకుపోతుంది. అక్కడ ద్వేషం, ఈర్ష్య, నువ్వూ నేనూ అన్న తేడాలు ఏవీ ఉండవు. శాంతి ఎల్లెడలా విస్తరించి ఉంటుంది. ఆనందం మన నుదుటిని ముద్దాడుతూంటుంది" – 'యాన్ ఈవినింగ్ విత్ రఫీ' అనే హెచ్.ఎమ్.వి వారి కేసెట్ కోసం మహానటుడు పృథ్వీరాజ్ కపూర్ ఇచ్చిన సందేశమిది. రఫీ పాట గురించి ఇంతకంటే అందంగా ఇంకెవ్వరూ చెప్పలేరనిపిస్తుంది. 1950–1970ల మధ్య కాలాన్ని భారతీయ సినీ సంగీత ప్రియులు రఫీ యుగంగా భావిస్తారు.



రఫీ సినిమా పాటనూ, జీవితాన్నీ తెలుగు పాఠకుల ముందు నిలిపే ఒక అద్భుత ప్రయత్నం సాహితీవేత్త సి. మృణాళిని రచించిన 'రఫీ – ఒక ప్రేమ పత్రం' పుస్తకం. భారతీయ బాషల్లో రఫీపై వచ్చిన పుస్తకాల్లో ఇది ప్రత్యేకమైంది. రఫీ బాల్యాన్ని, ఆ వయసులోనే సంగీతం పట్ల అతనికున్న అవగాహనను నిశిత పరిశీలన ద్వారా వివరించారు మృణాళిని.

'చౌదవీకా చాంద్ హో' వస్తున్నపుడు వెన్నెలే తప్ప పాట వినిపించక పోవడం రఫీ గొంతు విశిష్టత. ఇదే కాదు రఫీ పాడిన ప్రతి పాటా శ్రోతను నేరుగా సన్నివేశానికి తీసుకుపోతుంది. రఫీ 1924 డిసెంబర్ 24న పంజాబ్ లోని కోట్లా సుల్తాన్ సింగ్ గ్రామంలో జన్మించాడు. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండటంతో వారు లాహోరుకు వలస వెళ్లారు. అక్కడ క్షుర వృత్తి చేపట్టాడు. 1943లో లాహోర్ రేడియోలో గాయకుడయ్యాడు. 'సోనియే నీ, హీరియే నీ, తేరీ యాద్ నే ఆన్ సతాయా' అనే పాటను శ్యామ్ సుందర్ సంగీత దర్శకత్వంలో పాడాడు. అవకాశాల కోసం మకాం బొంబాయికి మారింది. అక్కడ కూడా శ్యామ్ సుందరే రఫీకి 'గావ్ కీ గోరే' హిందీ చిత్రంలో పాడే అవకాశమిచ్చారు. తర్వాత మళ్లీ ఎవరూ అవకాశం ఇవ్వలేదు. సుప్రసిద్ధ సంగీత దర్శకులు నౌషాద్ తండ్రి వాహెద్ అలీ రఫీ పాట విని తన కొడుక్కి రఫీ గురించి సిఫారసు చేసాడు. 'పెహలే ఆప్' చిత్రంలో బృంద గానంలో ఒకరిగా అవకాశం వచ్చింది. ఆనాటి నుండి రఫీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. భారత దేశం అతని గొంతుకు బ్రహ్మరథం పట్టింది.



మృణాళిని పుస్తకం రఫీ పాటలతో హీరోలుగా వెలుగొందిన వారిని, అతనితో పాడించిన సంగీత దర్శకులను స్మరించుకుంటూ, రఫీ పాడిన అమృత గీతాలను మరోసారి గుర్తు చేసుకుంటూ పుస్తకం సాగడం పాఠకులకు మధురానుభూతిని కలిగిస్తుంది. మృణాళిని ఈ పుస్తకాన్ని 14 భాగాలుగా విభజించారు. అరుదైన

> **రఫీ సినిమా పాటనూ, జీవితాన్నీ తెలుగు పాఠకుల ముందు నిలిపే ఒక అద్భుత ప్రయత్నం సాహితీ వేత్త సి. మృణాళిని రచించిన 'రఫీ – ఒక ప్రేమ పత్రం' పుస్తకం. రఫీ పాటలతో హీరోలుగా వెలుగొందిన వారిని, అతనితో పాడించిన సంగీత దర్శకులను స్మరించుకుంటూ, రఫీ పాడిన అమృత గీతాలను మరోసారి గుర్తు చేసుకుంటూ పుస్తకం సాగడం పాఠకులకు మధురానుభూతిని కలిగిస్తుంది.**

చిత్రమాలికను, పాటల తోటని అందించారు. 'ముల్లోకాలను మురిపించిన పాట' అనే భాగంలో ప్రపంచ వేదికలపై స్టాండింగ్ ఒవేషన్ అందుకున్న క్రమాన్ని కవితాత్మకంగా వివరించారు. 'ఆకాశంలో ఎగరాలని వుంది'లో రఫీ జీవితంలోని ఉత్థాన పతనాలను వివరించారు. వేదికల మీద రఫీ చేసిన గళ విన్యాసాలు విని తీరాల్సిందేనని రచయిత్రి తెలిపిన విధానం ప్రత్యేకంగా వుంది.

రఫీ పాటలు వినడమంటే ఒక్కోసారి మన మనసును వినడమూ, మరోసారి మన మనసును ఇంకా ఉన్నతం చేసుకోవడమని శ్రోతల ప్రపంచమంటుంటే ఆయన మాత్రం "నేను సంగీత దర్శకుడి చేతిలో రాయిని. అతను పాడమన్నట్టు పాడతాను. ఆపైన అల్లాః దయ" అనే వినయశీలి. 1944లో మొదలుపెట్టి, 1980 వరకూ దాదాపు విరామం లేకుండా పాడి సినీ గీతాల అభిమానులకు నిత్య జీవితంలో అంతర్భాగమైపోయాడు రఫీ. తమ జీవితాల్లో అనేక సందర్భాల్లో రఫీని తలుచుకుంటూ తమ బాధను మరిచి పోయిన వారూ, ఆనందాన్ని పెంచుకున్నవారూ ఉన్నారు.

ప్రతి పాటను సొంతం చేసుకోవడం రఫీకి తెలిసిన రహస్యమని చెప్పుకోవచ్చు. తెరపై అభినయిస్తున్న నటుడి కంటే, కథను రాసిన రచయితకంటే, కథను చెబుతున్న దర్శకుడి కంటే ఎక్కువగా రఫీ ఆ సన్నివేశాన్ని, పాత్ర మనోభావాలని తనలో నింపుకుంటాడు. తనే ఆ పాత్ర అయిపోతాడు. అందుకే పాట వింటున్నంత సేపూ మనలో కూడా అదే భావం, అదే అనుభూతి కలుగుతాయి.

ఒకానొక సమయంలో సినిమా అవకాశాలు సన్నగిల్లాయి. ఆ సమయంలో ప్రైవేటు ఆల్బంలలో పాడడం మొదలు పెట్టాడు. అవి కూడా సినిమా పాటలతో సమాన స్థాయిలో ప్రజాదరణ పొందాయి. నిజానికి జీవితంలో రఫీ కోరుకున్న ఆనందాలు చాలా చిన్నవి. ఇష్టమైన వాళ్లతో ఇంట్లో భోజనం చేయడం, తనకిష్టమైన ఆటలు ఆడుకోవడం, కుటుంబసభ్యులతో కబుర్లు చెప్పడం వంటివి. ఏ నిర్మాతకైనా, ఎంత చిన్న సంగీత దర్శకుడికైనా తను పాడడం వల్ల ఎంతో కొంత మేలు జరుగుతుందని తెలిస్తే వెంటనే ఒప్పుకునేవాడు. రఫీ ఎంత గొప్ప కళాకారుడో, అతని వ్యక్తిత్వం కూడా గొప్పది కనుకనే అతన్ని జనం హృదయాల్లో నిలుపుకున్నారు. గంధర్వలోకం నుంచి వచ్చి ఆనందాన్ని పంచి 57 ఏళ్ల వయసులో గంధర్వ లోకానికి వెళ్ళిపోయాడు. సుప్రసిద్ధ సంగీత దర్శకులు నౌషాద్ 'రఫీ సాబ్ సంగీత ప్రపంచానికి ప్రవక్త' అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. వినూత్నమైన సమాచారంతో తెలుగు వారికి అద్భుతమైన ఈ పుస్తకాన్ని అందించిన రచయిత్రి కృషి అభినందనీయం.



■ ర్యాలి ప్రసాద్
✆ 94945 53425

కదలని నేలపై కదిలే నురుగు కెరటాలు

నిండుజీవితానికి సాక్ష్యంగా
పండుజుత్తుతో తుదిశ్వాసవిడిచి,
దశాబ్దాలుగా మట్టిన నిద్రిస్తున్న తాత,
నిలువెత్తు మొలకెత్తి
తొంగిచూస్తూ పలకరిస్తున్నట్టు
కట్టెదుట రెల్లుపూలు!

వేడి వేసవి నుండి వరదలతో సేదదీరుతున్న
భూమితల్లికి వీస్తున్న వింజామరల తూలికలు!
ఆకాశమంత వెన్నెల్లో
శరత్కాలమేఘం పచ్చమైదానాన్ని సుతారంగా
ముద్దాడుతున్న వైనం!

అమాసరేయి కదలాడుతూ
భయపెడుతున్న తెల్లసింహాల మంద.

గాలి కదలాడినంతసేపూ
కదలని నేలపై కదిలే నురుగుకెరటాలు!

కనుచూపుమేరా పూచిన తెల్లజెండాలను
ప్రపంచ యుద్ధోన్మాదుల చేతికి
అతికించాలని ఉంది! చాలుతాయో? చాలవో?

■ గార రంగనాథం
✆ 98857 58123

తొందరపడి ముందే కూసిన కోయిలని!

నా మొదటి పుస్తకం

మందరపు హైమవతి



మా నాన్న గారిని సాహిత్యమంటే బాగా పిచ్చి. చిన్నప్పటి నుంచీ నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని పుస్తకాలు చదివించేవారు. సాహిత్య సభలకు తీసుకు వెళ్ళేవారు. అలా సాహిత్యమంటే నాకూ అభిరుచి కలిగింది. నా పన్నెండవ ఏట నుంచీ కవిత్వం రాయడం మొదలుపెట్టాను. అప్పుడు పువ్వు విరిసినా, పక్షి ఎగిరినా, వెన్నెల కురిసినా ప్రతిదాన్నీ కవిత్వీకరించేదాన్ని. కవితా సంపుటాలను చదివినప్పుడల్లా నా కవితలను కూడా పుస్తక రూపంలో చూసుకోవాలని కోరికగా వుండేది. పెద్దలు ఇప్పుడే వద్దు అన్నారు కానీ ఒక విధమైన బాల్య చాపల్యంతో పుస్తకం తీసుకు వచ్చేదాకా ఊరుకోలేదు. అలా తొందరపడి ముందే కూసిన కోయిలలా వచ్చిన పుస్తకమే 'సూర్యుడు తప్పిపోయాడు', నా మొదటి కవితా సంపుటి. దీనిలో నేను మొదట రాసిన కవితలు కూడా ఉన్నాయి. 32 కవితల ఈ సంపుటి 1982 డిసెంబర్‌లో వచ్చింది.

అభ్యుదయ దృక్పథంతో రాసిన ఈ పుస్తకానికి ఆరుద్ర ముందుమాట రాసారు. స్పందన సాహితీ సమాఖ్య తరఫున గుత్తికొండ సుబ్బారావు పుస్తకం ప్రచురించారు. కవితలు రాయడం తప్ప ముద్రణ గురించి నాకేమీ తెలీదు. డా. జి.వి. పూర్ణచంద్ ప్రచురణ బాధ్యత తీసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పుస్తక ప్రచురణ కోసం రూ.900 ఆర్థిక సహాయం చేసింది. బాలి కవర్ పేజీ వేశారు.

ఈ సంపుటిలో మొదటి కవిత 'సూర్యుడు తప్పిపోయాడు'. "చైతన్య మాత పెద్ద కుమారుడు/ మానవత ఇంటిపేరు గల వాడు/ అభ్యుదయ సూర్యుడు తప్పిపోయాడు" అని ఈ దేశంలో అభ్యుదయం లేదనే అభిప్రాయంతో ఈ కవిత కొనసాగుతుంది. 'ఉదయిస్తాడు సూర్యుడు' అనే కవితతో సంపుటి ముగుస్తుంది.

1980లలో స్త్రీ వాద కవిత్వం మొదలైనా ఈ సంపుటిలో ఆ ఛాయలేమీ కనపడవు. 'అపుత్రస్యగతిర్నాస్తి' కవిత మాత్రం ఒక ముసలి తల్లి వేదన. కొడుక్కి దూరంగా పల్లెటూళ్లో వున్న ఒక ఒంటరి తల్లి కథ. "ఆ రోజు మబ్బులు ముసిరి/ మసకబారి పోయే జాబిలి/ సురభిళ రమ్యం యౌవన సుమం/ వాడకముందే వీడిపోగా పతి/ సుఖాల ఆతపత్రచ్ఛాయలనమర్చిన/ కరుణామహితవల్లి ఆమె/ మాతృదేవోభవ అని తల్లికి పూజ్యస్థానం ఇస్తూ



ముసలితనం ముసిరినాక విసిరి కొట్టు వీరు.. ఏ మహోన్నత సంస్కృతికి వారసులు/ ఏ ప్రాచీన నాగరికతకు ప్రతీకలు" అని ప్రశ్నిస్తూ కొడుకుల నిరాదరణకు గురైన అభాగ్య మాతృమూర్తుల దీనస్థితిని చిత్రించిన కవిత ఇది. ముందు మాటలో ఆరుద్ర ఈ కవితను ప్రస్తావిస్తూ కేవలం ఆడపిల్ల మాత్రమే రాయగలిగిన కవిత అని అన్నారు. ఈ పుస్తకాన్ని డా. బెజవాడ గోపాలరెడ్డి ఆవిష్కరించారు. సంజీవదేవ్ సభకు అధ్యక్షత వహించారు. ఎం.ఎ. మూర్తి మాట్లాడారు. పిల్లలు నడిచేటప్పుడు తప్పటడుగులు వేస్తారు. పడుతూ లేస్తూ నడక నేర్చుకొంటారు. నా తొలి సంపుటి కూడా ఇలాంటిదే. "మేఘమాలికల స్వాప్నిక గగన విహారమిక చాలించుము/ అబ్బు సాచి పైకి చూచే చూపులనిక భూమిపైన సారించుము" అని కొన్ని చోట్ల గ్రాంథిక భాషా వాసన కనిపిస్తుంది.

నా కవితలను పుస్తక రూపంలో రావాలనుకొన్న కోరిక నెరవేరి పుస్తకం చేతిలోకి వచ్చాక ఆనందంతో ఎగిరి గంతేసినట్లు అనిపించింది. నా తొలి పుస్తకాన్ని నా తల్లిదండ్రులు మందరపు దుర్గాంబ, మందరపు కాసులు గారికి అంకితమిచ్చాను. అప్పుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మ ఎడిటర్‌గా ఆంధ్ర జ్యోతి వీక్లీ వచ్చేది. ఆ వీక్లీలో పని చేస్తున్న అఫ్సర్ నా పుస్తకం మీద రివ్యూ రాసారు. 1985లో ఈ పుస్తకానికి కృష్ణశాస్త్రి అవార్డు వచ్చింది. ఆ తర్వాత 2004లో నా రెండవ కవితా సంపుటి 'నిషిద్ధాక్షరి' వచ్చింది.

సాహిత్య సమాలోచన

జమిలి సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జనవరి 27 సా.4 గంటల నుంచి 9 గంటల వరకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో కవి సిద్ధార్థ కవితా సంపుటాలపై (దీపశిల, బొమ్మలబాయి, మల్లెలతీర్థం మహాఖననం) కవిత్వ, తత్వ, అస్తిత్వ విచారణలో విమర్శకులు కె. శ్రీనివాస్, అంబటి సురేంద్ర రాజు, మామిడి హరికృష్ణ, త్రివేణి, భాను శ్రీ కొత్వాల్, బుచ్చన్న, ఆదిత్య తదితరులు పాల్గొంటారు.

జమిలి సాహిత్య సాంస్కృతిక వేదిక

ఉమర్ ఆలీ షా సాహిత్యంపై సదస్సు

'బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం – బహుముఖీనత' అంశంపై రెండు రోజుల సదస్సు తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నైలో జరుగుతుంది. జనవరి 27 ఉ.10గంటలకు మొదలయ్యే ఈ సదస్సులో అమెరికా, ఆఫ్రికా, యూకే, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి మొత్తం 66 మంది పత్ర సమర్పణ చేస్తారు. సద్గురు ఉమర్ ఆలీ షా, భువన చంద్ర, కోయి కోటేశ్వరరావు, వాసిలి వసంత కుమార్ తదితరులు పాల్గొంటారు.

విస్తాలి శంకరరావు

'గూడు చెదిరిన దృశ్యం' కవితా సంపుటి

కొండి మల్లారెడ్డి కవితా సంపుటి 'గూడు చెదిరిన దృశ్యం' ఆవిష్కరణ సభ జనవరి 30 సా.6గంటలకు సిద్ధిపేట ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది. ప్రొఫెసర్ కోదండరాం, జూకంటి జగన్నాథం, బూర్ల వేంకటేశ్వర్లు, పర్కపెల్లి యాదగిరి, గఫూర్ శిక్షక్ హాజరవుతారు.

తెలంగాణ రచయితల వేదిక

విమర్శకునితో ఒక సాయంత్రం

సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో 'విమర్శకునితో ఒక సాయంత్రం' కార్యక్రమంలో ఏటుకూరి ప్రసాద్ ప్రసంగిస్తారు. తర్వాత ఆహూతులతో ముఖాముఖి ఉంటుంది. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 1 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

ఎస్వి సత్యనారాయణ

కవిరాజు త్రిపురనేని పురస్కారం

సూతపురాణం శతవసంతాల వేడుక, త్రిపురనేని జాతీయ పురస్కార సభ కార్యక్రమం జనవరి 29 ఉ.10గంటలకు జేకేసీ కాలేజ్ ఆడిటోరియం గుంటూరులో జరుగుతుంది. పురస్కారాన్ని దేవరాజు మహారాజు, కొత్తపల్లి రవిబాబు స్వీకరిస్తారు. గద్దె మంగయ్య, బైరపనేని నరేష్, ఆలోకం పెద్దబ్బయ్య, జొన్నలగడ్డ రామారావు, రావెల సాంబశివరావు తదితరులు పాల్గొంటారు.

త్రిపురనేని సాహితీ సమితి



గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, చిత్రంలో సీఎస్ విజయానంద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సమష్టి కృషితో జిల్లాను నెం.1గా నిలుపుదాం

గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ లక్ష్మీశ

517 మందికి ఉత్తమ సేవా పత్రాల అందజేత



కృష్ణలంక, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం స్ఫూర్తితో స్వర్ణాంధ్ర 2047 ఆశయాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో జిల్లా ప్రగతికి ఐక్యతతో టీం ఎన్టీఆర్‌గా కృషి చేసి నంబర్ వన్‌గా నిలుపుదామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడ పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. పోలీస్ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రగతి నివేదికపై ఆయన ప్రసంగించారు. పది సూత్రాల వృద్ధి సోపానాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన విజన్ డాక్యుమెంట్‌లోని లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు-వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ, శక్తి-ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత మార్గదర్శక సూత్రాల స్ఫూర్తిగా పనిచేయాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, వ్యక్తిగతంగా, బృందంగా సామాజిక సేవలో భాగస్వాములవుతున్న విశిష్ట వ్యక్తులు మొత్తం 517 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి తదితరులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, రూరల్ జోన్ డీసీపీ కేఎం మహేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ జాతీయ జెండాను ఎగురవేశారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా నుంచి హస్తినకు..

కొసరాజు లీలా కృష్ణకు 'పద్మ'పై ఉమ్మడి కృష్ణా వాసుల హర్షం

6లో



మువ్వన్నెల రెపరెపలు

- జాతీయ జెండా ఎగురవేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- వేడుకలకు హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు

ఐజీఎంసీలో ఘనంగా గణతంత్ర వేడుకలు



గణతంత్ర వేడుకల్లో సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్

విజయవాడ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఘనంగా జరిగాయి. గవర్నరు అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు దంపతులు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, కొలుసు పార్థసారథి, సీఎస్ విజయానంద్, డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్, న్యాయమూర్తులు హాజరయ్యారు. తొలుత సాయుధ దళాల నుంచి గవర్నరు నజీర్ గౌరవ వందనం స్వీకరించారు. కవాతులో ఇండియన్ ఆర్మీ, యూత్ రెడ్‌క్రాస్, ఏపీఎస్పీ మూడో బెటాలియన్(కాకినాడ), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సీఆర్పీఎఫ్, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల విద్యార్థులు, తమిళనాడు స్పెషల్ పోలీసు, ఎన్‌సీసీ బాలికలు, ఏపీఎస్పీ 16వ బెటాలియన్(విశాఖపట్నం), ఎన్‌సీసీ బాలురు, ఏపీఎస్పీ బ్రాస్‌బ్యాండ్, ఇండియన్ ఆర్మీ బ్యాండ్, రాష్ట్ర స్పెషల్ పోలీస్ బ్యాండ్ వారు పాల్గొన్నారు. ఐపీఎస్ అధికారి అంకిత సురానా పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. ఈ కవాతు క్రమ శిక్షణ, నిబద్ధత, దేశభక్తిని ప్రదర్శించింది. ఈ కవాతులో ఇండియన్ ఆర్మీ, తమిళనాడు స్పెషల్ పోలీసులు, సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల విద్యార్థుల కంటింజెంట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఎన్‌సీసీ బాలుర కంటింజెంట్‌కు ప్రత్యేక బహుమతిని అందజేశారు. కంటింజెంట్లకు నేతృత్వం వహించిన అధికారులు ఈ బహుమతులను గవర్నరు నుంచి అందుకున్నారు.

సమస్యలపై అక్షర యుద్ధం



మచిలీపట్నం ఒకటో డివిజన్ ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలో పారని మురుగు

- రేపు విజయవాడ 13వ డివిజన్, మచిలీపట్నం ఒకటో డివిజన్‌లో సమస్యలపై సదస్సులు
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఆయా డివిజన్లలో సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు

కృష్ణానది చెంతనే ఉన్నా.. వారికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించలేని పరిస్థితి. పక్కనే నది పారుతున్నా ఎక్కడో గుణదల గంగిరెద్దుల దిబ్బ నుంచి కృష్ణా నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి. పోనీ అవైనా సరిపడా వస్తున్నాయా అంటే అదీ లేదు. దీంతో విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్ వాసులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. దీనికితోడు వరదనీటి మళ్లింపు కాల్వలు (స్టామ్ వాటర్ డ్రెయిన్లు) లేకపోవటం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లడం కష్టంగా మారింది. నీరు రోడ్లపై రోజుల తరబడి నిలిచిపోతుంది. ఫలితంగా గుంతలు పడి రోడ్లు దెబ్బతింటున్నాయి. వీటిపై ప్రయాణం నరకంగా మారింది. భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ) వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల కాలనీల్లో మురుగు ఎగదన్నుతోంది. దోమల నివారణా చర్యలు లేకపోవడం వల్ల దోమల బెడద.. కుక్కల స్వైరవిహారం వంటి సమస్యలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● కృష్ణాజిల్లా మచిలీపట్నం 1వ డివిజన్‌లోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, సోమలీల, దేవుడిచెరువు, ఆనందపేట, పీకేఎం కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. అధ్వానంగా రోడ్లు, పారుదలలేని మురుగు, కనీస వసతులు కరువైన పార్కు, వెలగని వీధి దీపాలతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చేందుకు 'ఆంధ్రజ్యోతి' నడుం బిగించింది. ఈ నెల 28 (మంగళవారం)న విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్‌లో, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో డివిజన్‌లో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' ఆంధ్రజ్యోతి సదస్సులు నిర్వహించనుంది. ఈ సదస్సుల్లో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించడమే దీని లక్ష్యం.





విజయవాడ ఎన్ఎస్ఎం రోడ్డులో బ్రహ్మంగారి గుడి ఎదురు కాల్వలోకి జారిన రోడ్డు మార్జిన్లు

ఆదాయం తెచ్చుకుంటారా! కట్టబెట్టేస్తారా?

పీఎన్‌బీఎస్‌కు ఎదురుగా ఎన్‌హెచ్-65 వెంబడి ఖరీదైన ఆర్టీసీ స్థలం

2015లో కారుచౌకగా బీవోటీ విధానంలో ప్రైవేటు వ్యక్తికి లీజుకు అప్పగింత

భారీగా ఆదాయం వచ్చే ఆర్టీసీ స్థలాన్ని కారుచౌకగా కట్టబెట్టారు. ఆర్టీసీకి అత్తెసరు ఆదాయం వస్తుంటే.. లీజుదారుడికి మాత్రం కోట్ల రూపాయలు కురిపిస్తోంది. కమర్షియల్‌గా భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఆ స్థలాన్ని అప్పట్లో ఉన్నతాధికారులు కొందరి ఒత్తిళ్ల కారణంగా ప్రైవేటు వ్యక్తికి లీజుకు ఇవ్వాల్సి వచ్చింది. అతి త్వరలో దీని లీజు గడువు ముగియనుంది. దీన్ని మళ్లీ ఏదో ఒక రకంగా దక్కించుకునేందుకు పాత లీజుదారుడు తన ప్రయత్నాలు ఓ వైపు బలంగా చేస్తున్నాడు. మరోవైపు ఆర్టీసీ అధికారులు లీజు గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఏమి చేయాలన్న దానిపై కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా ఆర్టీసీకి భారీ ఆదాయం సమకూర్చుకునేలా నిర్ణయాలు తీసుకుంటారా? లేక పాత లీజుదారుడికే మళ్లీ కారుచౌకగా కట్టబెట్టేస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

- కమర్షియల్‌గా వినియోగించడంతో రూ. కోట్లు సంపాదించిపెట్టిన స్థలం
- మరికొద్ది రోజుల్లో ముగియనున్న పదేళ్ల లీజు కాలపరిమితి
- మళ్లీ కారుచౌకగా దక్కించుకునేందుకు ప్రయత్నాలు
- ఆ స్థలం వ్యవహారంపై కమిటీ వేసిన ఆర్టీసీ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆసియాలోనే రెండో అతిపెద్దదైన పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్)ను అనుకుని జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 65 వెంబడి ఆర్టీసీకి ఉన్న 2,700 చదరపు అడుగుల ఖరీదైన స్థలాన్ని 2015లో బీవోటీ స్కీమ్‌లో భాగంగా ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. అప్పట్లో గుంటుపల్లి దశరథరామయ్య అనే వ్యక్తి ఈ స్థలాన్ని బీవోటీ కింద దక్కించుకున్నారు. అప్పట్లో నెలకు రూ.6,15,000 నామ మాత్రపు అద్దె చెల్లించే విధానంలో దక్కించుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ సాధారణ చిన్నపాటి క్యాంటిన్‌కే రూ.7 లక్షల మేర అద్దె ఉంటుంది. అలాంటిది బీవోటీ విధానంలో అప్పటి ఆర్టీసీ అధికారులు అడ్డగోలుగా 2,700 చదరపు అడుగుల స్థలాన్ని కారుచౌకగా కట్టబెట్టారు.

లీజు స్థలంలో ఎన్నో వ్యాపారాలు

బీవోటీ ఒప్పందం ప్రకారం లీజుకు దక్కించుకున్న స్థలంలో లాడ్జింగ్ అండ్ బోర్డింగ్, రెస్టారెంట్, సైకిల్ స్టాండ్, బడ్డీ కొట్లు, ఫ్రూట్ జ్యూస్ స్టాల్స్ తదితరాల వంటివి దశరథరామయ్య ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలాన్ని కమర్షియల్‌గా వినియోగించుకుని నెలకు రూ.అర కోటికిపైగా ఆదాయం పొందుతున్నారు. ఏడాదికి రూ. 6 కోట్ల మేర పదేళ్లకు చూస్తే రూ.60 కోట్ల పైమాటే ఆదాయం వస్తోంది. తనకు వచ్చే ఆదాయంలో సదరు వ్యక్తి ఆర్టీసీకి నెలకు 7 శాతం లోపే లీజును చెల్లిస్తున్నారు. నెలకు రూ.6.15 లక్షలు.. ఏడాదికి రూ.73.80 లక్షలు, పదేళ్లకు రూ.7.38 కోట్లను మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తి ఆర్జిస్తున్న రూ. 60 కోట్ల ఆదాయంలో ఆర్టీసీకి రూ.7.38 కోట్లు మాత్రమే లీజు రూపంలో దక్కుతోంది. అయితే మార్చి 23, 2025వ తేదీతో ప్రైవేటు మిగతా 6లో..

నాటి రవాణాశాఖ మంత్రి సహకారంతోనే..

అప్పటి రవాణా శాఖ మంత్రి సహాయ సహకారాల ద్వారా ప్రైవేటు వ్యక్తి ఈ స్థలాన్ని కారుచౌకగా దక్కించుకున్నారు. రవాణా మంత్రి ఆదేశాలతో ఆర్టీసీ అధికారులు కూడా మారుమాట్లాడకుండా కట్టబెట్టేశారు. మరికొద్ది నెలల్లో దీని గడువు ముగిసిపోతుండటంతో.. ప్రైవేటు వ్యక్తి తిరిగి దక్కించుకునేందుకు పైరవీలు ప్రారంభించడం ఆర్టీసీలో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ఆర్టీసీ అధికారులు టెండర్లు పిలిస్తే రూ. అరకోటి ఆదాయాన్ని సాధించే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంటే ఈ స్థలాన్ని దక్కించుకోవటానికి ఎంతోమంది ఆసక్తి చూపిస్తున్నారు.

రూ.15 కోట్ల ఆలయ భూమి కబ్జా!

నందిగామలోని శ్రీరామలింగేశ్వరాలయ భూమి 75 సెంట్లు ఆక్రమణ

రియల్ ఎస్టేట్ వ్యాపారం నిమిత్తం మట్టి తోలిన అక్రమార్కులు



నందిగామ పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మట్టి తోలిన అక్రమార్కులు

- ప్రశ్నించిన ఆలయ ధర్మకర్తకు బెదిరింపులు
- ఆక్రమణపై పోలీసులకు ఆలయ కమిటీ ఫిర్యాదు

నందిగామ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నందిగామ పట్టణంలోని శ్రీరామలింగేశ్వస్వామి ఆలయానికి చెందిన రూ.15 కోట్ల విలువైన భూవిని కొందరు అక్రమార్కులు కబ్జా చేసి మట్టితోలించారు. ఆక్రమణపై ప్రశ్నించిన ఆలయ ధర్మకర్తపై బెదిరింపులకు దిగారు. ఈ వ్యవహారం ఆదివారం పట్టణంలో సంచలనం కలిగించింది. వివరాల్లోకి వెళితే... నందిగామ పట్టణంలోని చందర్లపాడు బైపాస్ వద్ద స్వామివారి ఆలయానికి చెందిన 822-1 సర్వే నంబర్‌లో 75 సెంట్ల భూమి ఉంది. దాంతో పాటు పక్క సర్వే నంబర్లలో సుమారు పది ఎకరాల వరకూ ఉంది. రోడ్డుకు ఆనుకొని ఉన్న 75 సెంట్ల భూమిపై వైసీపీ ప్రభుత్వంలోనే అక్రమార్కుల కన్ను పడింది. దానికి సంబంధించి ఫేక్ డాక్యుమెంట్లు కూడా తయారు చేసినట్లు సమాచారం. నందిగామ నుంచి చందర్లపాడు రోడ్డు పూర్తిగా స్వామివారి ఆలయ భూముల మధ్య నుంచి వెళుతుంది. అప్పట్లో అధికారులు రోడ్డు నిర్మాణం కోసం 822-1లో భూసేకరణ చేశారు. కానీ రోడ్డు మలుపు తిప్పడంలో జరిగిన పొరపాటులో 821-1లో గుండా రోడ్డు మిగతా 6లో..

తక్షణమే భూమి బదలాయింపు చేపట్టాలి

రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూమికి పరిహారం ఇవ్వడంతో పాటు, పొరపాటున 821-1లో రోడ్డు నిర్మాణం చేసినందున 822-1లో సేకరించి ఖాళీగా ఉంచిన భూమిని ఆలయానికి బదలాయించాలని డిమాండ్ చేశారు. తమకు సొమ్ము చెల్లించకుండా భూమి రికార్డులు మార్చే అధికారం జిల్లా బోర్డుకు లేదన్నారు. ఆ భూమిని ఎవరు ఆక్రమించాలని ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈడుపుగల్లు సర్పంచ్‌కు ఢిల్లీలో సన్మానం 6లో



విజయవాడ ఏఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ లక్ష్మీశ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న మార్క్‌ఫెడ్ డీఎం కే నాగమల్లిక, ఎన్టీఆర్ హెల్త్ ట్రస్ట్ డీసీ జే సుమన్, జీఎస్‌డబ్ల్యు ఆఫీసర్ జీ జ్యోతి, డాక్టర్ వెలగా జోషి, అడిషనల్ కమిషనర్ డీ చంద్రశేఖర్, కో-ఆపరేటివ్ ఆడిటర్ సీహెచ్ శైలజ, లేబర్ డిపార్టుమెంట్ కమిషనర్ సీహెచ్ ఆషారాణి, ప్రజా సంబంధాల శాఖ భవానీ, టిడ్కో, పీడీ బీ చిన్నోడు, జిల్లా సప్లై ఆఫీసర్ ఏ పాపారావు



ఆర్ అండ్ బీ టీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ విద్యాసాగర్, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఎస్ శ్రీనివాస్, పీడీ పీఎం సుభానీ, డీపీవో పీ లావణ్యకుమార్, ఏపీఎస్ ఆర్టీసీ డీపీటీవో ఎంవై దానం, డీఎంహెచ్‌వో ఎం సుహాసినీ, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ కే మంగమ్మ, తిరువూరు ఆర్డీవో కే మాధవి, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య



వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు, సీపీవో వై శ్రీలత, సమాచార శాఖ వీ ప్రసాద్, డీఈవో యూవీ సుబ్బారావు, ట్రాఫిక్ సీఐ వై రవికుమార్, కృష్ణలంక సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజు, అడిషనల్ డీసీపీ (క్రైం) ఎం రాజారావు, భవానీపురం సీఐ కే ఉమామహేశ్వరరావు, నార్త్‌జోన్ ఏసీపీ కే స్రవంతి రాయ్, వెస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జీ రామకృష్ణ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఏవీఎల్ ప్రసన్న కుమార్

జిల్లా అధికారులకు మెరటోరియస్ అవార్డులు

- రికార్డు స్థాయిలో 517 మందికి మెరటోరియస్ అవార్డుల ప్రదానం
- కృష్ణా, బుడమేరు వరదల్లో సహాయకచర్యల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులకు మెరటోరియస్ అవార్డులను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రదానం చేశారు. ఆదివారం ఏఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 517 మందికి మెరటోరియస్ అవార్డులను ప్రదానం చేశారు. ఆగస్టులో వచ్చిన కృష్ణా, బుడమేరు వరదల సమయంలో ప్రజలకు సేవలందించిన ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, లైసెన్స్ కంపెనీలకు కూడా ఈసారి ప్రశంసా పత్రాలను అందించారు. జిల్లావ్యాప్తంగా ప్రధానమైన శాఖలకు సంబంధించి చూస్తే టిడ్కో ఈఈ బీ చిన్నోడు, అడిషనల్ కమిషనర్ (వీఎంసీ) డీ చంద్రశేఖర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ పాపారావు, ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఆర్ఎం ఎంవై దానం, సమాచార శాఖ నుంచి వేమూరి ప్రసాద్, ప్రజాసంబంధాల శాఖ నుంచి భవానీ, జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పీ లావణ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ టీ సత్యనారాయణ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) వై శ్రీలత, జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్ విద్యాసాగర్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎస్ శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్యశాఖ అధికారిణి ఎం సుహాసిని, జిల్లా మార్కెఫెడ్ డీఎం కే నాగమల్లిక, తిరువూరు ఆర్‌డీవో కే మాధవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి కే మంగమ్మ, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా గ్రామ వార్డు సచివాలయ శాఖ జిల్లా అధికారిణి జీ జ్యోతి, జిల్లా అధికారి వెలగా జోషి, కార్మికశాఖ కమిషనర్ సీహెచ్ ఆశారాణి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారిణి సీహెచ్ శైలజ, ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సుభాని, ఎన్టీఆర్ హెల్త్ ట్రస్ట్ డీసీ జే సుమన్, జాయింట్ కలెక్టరేట్ సీసీ నాగభూషణం, కలెక్టరేట్ సీసీ కే సతీష్, సాయి చందు తదితరులకు మెరటోరియస్ అవార్డులను ప్రదానం చేశారు.

పోలీసు శాఖలో 76 మందికి..

విజయవాడ: పోలీసు శాఖలో పనిచేస్తున్న 76 మందికి గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవల విభాగంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ లక్ష్మీషా ఈ పత్రాలను అందజేశారు. ఏడీసీపీలు జి.రామకృష్ణ (శాంతిభద్రతలు), ఏవీ ప్రసన్నకుమార్ (ట్రాఫిక్), ఎం.రాజారావు (క్రైమ్స్), ఉత్తర మండలం ఏసీపీ డాక్టర్ కె.స్రవంతిరాయ్, ఇన్‌స్పెక్టర్లు కె.ఉమామహేశ్వరరావు (భవానీపురం), సుదా సురేష్ వీరవెంకట నాగరాజు (కృష్ణలంక), వై.రవికుమార్ (5వ ట్రాఫిక్), జేఆర్‌కే హనీష్‌బాబు (కమాండ్ కంట్రోల్ సెంటర్), బి.గుణరాము (సైబర్ క్రైమ్స్)తోపాటు పలువురు ఎస్ఐలు, సిబ్బంది ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

డివిజనల్ రైల్వే ఆదాయం రూ.3,155 కోట్లు

- డీఆర్ఎం నరేంద్ర పాటిల్

రైల్వేస్టేషన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రూ.3155 కోట్లు ఆదాయం ఆర్జించిందని విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ చెప్పారు. రైల్వే మినీ స్టేడియంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన ఆర్‌పీఎఫ్, జాక్ అండ్ జిల్ స్కూల్, స్కౌట్స్ గైడ్స్ ప్రదర్శించిన కవాతును సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ అధికారి తోకల వాలేశ్వర్‌తో కలిసి పరిశీలించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆర్‌పీఎఫ్ బృందం వివిధ విన్యాసానాలను ప్రదర్శించింది. జాక్ అండ్ జిల్ ఇంగ్లీషు మీడియం పిల్లలు, ఎస్‌కేసీవీ చైల్డ్ ట్రస్ట్ పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు, ఫ్యాన్సీ దుస్తుల పోటీలు అలరించాయి. డీఆర్ఎం తన సందేశంలో గత ఆర్థిక సంవత్సరంలో డివిజన్‌కు రూ.3155 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రికార్డు స్థాయిలో 49.435 బిలియన్ల మంది ప్రయాణికులను గమ్యానికి చేర్చినట్టు తెలిపారు. ప్రయాణికుల టికెట్ల ద్వారా రూ.1035.21 కోట్లు సాధించామన్నారు. 20 స్టేషన్లలో ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాల కోసం రూ.518.23 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే రూ.500 కోట్లు వ్యయం చేసి పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్ ఆదాయం రూ.500కోట్ల మార్కును దాటిందన్నారు. ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌కు విజయవాడ- విశాఖపట్నం విభాగంలో 128.63 కిలో మీటర్లలో పనులు పూర్తయ్యాయన్నారు. అనంతరం దక్షిణ మధ్య రైల్వే మహిళా విభాగం అధ్యక్షురాలు వర్షా పాటిల్ ఈ-వరల్డ్ క్యాంపస్‌లో కొత్త వినోద కేంద్రాన్ని ప్రారంభించారు. రైల్వే ఆసుపత్రి లో రోగులకు పరిశుభ్రత కిట్లను అందజేశారు. ఆసుపత్రిలోనూ సూపరింటెండెంట్ సోని బాల జాతీయ పతాకాన్ని ఎగురవేసి సందేశాన్నిచ్చారు. అదనపు డీఆర్ఎంలు పీఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, ఇంకా బ్రాంచి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,



విన్యాసాలను ప్రదర్శిస్తున్న రైల్వే పోలీసులు, జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం

వికసిత్ భారత్-2047 లక్ష్యానికి సహకరించాలి: నెట్టెం

విద్యాధరపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రధాని మోదీ, కూటమి ప్రభుత్వానికి సహకరించాలని, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశించిన మంచి సమాజ నిర్మాణ లక్ష్యాలను చేరేందుకు ఇంకా ఎంతో దూరం ఉందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఒక జాతిగా అందరూ ఒక్కటిగా పురోగమిస్తేనే గణతంత్రానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. ఈ అంశాల్లో చాలా ప్రభుత్వాలు వస్తున్నాయి కానీ లక్ష్య సాధనకు చాలాదూరం ప్రయాణించాలన్నారు. గణతంత్ర వచ్చి శతాబ్దంలో మూడో వంతు పూర్తయిందని, గొప్పదేశంగా ముందుకు వెళ్లడానికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. అందరం కలిసికట్టుగా నడవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన ఏపీలోని కూటమి ప్రభుత్వం 2047 వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు చేసే ప్రయత్నంలో మన సహకారం ఇవ్వాలన్నారు. ఐదేళ్ల విధ్వంసం నుంచి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ కోలుకుంటోందన్నారు. గన్నే ప్రసాద్, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగువేస్తున్న నెట్టెం రఘురామ్

వీఎంసీలో ఘనంగా గణతంత్ర వేడుకలు



జాతినేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్, ఇన్‌చార్జి కమిషనర్

చిట్టినగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణ త్యాగాలు చేసిన సమరయోధులను స్మరించుకోవాలని, వారి స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు సాగాలని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. భారత రాజ్యాంగం పట్ల ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ పలువురు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించి, జాతీయ, వీఎంసీ జెండాలను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌వింగ్ దళాల విద్యార్థుల గౌరవ వందనాన్ని నగర మేయర్, ఇన్‌చార్జి కమిషనర్ స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఐకమత్యంతో నగరాభివృద్ధి సాధ్యమని, ప్రజలు స్వేచ్ఛ స్వాతంత్రం జీవించడానికి కల్పించిన రాజ్యాంగం జనవరి 26న 1950 నుంచి అమల్లోకి రావడం వలన మనం గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, ఉండాలని, ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులతో సాధికారత కల్పిస్తుందని, ఇది మనమందరం గౌరవించాల్సిన రోజున్నారు. అ నంతరం వివిధ విభాగాల్లో ప్రతిభావంతులకు ప్రతిభ పురస్కారాలు అందించారు. మేయర్ భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ అందజేశారు. డిప్యూటీ మేయర్ అవుతు శైలజ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, సీపీఐ ఫ్లోర్‌లీడర్ సత్యబాబు, కార్పొరేటర్లు శర్వాణి మూర్తి, ఉమ్మడి చంటి, జాస్తి సాంబశివరావు, షాహినా సుల్తానా, చెన్నగిరి రామ్మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.



కమిషనరేట్లో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని సెల్యూట్ చేస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు

ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని అలవర్చుకోవాలి

- నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు

గుణదల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని అలవర్చుకోవాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు అన్నారు. విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నందు 76వ గణతంత్ర వేడక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ బ్యాండ్ లయబద్దంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరున 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బందికి మిఠాయిలు పంచారు. సిబ్బంది అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపుతో పాటు సత్ఫలితాలు వస్తాయన్నారు. డీసీపీలు మహేశ్వరరాజు, తిరుమలేశ్వర రెడ్డి, ఉదయరాణి, మనీషా, కృష్ణమూర్తి నాయుడు, ప్రసాద్, ఏఆర్ ఏడీసీపీ కె.శ్రీనివాసరావు, ఏసీపీలు కిరణ్ కుమార్, వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు, ప్రసాదరావు పరిపాలన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడిలో..

వన్‌టౌన్: దుర్గగుడిలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద జాతీయ పతాకాన్ని డిప్యూటీ ఈవో రత్నరాజు ఎగురవేశారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్వాతంత్ర సమర యోధులు చిత్ర పటాలకు నివాళులర్పించారు. భక్తులకు ప్రసాదం, స్వీట్లు పంపిణీ చేశారు. దేవస్థానం సిబ్బంది, అర్చకులు పలువురు పాల్గొన్నారు.

సిటీ సివిల్ కోర్టులో..

విజయవాడ లీగల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్ కోర్టు, బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా 76వ గణతంత్ర వేడుకలను నిర్వహించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు వద్ద ఎంఎస్‌జే సత్యానందం, బార్ అసోసియేషన్ వద్ద బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా), ఇతర కార్యవర్గ సభ్యులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కలతోటి క్రాంతికుమార్, గండూరి రామశర్మ, పద్మజ పాల్గొన్నారు.



సిటీ సివిల్ కోర్టులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా), పక్కన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పాలనాపరంగా అనుసరిస్తున్న విధానాలకు సంబంధించి మొత్తం 18 శకటాలను ప్రభుత్వం రూపొందించింది. వాటిని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రదర్శించారు. వాటిలో నైపుణ్యం - మానవ వనరుల అభివృద్ధి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖలకు చెందిన శకటాలు ప్రథమ బహుమతిని సాధించాయి. ఉద్యానవన శాఖ శకటానికి ద్వితీయ బహుమతి దక్కింది. పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక-పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ శాఖల శకటానికి గ్లోబర్-బెస్ట్ లాజిస్టిక్స్ విభాగం కింద మూడో బహుమతి వచ్చింది. పేదరికం లేని సమాజం అనే అంశంతో గ్రామీణ పేదరిక నిర్మూలక సంస్థ శకటాన్ని రూపొందించింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు పక్కాల గృహాలు, ఇంటి స్థలాలు అంశంతో గృహ నిర్మాణ శాఖ శకటం తయారైంది. న్యూ ఎంటర్‌ప్రెన్యూర్ - న్యూ ఎరా కాన్సెప్ట్‌తో పరిశ్రమల శాఖ శకటాన్ని తయారు చేసింది. పర్యాటక వారసత్వం, సంస్కృతి గురించి పర్యాటక శాఖ శకటం వివరించింది. విద్యా వికసిత ఆంధ్రప్రదేశ్‌ను సమగ్ర శిక్ష, పాఠశాల విద్య శకటం చూపించింది. నిరుద్యోగ యువతకు నైపుణ్యాన్ని ఇచ్చి తయారు చేసే స్కిల్లింగ్ ఆంధ్ర కార్యాచరణను నైపుణ్యాభివృద్ధి సంస్థ శకటం ప్రదర్శించింది. క్యాన్సర్‌పై విజయాన్ని స్క్రీనింగ్ ద్వారా మాత్రమే సాధించగలమని వైద్య ఆరోగ్య శాఖ శకటం సందేశాన్నిచ్చింది. అమ్మాయిల అభ్యున్నతికి కిశోర వికాసం - బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టాలని మహిళా-శిశు సంక్షేమ శాఖ శకటం పిలుపునిచ్చింది. తెలుగు తల్లికి జలహారతి అంశంతో జలవనరుల శాఖ శకటాన్ని రూపొందించింది. నగరాలు, పట్టణాలను కమ్మేస్తున్న కాలుష్యం నుంచి రక్షించుకోవడానికి నగర వనం, ఎకోటూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అటవీ శాఖ శకటం ప్రజలకు సందేశాన్నిచ్చింది. ప్రకృతి వ్యవసాయాన్ని పరుగులు తీయించాలని వ్యవసాయ శాఖ శకటం వివరించింది. ఆక్వాసాగులో అధిక ఉత్పత్తులు సాధించే విధానాలను మత్స్యశాఖ శకటం చూపించింది. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం, దాని రూపురేఖలను సీఆర్డీఏ శకటం ఆవిష్కరించింది. అభివృద్ధితో పల్లెల్లో పండగను పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శకటం చూపించింది. పర్యావరణ సహిత విద్యుత్ ఉత్పత్తిని, దాని వల్ల కలిగే ప్రయోజనాలను విద్యుత్ శాఖ శకటం చెప్పింది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాధించే ఫలితాలను ఉద్యానవన శాఖ చూపించింది. పర్యావరణ రక్షిత స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ శకటం చూపించింది. ప్రభుత్వ పాలనలో సాంకేతికంగా అవలంబిస్తున్న విప్లవాత్మక మార్పులను రియల్ టైం గవర్నెన్స్ శకటం వివరించింది. గణతంత్ర వేడుకల అనంతరం ఈ శకటాలు ఎంజీ రోడ్డు, బెంజ్‌సర్కిల్, రామవరప్పాడురింగ్, గుణదల, ఏలూరు రోడ్డు, పోలీసు కంట్రోల్ రూం ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించాయి.



నగర వీధుల్లో మత్స్యశాఖ, సీఆర్‌డీఏ, ఉద్యానవన శాఖ శకటాల ప్రదర్శన

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

లబ్బీపేటలో రక్తదాన శిబిరం

లబ్బీపేట, జనవరి26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కంపెనీయన్‌షిప్ స్వచ్ఛంద సంస్థ లబ్బీపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. తలసేమియా వ్యాధితో బాధపడు తున్న వారి కోసం రక్తాన్ని సేకరించి అందజేయడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత కలెక్టర్ ఇంతియాజ్, సంస్థ వ్యవస్థాపకులు షబ్బీర్, సిరాజ్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


సమస్యల కొలువు

పొంగి పొర్లుతున్న యూజీడీ
డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



కూలిన సైడు కాల్వ గోడ

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



(మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం కేంద్రం పటమటలో కీలకంగా ఉన్న 13వ డివిజన్ సమస్యలకు వేదికగా మారింది. డివిజన్‌ల పునర్విభజన తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలు పెరగడమే తప్ప తరగలేదు. ఉన్న సమస్యలు పరిష్కారం కాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా ఈ డివిజన్ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పారిశుధ్యం అధ్వానం..

పారిశుధ్యం విషయానికి వస్తే మొత్తం డివిజన్‌లో 26 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. మరో 10మంది వరకు అవసరం ఉంది. కాలనీల్లో, చాలారోడ్లలో స్ట్రోమ్‌వాటర్ డ్రెయిన్‌లు లేవు. ఉన్నచోట చెత్త చెదారంతో నిండి దోమలకు అవాసాలుగా మారాయి. కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం. యూజీడీలు పొంగి పోర్లుతుంటాయి. ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రం గాచేసి వెళ్లి పోతారు. దీంతో అంటువ్యాధులు ప్రబ లుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు..

ట్రాఫిక్ సమస్య చెప్పక్కర్లేదు. పటమట సర్కిల్ - 3 కార్యాలయం నుంచి యనమలకుదురు రోడ్డు వరకు ఉన్న రోడ్డులో ఎన్ఎస్ఎం స్కూలు రోడ్డు నుంచి చిన్నవంతెన వరకు రోడ్డుకు రెండు పక్కల ఆక్రమణలే. కాల్వల మీద బడ్డీలు, వాటి ముందే వాహనాల పార్కింగ్, రెండు ఆటోలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ జాం అవ్వాల్సిందే. వీధి కుక్కల సమస్యకు పరిష్కారమే లేదు. సాయంత్రం రోడ్లపై నడవాలంటనే స్థానికులు భయపడుతున్నారు. రోడ్లు ఛిద్రమైయ్యాయి. చాలా చోట్ల ప్యాచ్ వర్కులు చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల గోతులు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.



చెత్తతో నిండిన సైడు కాల్వ



ఎన్ఎస్ఎం రోడ్డులో బ్రహ్మంగారి గుడి ఎదురు కాల్వలోకి కూలిన రోడ్డు మార్జిన్లు

సమస్యలు అనేకం

అతిపెద్ద 13వ డివిజన్ పక్కనే కృష్ణానది, జేడీ నగర్‌లో రెండు ట్యాంకులున్నా.. నేటికి బోరు నీటినే సరఫరా చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం వేసిన పైపుల ద్వారా ఇంకా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. లీకులు ద్వారా కలుషితమవుతున్నాయి. కృష్ణానది మంచినీరు ఇవ్వడానికి గుణదల గంగిరెద్దుల దిబ్బ రిజర్వాయర్ నుంచి ఇవ్వాలి. కాని 10, 11డివిజన్‌లలో ఉన్న ట్యాం కులు నిండేసరికి ఇక్కడికి రావడం లేదు.



మధ్యాహ్నం 12 గంటలైనా తొలగించని చెత్త

● డివిజన్ హద్దులు

తూర్పు - యనమలకుదురు డొంక రోడ్డు
దక్షిణం- విజయవాడ నగరపాలక సంస్థ (బందరుకాల్వ)
పడమర - ఎన్ఎస్ఎం స్కూల్ రోడ్డు
(సర్కిల్-3కార్యాలయం తూర్పు రోడ్డు)
ఉత్తరం - మహాత్మాగాంధీ రోడ్డు

● కాలనీలు - వీధులు

ఎన్ఎస్ఎం రోడ్డు, పాముల గారి వీధి, పాలకేంద్రం బజార్, లక్ష్మి ఆసుపత్రి రోడ్డు, కోనేరువారి వీధి, కిసాన్ రోడ్డు, తోటవారి వీధి, రామా యణంవారి వీధి, డొంక రోడ్డు, శాంతి నగర్, జేడీ నగర్, ఆర్టీసీ కాలనీ, ఎల క్ట్రిసిటీ కాలనీ, మెగా టౌన్ షిప్



ఎలక్ట్రిసిటీ కాలనీలో పూడిపోయిన డ్రెయిన్



కౌన్సిల్‌లో ప్రస్తావించినా ఉపయోగం లేదు..

వైసీపీ హయంలో ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. కృష్ణానది నీరు తాగడానికి ఇవ్వమని, డివిజన్‌లో రోడ్ల సమస్య, కుక్కల బెడద గురించి కౌన్సిల్‌లో పదే పదే చెప్పినా ఉపయోగం లేకుండా పోయింది. పారిశుధ్యం విషయంలో కాలనీల భాగస్వామ్యంతో సిబ్బందిని పెట్టు కుంటే వైసీపీ ఈ విధానాన్ని తొలగిం చింది. ఇపుడు సిబ్బందిని ఇవ్వమంటే ఇవ్వడం లేదు. దీంతో చెత్త తొలగింపు, దోమల సమస్య పెరిగిపోతోంది. వర్షాకాలం వస్తే కాలనీలు మునిగిపోతుతున్నాయి. పక్కనే బందరు కాల్వ ఉంది. దాంట్లోకి వర్షం నీటిని మళ్లించే మార్గాలు లేవు.

- ముమ్మనేని ప్రసాద్, కార్పొరేటర్

ఘనంగా గణతంత్ర వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్యాశాఖ జేడీ పద్మారావు



76 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు, జేసిస్ ఇండియా సభ్యుల ర్యాలీ

భారతీనగర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా వందనం చేశారు. కార్యక్రమంలో సాంకేతిక శాఖ బోర్డు సెక్రటరీ జీ.వి.రామ చంద్రరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం.వి.రామకృష్ణ, అకాడమిక్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, టెక్నికల్ డిప్యూటీ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళా శాలలో ప్రిన్సిపాల్ ఎ.కనకరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. రమేష్ ఆసుపత్రి సెంటర్‌లోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ ఎ.కె.భాస్కర్ జాతీయ జెండాను ఆవిష్క రించారు. టెక్నికల్ డైరెక్టర్ జె.వి.టి.ఎస్ ప్రసాద్, ప్రాజెక్ట్ అండ్ హెచ్ ఆర్ కె.ఎల్. మూర్తి ఫైనాన్సు డైరెక్టర్ ఎ.రామదాస్ పాల్గొన్నారు. జేసిస్ ఇండియా జోన్ నగ రంలో 76మీటర్ల త్రివర్ణ పతాకం ర్యాలీ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి జేసిస్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఎస్.ఎస్.వర్మ పాల్గొన్నారు. ర్యాలీ మెడికల్ కళాశాల నుంచి రామవరప్పాడు రింగ్ వరకు విద్యార్థులు, జేసిస్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షుడు వర్మ మాట్లాడుతూ యువతే దేశానికి వెన్నుముక అన్నారు. కార్యక్రమంలో జేసిస్ జోన్ 26 అధ్యక్షుడు టి.భరత్ కుమార్, అంతర్జాతీయ సమన్వయ కర్త ఎస్.హర్షవర్ధన్ రెడ్డి, నగర ఇంపాక్ట్ శాఖ అధ్యక్షుడు కందుల రాజేంద్రరెడ్డి, ఆంధ్రా లయోలా కళాశాల, కేఎల్ విశ్వవిద్యాలయం విద్యా ర్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి: సిద్ధార్థ వైద్య కళాశాలలో జాతీయ జెండాను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ఆవిష్కరించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయు లకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.మాధురి, పి.శ్రీనివాస్, రాజా చౌదరి, రాంబాబు, రంగారావు పాల్గొన్నారు.

మొగల్రాజపురం: వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో అకాడమీ జాయింట్ సెక్రటరీ, పాఠశాల కన్వీనర్ సూరెడ్డి విష్ణు జెండా వందనం చేశారు. ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య భారత రాజ్యాంగం ఆవిర్భావం గురించి వివరించారు. ఎన్‌సీసీ ఏఎన్‌వో జి. రవి అధ్వర్యంలో కెడెట్స్ పరేడ్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. అకాడమిక వైస్ ప్రెసిడెంట్ వెల్లంకి నాగభూషణం, పాఠశాల కన్వీనర్ కమిటీ సభ్యురాలు వెల్లంకి లలిత, వైస్ ప్రిన్సిపాల్ కె.రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. జయలక్ష్మి పాల్గొన్నారు. పాఠశాల ఎథిక్స్ కమిటీ అధ్యక్షురాలు కె. హమ వర్షిత వందన సమర్పణ చేశారు.

జనశిక్షణా సంస్థాన్‌లో..

మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో డైరెక్టర్ ఎ.పూర్ణిమ జెండా వందనం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ డి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

పటమట: పటమట కోనేరు బసవయ్య చౌదరి హైస్కూల్లో జనసేన మహిళానాయకురాలు బొలిశెట్టి అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యల మంచిలి రవి తదితరులు పాల్గొన్నారు. గద్దె రామ్మోహన్ కార్యాలయంలో గద్దె క్రాంతి కుమార్ జెండాను ఆవిష్కరించారు. కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, శాయన బుజ్జి, పాల్గొన్నారు. ఫన్ టైమ్ క్లబ్‌లో ఉపాధ్యక్షుడు బొర్రా రాధాకృష్ణ (గాంధీ), మారిస్ స్టెల్లా కళాశాలలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ కవాతు, విన్యాసాలు అలరించాయి. డాక్టర్ బ్యూలా, కెప్టెన్ శైలజ, ఉన్నం స్వప్న, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

ఆటోనగర్ : ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు పంచుమర్తి ప్రసాదరావు అసోసియేషన్ భవనం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పలు కర్మాగారాల్లో విధులు నిర్వహించే 35 మంది కార్మికుల పిల్లలకు రూ. 70,000లను స్కాలర్‌షిప్ అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, ఉపాధ్యక్షులు పొన్నం శ్రీరామ్ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు బాయిన వెంకట్రావు, జెఆర్డీ టాటా ఐలా సొసైటీ చైర్మన్ టి.వినోద్ బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లబ్బీపేట : బందర్ రోడ్డులోని పైలెట్ సర్వీస్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ ఎ.అనిల్ కుమార్ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సత్కరించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సేల్స్ అధికారి కె.వరప్రసాద్, స్టేషన్ అధినేత యమ్.పి.వి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రాలో ఫైనల్స్‌కు రాష్ట్ర బాలికల జట్టు

లబ్బీపేట(స్పోర్ట్స్), జనవరి26 (ఆంధ్రజ్యోతి): పటమట జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న జాతీయ సెపక్ తక్రా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు ఫైనల్‌సకు చేరుకుంది. ఆదివారం జరిగిన బాలికల మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తెలంగాణ పై 15-1, 15-2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. బాలుర విభాగంలో రాష్ట్ర జట్టు ఢిల్లీ పై 15-12, 15-11తో ఓటమి చెందింది. అనంతరం జరిగిన సెమీఫైనల్స్‌లో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్, మణిపూర్ జట్లు, బాలుర విభాగంలో బీహార్, మణిపూర్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి.

కృష్ణా నుంచి హస్తినకు..

- దేశ ఆర్థిక పురోభివృద్ధికి తన పరిశోధనలతో దోహదం
- కొసరాజు లీలా కృష్ణకు 'పద్మ'తో జిల్లా ప్రజల హర్షం
- ఉంగుటూరుకు చెందిన ఆర్థిక రంగ నిపుణుడు


కొసరాజు లీలాకృష్ణ (ఫైల్)

ఉంగుటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : హస్తినలో పూర్తి ప్రస్థానాన్ని సాగించినా.. జన్మస్థలానికి వన్నె తెచ్చారు.. ఆర్థిక రంగ నిపుణుడిగా దేశానికి ఎనలేని సేవ చేశారు.. పుట్టింది కృష్ణాజిల్లాలో అయినా తన ప్రస్థానమంతా ఢిల్లీతోనే ముడిపడి ఉంది. కృష్ణా గడ్డపై పుట్టి గుంటూరు గడ్డపై ప్రాథమికవిద్య పూర్తి చేసుకుని దేశ రాజధాని ఢిల్లీలో ఆర్థిక నిపుణుడిగా ఎదిగారు కొసరాజు లీలాకృష్ణ (కేఎల్ కృష్ణ). భారతదేశ అత్యున్నత పురస్కారం 'పద్మ' అవార్డుతో జిల్లా ఖ్యాతిని దేశం నలుమూలల చాటి చెప్పారు. కృష్ణాలో జన్మించినా ఆయన ఆనవాళ్లు దాదాపుగా చెరిగిపోయాయి. నివాసం ఉన్న ఇల్లు కూడా లేదు. అయినవారు, బంధువులు దాదాపుగా లేరు. ఢిల్లీలో ఆర్థికవేత్తగా ఉన్నా.. ఆయన గురించి జిల్లా ప్రజలకు చాలా తక్కువగానే తెలిసి ఉండటం బాధాకరం. పద్మ అవార్డుతో దేశవ్యాప్తంగా కేఎల్ కృష్ణ పేరు మార్మోగటంతో.. ఎవరీ కృష్ణాజిల్లా బిడ్డ అని గూగుల్‌లోనూ, తెలిసిన వారిని అడుగుతున్నారు. ప్రముఖ ఆర్థికరంగ నిపుణులు, విద్యావేత్త, రచయిత ప్రొఫెసర్ కొసరాజు లీలా కృష్ణ(కేఎల్ కృష్ణ)ను పద్మశ్రీ అవార్డు వరించటం పట్ల కృష్ణా జిల్లా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 90ఏళ్ల వయసులో ఆయనకు అరుదైన గౌరవం దక్కటం గర్వకారణమని, స్థానిక టీడీపీ సీనియర్ నేతలు ఈడ్పుగంటి కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావుతో పాటు పలువురు ప్రముఖులు, సీనియర్ సిటిజన్లు అభినందనలు తెలియజేశారు.

1934లో ఉంగుటూరులో జన్మించిన కేఎల్ కృష్ణ ప్రాథమిక విద్య ఇక్కడే పూర్తిచేశారు. చిన్నతనంలోనే తండ్రి లక్ష్మయ్య చనిపోవటంతో గుడివాడ రాజేంద్రనగర్ 6వలైన్‌లో నివాసముంటున్న అక్కాబావలు సూరపనేని మనోరమాదేవి, సుబ్బయ్యల వద్దకు చేరారు. అక్కడ ఎస్ఎస్‌సీ చదివిన ఆయన మచిలీపట్నంలో ఇంటర్, కేరళరాష్ట్రం, తిరువనంతపురం యూనివర్శిటీనుంచి స్టాటిస్టిక్స్‌లో డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత కోల్‌కతాలో స్టాటిస్టిక్స్‌లో పీజీ పట్టా అందుకున్నారు. 1958లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. వివాహమైన తర్వాత భార్య ఇందిరతో ఢిల్లీలో స్థిరపడ్డారు. అప్పట్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈయన సహచరుడిగా వుండేవారు. 1963లో ఆర్థికశాస్త్రంలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి మన్మోహన్‌సింగ్, చికాగో యూనివర్సిటీనుంచి కృష్ణ పీహెచ్‌డీ పొందారు. ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా, డీన్‌గా, డైరెక్టర్‌గా పలు హోదాల్లో సుదీర్ఘకాలం పనిచేసిన ఈయన పరిశోధకుడిగా, రచయితగా, ఆర్థికరంగ నిపుణులుగా 50ఏళ్లకు పైగా సేవలందించారు. ఈయన గైడ్‌లైన్స్‌లో 36మందికి పైగా పీహెచ్‌డీలు పొందగా, వందలాదిమంది ఎంఫిల్ పూర్తిచేశారు. కృష్ణ, ఇందిర దంపతులకు కవిత, మమత ఇద్దరు కుమార్తెలు వున్నారు. భార్య ఇందిర 20ఏళ్ల క్రితం మరణించగా, కుమార్తెలు మద్రాస్ ఐఐటీలో బీటెక్ చదివి ఉన్నతోద్యోగం చేస్తూ బెంగుళూరులో స్థిరపడ్డారు.

ఈడుపుగల్లు సర్పంచ్‌కు ఢిల్లీలో సన్మానం


ఢిల్లీలో మాట్లాడుతున్న సర్పంచ్ ఇందిర

కంకిపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామ సర్పంచ్ పందిపాటి ఇందిర ఉత్తమ సర్పంచ్ అవార్డును ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో అందుకున్నారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర పంచాయతీ రాజ్ సహాయ శాఖ మంత్రి ఎస్.పి.సింగ్ భగేల్ తదితరులు సర్పంచ్ పందిపాటి ఇందిరను ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకోవడంలో సహకరించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఈవో చింతా కిరణ్‌కుమార్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.


పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నెట్టెం, టీడీపీ నేతలు

బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం..
ఆటోనగర్ టీడీపీ కార్యాలయంలో సంబరాలు

వన్‌టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : హిందూపూర్ ఎమ్మెల్యే, ప్రముఖనటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించిన సందర్భంగా విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం వేడుకలు జరిగాయి. టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి బాలకృష్ణకు అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోని వారికే గాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు ఇది ఎంతో సంతోషదాయకమన్నారు. సినీ, రాజకీయ, సేవా రంగాల్లో బాలయ్యబాబు (బాలకృష్ణ) విశేష కృషి చేస్తున్నారన్నారు. అమరావతిలో కూడా బసవతారకం ఆసుపత్రిని త్వరలో ప్రారంభిస్తున్నారన్నారు. పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఆర్‌డీఏలో ప్రతి గురువారం ఓపెన్ ఫోరం

విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ప్రాంత పరిధిలో పట్టణ ప్రణాళికా సమస్యల సత్వర పరిష్కారానికి వీలుగా సీఆర్‌డీఏ అధికారులు ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రతి గురువారం మధ్యాహ్నం ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ ఓపెన్ ఫోరంలో సీఆర్‌డీఏ ప్రణాళికా విభాగమంతా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. భవన నిర్మాణ అనుమతులు, లే అవుట్ల అనుమతులు, వాటికి సంబంధించిన సమస్యలు, వివాదాలను ఓపెన్ ఫోరం దృష్టికి తీసుకొస్తే అప్పటికప్పుడు పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటారు. లేకపోతే సమయం నిర్ణయించి పరిష్కరిస్తారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని సీఆర్‌డీఏ ప్రాంతాలకు చెందిన వారంతా తమ సమస్యల పరిష్కారానికి ఈ ఓపెన్ ఫోరాన్ని వినియోగించుకోవచ్చని సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఓపెన్ ఫోరాన్ని నిర్వహించారు. అప్పట్లో విస్తృత స్పందన వచ్చింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తిరిగి ఓపెన్ ఫోరం కార్యక్రమానికి సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. ప్రతి గురువారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సీఆర్‌డీఏ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంజాయి బ్యాచ్ హల్‌చల్!

ఎ.కొండూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు స్టేజీ వద్ద గంజాయి బ్యాచ్ కలకలం సృష్టించింది. ఆదివారం ముగ్గురు యువకులు పల్సర్ బైక్‌పై తిరువూరు నుంచి విజయవాడ వైపు వస్తూ ఖమ్మం జిల్లాపెనుబల్లి మండలం ముత్తగూడెంకు చెందిన బింగి కృష్ణ, అతడి భార్య దుర్గ బైక్‌పై వెళుతుండగా ఢీకొట్టారు. ప్రమాదంలో దంపతులకు, యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో ముగ్గురు యువకులు బైక్ వదిలి పరారయ్యారు. స్థానికులు 108 వాహనంలో కృష్ణ దంపతులను తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుల బైక్‌కు ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా సూమరు 6 కేజీల గంజాయి, కత్తిని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని బైక్, గంజాయి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. యువకుల కోసం గాలిస్తున్నారు.

పాఠశాల భవనం.. పాడుబెట్టేశారు!


పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా భవనం

నాటి వైసీపీ పాలకుల నిర్వాకం..

- రూ. 40 లక్షల ఉపాధి నిధులు వెచ్చించిన నిర్మాణం వృథా
- తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్‌లో సచివాలయ భవనం
- హైకోర్టు మొట్టికాయలు.. నిర్మాణ దశలోనే హైస్కూల్‌కు అప్పగింత
- పాత హాస్టల్ భవనంలో గ్రామ సచివాలయం-2 ఏర్పాటు
- వర్షానికి తడుస్తూ.. శ్లాబు పెచ్చులూడి పడుతున్న వైనం
- దినదినగండంగా సిబ్బంది కాలం వెళ్లదీత


పాఠశాల హాస్టల్ భవనంలో గ్రామ సచివాలయం-2

పాలకుల అనాలోచిత నిర్ణయాలు.. ఎంత నష్టాన్ని కలిగిస్తాయో ఈ భవనాన్ని చూస్తే అర్థమవుతుంది. అధికారం ఉందని నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా వ్యవహరిస్తే నష్టం తప్ప ఫలితం ఉండదని తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో గత వైసీపీ ప్రభుత్వం నిర్మించిన గ్రామ సచివాలయ భవనం దుస్థితి రుజువు చేస్తోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నాలుగేళ్లుగా పిచ్చిమొక్కల మధ్య ఎందుకు పనికిరాకుండా నిరుపయోగంగా తయారైంది.

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు)

విద్యేతర అవసరాలకు పాఠశాలల స్థలాన్ని వినియోగించకూడదన్న నిబంధనను నాటి వైసీపీ ప్రభుత్వం తొంగలోతొక్కి, జడ్పీ అధికారులను సంప్రదించకుండా 2021లో రూ.40 లక్షల ఉపాధి నిధులతో తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో గ్రామ సచివాలయం-2 భవన నిర్మాణాన్ని చేపట్టింది. భవన నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. గోడల ప్లాస్టింగ్, తలుపులు, కిటికీలు పెట్టటం, ఫ్లోరింగ్, విద్యుత్ పనులు మినహా అంతా పూర్తయింది. ఈ దశలో ప్రభుత్వ చర్యను హైకోర్టు తప్పుబట్టింది. పాఠశాలల స్థలాలను ప్రభుత్వాలు ఇష్టారీతిన తమ అవసరాలకు వినియోగిస్తే భావితరాల విద్యావసరాలకు స్థలం కొరత ఏర్పడుతుందని కోర్టు స్పష్టం చేసింది. ఏ స్థితిలో ఉన్నప్పటికీ నిర్మాణాలను నిలిపివేసి సదరు భవనాలను పాఠశాలలకు అప్పగించాలని ఆదేశించటంతో 2021 ఆగస్టులో పంచాయతీరాజ్ ఏఈ రాఘవరావు హైస్కూల్‌కు భవనాన్ని స్వాధీనపర్చారు. నాటి నుంచి నేటి వరకు ఈ భవనం నిరుపయోగంగానే ఉంది. చుట్టూ పెద్దపెద్ద పిచ్చిమొక్కలు, కాడ పెరిగి ఎవ్వరు వెళ్లలేకుండా తయారైంది. హైస్కూల్ యాజమాన్యం కూడా భవనాన్ని గాలికి వదిలేసింది. మిగిలి ఉన్న పనులను పూర్తిచేయించి విద్యావసరాలకు వినియోగించే ఆలోచన చేయకుండా భవనాన్ని పాడుపెట్టేస్తున్నారు. ఈ భవనం ఉండగా వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' పేరుతో హైస్కూల్లో లక్షలాదిరూపాయలను వెచ్చించి అదనపు తరగతుల భవనాలను నిర్మించి వాటిని అసంపూర్తిగా మిగిల్చింది. పాలకుల అనాలోచిత చర్యలు లక్షల ప్రజాధనాన్ని నిరుపయోగం చేస్తాయనేదానికి ఈ సచివాలయ భవనమే నిదర్శనం.

పాత హాస్టల్ భవనంలో సచివాలయం-2

తోట్లవల్లూరు గ్రామ సచివాలయం-2 భవనం హైస్కూల్‌కి అప్పగించటంతో సచివాలయాన్ని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాత హాస్టల్ భవనంలోని ఓ రూములో ఏర్పాటు చేశారు. అయితే ఈ రూము శిథిలావస్థకు చేరటంతో శ్లాబు వర్షానికి తడుస్తు కాంక్రీటు పెచ్చులూడిపడుతున్నాయి. చెదల పుట్టలు వెలిశాయి. పాములు సంచరిస్తుంటాయి. ఈ పరిస్థితిల్లో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. స్థానిక యువకులు చీకటి పడిన తరువాత సచివాలయం వద్దే మద్యం సేవించి సీసాలు పడవేయటం అపరిశుభ్రతను కలిగిస్తున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరొక చోట మంచి భవనంలోకి సచివాలయాన్ని మార్చటం లేదా నూతన భవనం నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


లోపల పెచ్చులూడి పడుతున్న శ్లాబు

హౌసింగ్ సైట్.. దర్జాగా కబ్జా!

- జర్నలిస్టుల స్థలంపై వైసీపీ నేత కన్ను..
- గత పాలకుల అండతో అక్రమ నిర్మాణాలు
- ఆక్రమణలు పరిశీలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ
- తక్షణం తొలగించాలని రూరల్ తహసీల్దార్‌కు ఆదేశం
- జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గుణదల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : 'ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్టుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం'కు కేటాయించిన స్థలాన్ని ఇతర వ్యక్తులు ఆక్రమించడంపై ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని 2.15 ఎకరాల స్థలాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. ఆర్ఎస్ నెంబరు 751-1, 752-2, 752-6బిలోని 2.15 ఎకరాల భూమి ప్రభుత్వాలు మారినా నేటికీ పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తుండటంపై ఆదివారం జర్నలిస్టులు ఆ స్థలంలో బహుజన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నున్న గ్రామ పరిధిలోని సొసైటీ స్థలం ఆక్రమణకు గురికావడాన్ని చూసి కబ్జాదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు కేటాయించిన స్థలాన్ని సంరక్షించాలని జర్నలిస్టులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో పాటు.. కేబినేట్, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పూర్తిస్థాయిలో సత్వర పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జర్నలిస్టుల స్థలాన్నీ కబ్జాదారులు వదలకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వమే జీవో ఇచ్చి దాదాపు 17 సంవత్సరాలవుతున్నా ఇళ్ల స్థలం ఇప్పటికీ జర్నలిస్టులకు దక్కకపోవడం బాధాకరం అన్నారు. జర్నలిస్టులకు న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటానన్నారు. అప్పటికప్పుడే రూరల్ తహసీల్దార్ బి.సుగుణకు ఫోన్‌చేసి తక్షణం అక్కడికి రావాలని ఆదేశించడమే కాకుండా జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని వెంటనే సర్వే చేయించి ఆక్రమణలను వెంటే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో 'ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్టుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం' నేతలు వెంకట్రావు, సతీష్, కేశవరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కబ్జాకు గురైన జర్నలిస్టుల స్థలంలో ఆక్రమణలను తొలగించాలని విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణకు ఆదేశాలిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

వైసీపీ నేత ప్రోద్బలంతోనే ఆక్రమణలు..!

ఎవరైతే మాకేంటి.. మన నాయకుడు వైఎస్ ఇచ్చిందేగా.. మనకు అడ్డేముంది అనుకున్నారో ఏమో.. సెంట్రల్ నియోజకవర్గంలో చక్రంతిప్పే వైసీపీ కీలక నేతకు ప్రధాన అనుచరుడు గురవారెడ్డి నున్న గ్రామపరిధిలో జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని దర్జాగా కబ్జాచేయడమేకాకుండా అక్కడ భారీ రేకులషెడ్ నిర్మించి అద్దెకు ఇచ్చేశాడు. ఆ పక్కనే మరో రెండు పక్కా ఇళ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణాలను అడ్డుకునే వారే లేకుండా పోయారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు కన్నెర్ర చేస్తుండటంతో ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని వర్కింగ్ జర్నలిస్టులు కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ప్రమాణస్వీకారాన్ని జయప్రదం చేయండి

గుడివాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విజయ వాడలో ఈ నెల 28న జరిగే నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి నాయీ బ్రాహ్మణ సోదరులు తరలి వచ్చి విజయవంతం చేయలని టీడీపీ నాయకులు దేవరపల్లి కోటి పిలుపునిచ్చారు. ఆదివారం ఈ సంద ర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు విక్కృతి పోతురాజు, పాణేశ్వరరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

గుడివాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మణ్‌లను ఆదివారం బీజేపీ గుడివాడ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వలపర్ల వెంకటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, నందివాడ మండల నాయకులు సంగటి త్రినాధ్, విక్కుర్తి జగదీష్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

రూ.15 కోట్ల ఆలయ భూమి కబ్జా!

(3వ పేజీ తరువాయి)

ఏర్పాటు జరిగింది. ఇటీవల కొలతలలో భాగంగా ఆ విషయం బయపడింది. రోడ్డు నిర్మాణానికి సేకరించిన 822-1లో గల భూమిని జిల్లా బోర్డు కింద నమోదు చేశారు. సేకరించిన భూమికి సొమ్ము కూడా చెల్లించని జిల్లా బోర్డు తన తప్పు వల్ల మిగిలి ఉన్న 75 సెంట్ల భూమిని ఆలయానికిబదలాయించలేదు. దీని వల్ల ఆలయం రెండు విధాలా నష్టపోవాల్సి వచ్చింది. సేకరించిన భూమి జిల్లా బోర్డులో నమోదై ఉండగా, సాగు భూమిలో రోడ్డును నిర్మించారు.

అన్యాక్రాంతానికి నాడే ప్రణాళిక

వైసీపీ హయంలో ఆలయాల భూముల అన్యాక్రాంతానికి కొందరు ప్రణాళిక వేశారు. రికార్డుల్లో ఎక్కడైనా తేడాలు ఉంటే వాటికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం, వెంచర్లు వేసి అమ్ముకోవడం జరుగుతుంది. రోడ్డు పక్కన ఖాళీగా ఉండడంతో పాటు ఆలయం పేరు కాకుండా జిల్లా బోర్డు పేరున ఉండడంతో ఆ స్థలంపై కన్నేశారు. అప్పట్లోనే ఫేక్ డాక్యుమెంట్‌లు సృష్టించినట్లు తెలిసింది. ఈ స్థలం విలువ ప్రస్తుతం రూ.15 కోట్లకు పైమాటే. ఇటీవల 821-1 సర్వే నంబర్ కొలత సమయంలో ఆ మొత్తం నుంచి 38 సెంట్ల భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మించినట్లు స్పష్టమైంది. సేకరించిన స్థలంలో కాకుండా పక్క భూమిలో రోడ్డు నిర్మాణం జరిపినందున సేకరించిన స్థలాన్ని ఆలయానికి అప్పగించాలని ఆలయ ధర్మకర్తలు కోరుతున్నారు. ఈక్రమంలోనే ఆదివారం 75 సెంట్ల స్థలాన్ని చదును చేసేందుకు గాను ఆక్రమణ దారులు మట్టి తోలకం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఛైర్మన్ మురళీ రాఘవ బాబు వారితో మాట్లాడే ప్రయత్నం చేయగా, ఆక్రమణదారులు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆదాయం తెచ్చుకుంటారా!

(3వ పేజీ తరువాయి)

వ్యక్తి లీజు గడువు ముగుస్తోంది.

ఆర్టీసీ అధికారులతో కమిటీ ఏర్పాటు

కొద్ది నెలల్లో ఈ స్థలం లీజు గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ఇప్పటి వరకు తమపై వస్తున్న విమర్శలను దృష్టిలో పెట్టుకుని ఒక కమిటీని ఏర్పాటు చేశారు. లీజు గడువు ముగిసిపోనున్న నేపథ్యంలో ఏం చేయాలన్నదానిపై ఉన్నతాధికారులకు కమిటీ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కమిటీ ఇప్పటికే పని ప్రారంభించింది. ప్రస్తుత లీజుదారుడు ఏ విధంగా ఆదాయం పొందుతున్నాడో గమనించి ఫ్రూట్ స్టాల్, పార్కింగ్ స్టాండ్, క్యాంటీన్లు, హోటల్, డార్మిటరీలు ఇలా విడివిడిగా టెండర్లు పిలిచి అద్దెకు ఇవ్వాలన్న ఆలోచనలను చేస్తోంది. ఇదే సందర్భంలో పాత లీజుదారుడు కూడా దీనిని మళ్లీ బీవోటీ విధానంలో కారుచౌకగా దక్కించుకునేందుకు ప్రయత్నాలు తీవ్రంగా చేస్తుండటంతో ఆర్టీసీలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. విలువైన స్థలాన్ని కొందరి ప్రయోజనాల కోసం కట్టబెట్టవద్దని సంస్థ ప్రయోజనాల కోసం టెండర్లు పిలవటం ద్వారా పోటీ పెంచాల్సిందిగా విజ్ఞప్తులు వస్తున్నాయి. ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏం చేస్తారో వేచి చూడాల్సిందే.

చెరువులా.. ఈ-6 రోడ్డు

- సచివాలయం- హైకోర్టు మధ్య కీలకమైన రోడ్డు
- ఈ రోడ్డు పక్కనే సీఎం చంద్రబాబు స్థలం
- పైపులైను లీకై మోకాలి లోతు మేర నిలిచిన నీరు
- పట్టించుకునే నాథుడు లేక చెరువులా మారిన వైనం
- గత వైసీపీ పాలనలోనూ ఇదే దుస్థితి
- రోడ్డును తవ్వి కంకర దొంగిలించిన దుండగులు


చెరువును తలపిస్తున్న ఈ-6 రోడ్డు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాజధాని నిర్మాణంలో కీలకమైన ఈ-6 రోడ్డు చెరువులా మారింది. రాజధానిలో కీలక ప్రాంతాలను కలిపే ఈ రోడ్డు మోకాలి లోతు నీటిలో మునిగి రాకపోకలకు పనికిరాకుండా పోయింది. మూడు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వెలగపూడిలోని సచివాలయానికి నీరు సరఫరా చేసే పైపులైను పగిలిపోవడంతో రోడ్డుపై నీరు నిలిచి, ఆనవాలు కూడా మిగలలేదు. ప్రస్తుతం వెలగపూడిలోని అసెంబ్లీ, సచివాలయం వెనుక భాగంలో ఉండే ఈ రోడ్డులో సచివాలయాన్ని, నేలపాడులో హైకోర్టు భవనాన్ని కలిపే కీలకమైన రోడ్డు. తాజాగా నిర్మాణం చేపట్టిన శాశ్వత సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీలకు అత్యంత చేరువలో ఉండే రహదారి ఈ-6 రోడ్డు. ఆ కారణంగానే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ రోడ్డును ఆనుకునే స్థలాన్ని కొనుగోలు చేశారు. అంతటి కీలకమైన ఈ రహదారి నీట మునిగిపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పెరిగిన దూరం..

ఈ-6 రోడ్డు వినియోగంలోకి వస్తే రాజధానిలోని మందడం, వెలగపూడి, తుళ్లూరుల మధ్య దూరం మూడొంతులకుపైగా తగ్గుతుందని రాజధానివాసులు చెబుతున్నారు. ఈ-6 రోడ్డు ద్వారా సచివాలయం నుంచి హైకోర్టుకు వెళ్లడానికి 2 కి.మీ ప్రయాణిస్తే సరిపోతుందని, ఇప్పుడు చుట్టూ తిరిగి 8 కి.మీ వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. వెలగపూడి నుంచి తుళ్లూరు పెట్రోలు బంకుకు ఈ రోడ్డు ద్వారా 3 కి.మీ ప్రయాణిస్తే చేరుకోవచ్చని, ఇప్పుడు 10 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని అంటున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న రోడ్డును నిర్లక్ష్యంగా వదిలేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఆది నుంచి సమస్యాత్మకం..

రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ప్రస్తుత సచివాలయం, హైకోర్టును కలిపే విధంగా ఈ-6 రోడ్డును రూపొందించారు. కంకర వేశారు. పూర్తిస్థాయి రోడ్డు వేసేలోగా ప్రభుత్వం మారిపోయింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజధానిని, రోడ్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో దొంగలు రోడ్డును తవ్వుకుని కంకర ఎత్తుకుపోయారు. దీంతో రోడ్డు గుంతగా మారింది. వర్షాకాలం వస్తే రోడ్డుపై నీళ్లు నిలిచి క్రమంగా చెరువులా మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ రోడ్డును పట్టించుకోలేదు. ఇప్పటికీ నీరు అలానే ఉంది. దీనికి కారణం సచివాలయానికి నీటిని సరఫరా చేసే పైపులైను పగిలిపోవడమే. ఆ పైపునకు మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో నీరు మొత్తం రోడ్డు మీద నిలిచిపోతోంది. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సీఎం సతీమణికీ తప్పని ఇక్కట్లు

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని నేలపాడులో స్థలం కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని చూసేందుకు ఆయన సతీమణి భువనేశ్వరి అటువైపుగా వచ్చారు. ఆ రోడ్డులో రాకపోకలకు అవకాశం లేకపోవడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది.

సొమ్మూ పాయె.. కాలమూ వృథా



2021లో పూర్తయి ఉంటే..

జగన్ నిర్వాకంతో నిలిచిపోయిన పోలవరం

- అదనపు పనుల పేరిట 2.269 కోట్ల భారం
- పూర్తయిన డయాఫ్రం వాల్‌పై ఈసీఆర్ఎఫ్ కట్టకుండా కాలయాపన
- వరదలకు అది ధ్వంసమై కొత్తది కట్టాల్సిన పరిస్థితి
- మరో 980 కోట్ల అనవసర ఖర్చు
- కాఫర్ డ్యాంలలో సీపేజీ కుంగిపోయిన గైడ్‌బండ్
- మళ్లీ చంద్రబాబు వచ్చాకే ప్రాజెక్టులో కదలిక
- జోరుగా వాల్ నిర్మాణ పనులు

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అబద్ధానికి రంగులు వేసి అదే సత్యమని ఎలా ప్రచారం చేయాలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారు. తన నిర్వాకాలకు పోలవరం ప్రాజెక్టును బలిపెట్టారు. ఐదేళ్ల పాలనలో ఒక్క పనీచేయకుండా.. కట్టినవాటినే ధ్వంసం చేసేశారు. కేంద్రం వద్దని మొత్తుకున్నా.. రివర్స్ టెండరింగ్ పేరిట కాంట్రాక్టు సంస్థను మార్చేశారు. రూ.628 కోట్లు ఆదాచేశామని ఘనంగా ప్రచారం చేసుకుని.. ఆనక అంచనాలు పెంచేశారు. అదనపు పనుల పేరిట రూ.2,269 కోట్ల భారం మోపారు. ఇంతాచేసి ప్రాజెక్టును పూర్తిచేయకపోగా..కోలుకోలేని రీతిలో ధ్వంసంచేశారు. విలువైన ఐదేళ్ల కాలాన్ని వృథా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు పనులు జోరందుకున్నాయి. కీలకమైన డయాఫ్రం వాల్ పనులు పరుగులు తీస్తున్నాయి.

2019లో ఆదరాబాదరాగా కాంట్రాక్టు సంస్థను మార్చేసిన జగన్.. ఆ తర్వాత పోలవరం ప్రాజెక్టులో ఒక్క పనీ చేయలేదు. తరచూ గడువులు పెంచుకుంటూ పోయారు. ఆయనే చెప్పినట్లు 2021 డిసెంబరులోనే అది పూర్తయి ఉంటే రాష్ట్రంలో కొత్తగా 7లక్షల ఎకరాలకు నీరందిఉండేది. ఎడమ కాలువను పూర్తిచేసి ఉంటే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా శ్రీకాకుళం జిల్లా చివరి ఆయకట్టుదాకా గోదావరి జలాలు పారేవి. కృష్ణా డెల్టాకూ అందేవి. ఫలితంగా కృష్ణా జలాలను రాయలసీమలో పెద్దఎత్తున వాడుకునేందుకు వీలుండేది. కానీ జగన్ వీటన్నిటికీ గండికొట్టారు. కాంట్రాక్టు సంస్థను తొలగించి.. ప్రధాన డ్యాంలో మిగిలిన రూ.1,771 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచారు. కొత్త కాంట్రాక్టు సంస్థకు రివర్స్ టెండర్‌లో రూ.1,548.12 కోట్లకు పనులు అప్పగించారు. దీనివల్ల రూ.628 కోట్లు ఆదాచేశామని డబ్బాకొట్టుకున్నారు. అయితే గప్‌చుప్‌గా అంచనాలు పెంచేశారు. అదనపు పనులు సృష్టించి మొత్తం పనులను రూ.2,268.68 కోట్లకు అప్పగించారు. అంటే రూ.720.56 కోట్ల అదనపు భారం వేశారు. పోనీ భారం మోపినా ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేశారా అంటే.. ఐదేళ్ల విలువైన కాలం వృథాచేసి.. మరింత సంక్షోభంలోకి నెట్టారు. గతంలో చంద్రబాబు హయాంలోనే పూర్తయిన డయాఫ్రంవాల్‌పై ఎర్త్ కం రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మించకుండా జగన్ నిర్లక్ష్యం చేశారు. దీంతో 2019, 20ల్లో గోదావరికి వచ్చిన భారీ వరదలకు వాల్ దెబ్బతింది. ఫలితంగా రూ.980 కోట్ల అదనపు భారంతో కొత్త వాల్ నిర్మించాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దిరోజుల కిందటే ఎట్టకేలకు దీని పనులు మొదలై ఇప్పుడు ఊపందుకున్నాయి. ఇంకో వైపు.. జగన్ జమానాలో నిర్మించిన గైడ్‌బండ్ అప్పుడే కుంగిపోయింది. నిర్మాణ జాప్యం కారణంగా ఎగువ, దిగువ కాఫర్‌డ్యాంలు దెబ్బతిన్నాయి. వాటిలో పెద్దఎత్తున సీపేజీ వస్తోంది. వీటి మరమ్మతులకూ అదనంగా ఖర్చుకానుంది.



ఉత్తమ రాష్ట్రశాఖ అవార్డు అందుకుంటున్న ఏపీ వైద్యులు

ఏపీ మానసిక వైద్య నిపుణుల సంఘానికి అవార్డు

- ఐదు దశాబ్దాల్లో తొలిసారి ఉత్తమ శాఖగా ఎంపిక

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జనవరి 22 నుంచి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి మానసిక వైద్య నిపుణుల సంఘం వార్షిక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానసిక వైద్యనిపుణుల సంఘం శాఖకు అత్యున్నత రాష్ట్ర శాఖగా అవార్డు- 2024 ప్రదానం చేశారు. ఐదు దశాబ్దాల్లో తొలిసారిగా ఈ పురస్కారం ఏపీ శాఖకు దక్కింది. మానసిక ఆరోగ్యంపై ఉచిత వైద్య శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడంలో అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్రం ముందంజలో నిలవడంతో ఈ అవార్డు దక్కింది. రెండేళ్లుగా అనంతపురంలో డాక్టర్ యెండ్లూరి ప్రభాకర్, గుంటూరులో డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు పూర్వ అధ్యక్షులుగా, విశాఖపట్నంలో డాక్టర్ జీవీఎస్ మూర్తి ప్రస్తుత అధ్యక్షులుగా, కార్యదర్శిగా గుంటూరుకు చెందిన ఐ.శరత్‌చంద్ర పర్యవేక్షణలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. యువ మానసిక వైద్యుల సహకారంతో జరిగిన సదస్సులో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పీ4 విధానంలో పర్యాటకాభివృద్ధి

- నేడు విశాఖలో రీజినల్ కాన్‌క్లేవ్
- ఫిబ్రవరిలో టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్
- 'సింగిల్ విండో'లో ఇన్వెస్టర్లకు అనుమతులు
- అమరావతిలో రూ.500కోట్లతో రివర్‌ఫ్రంట్ అభివృద్ధి
- వచ్చే పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రాజెక్టుకు రూపు.. ఈ వారంలోనే టెండర్లు
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్ షిప్ (పీ4) విధానంలో పనులు చేపట్టనున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో సోమవారం టూరిజం రీజినల్ కాన్‌క్లేవ్ నిర్వహిస్తున్నా మన్నారు. విశాఖ సమావేశానికి ఉత్తరాంధ్ర ఐదు జిల్లాల నుంచి ఆసక్తి ఉన్నవారు రావచ్చని.. ఇప్పటికే 150మందికి ఆహ్వానం అందిందన్నారు. సుమారు 15 మంది ఇప్పటికే ఎంవోయు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇటువంటివి నిర్వహించి పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టే ఆసక్తి ఉన్నవాళ్లను ఆహ్వానిస్తామన్నారు. అలాగే ఫిబ్రవరిలో టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇన్వెస్టర్లకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామన్నారు. ఇప్పటికే తాజ్, ఒబెరాయ్, మేఫేర్, ఐఆర్ సిటీసీ తదితర సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని, ఐఆర్‌సీటీసీతో ఇప్పటికే ఎంవోయూ కుదిరిందని చెప్పారు. ఒబెరాయ్ సంస్థ ఐదు ప్రాంతాల్లో హోటల్ బిజినెస్‌కు ముందుకొచ్చిందన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీని ఆనుకుని ఉన్న పిచ్చుకలంకను ఇప్పటికే సందర్శించారని, త్వరలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. మలేషియా, కెనడా వంటి దేశాల్లోనూ సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

త్వరలో మారేడుమిల్లి ఉత్సవ్

త్వరలో ఏజెన్సీలోని మారేడుమిల్లి ఉత్సవ్ నిర్వహించి ఇక్కడి అవకాశాలను ఇన్వెస్టర్లకు తెలిపి మారేడుమిల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు ఓ సబ్‌కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పాపికొండల పర్యటనలో భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. అమరావతిలో రూ.500 కోట్లతో రివర్‌ఫ్రంట్ అభివృద్ధిచేసి పర్యాటక కేంద్రంగా మార్చడానికి సీఎం చంద్రబాబు అంగీకరించారన్నారు. టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లకు కేంద్రంగా ఏపీ రూపొందనుందని, అడ్వెంచర్, ఎకో, వెల్‌నెస్, హెరిటేజ్, రలీజియస్, అగ్రి, మెడికల్, క్రూయిజ్, బీచ్, టెంపుల్ టూరిజంను వృద్ధి చేస్తామని చెప్పారు. ఈ వారంలోనే అఖండ గోదావరి ప్రాజెక్టుకు టెండర్లు పిలుస్తున్నామని తెలిపారు. రూ.98 కోట్లతో రాజమహేంద్రవరంలో ఈ ప్రాజెక్టును పుష్కరాల నాటికి అభివృద్ధి చేస్తామన్నారు. గోదావరి హేవలాక్ బ్రిడ్జి 2.7 కిలోమీటర్ల మేర 57 స్పాన్‌లను ఒక్కొక్కటి 48 మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని ఘాట్లనూ కలిపేలా బోటింగ్ ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. చరిత్రాత్మకమైన గండికోటను ఆధునికీకరించనున్నామని, డీపీఆర్‌లు కేంద్రానికి పంపామని చెప్పారు. రూ.100 కోట్లతో సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. స్వదేశీ దర్శన్ -2 ప్రాజెక్టుకు డీపీఆర్ పంపించామన్నారు. పర్యాటక రంగాన్ని కూడా పరిశ్రమగా మార్చి అన్నిరకాల రాయితీలు ఇస్తున్నట్టు మంత్రి చెప్పారు.

గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా ఏపీ

- రూ.3.92 లక్షల కోట్ల పెట్టుబడులు, 3.30 లక్షల మందికి ఉద్యోగాలు
- 'పీఎం కుసుమ్' సౌర విద్యుత్తు కోసం 1200 వ్యవసాయ ఫీడర్లు
- ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా సమూలంగా మార్చేస్తున్నామని ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధరబాబు ప్రకటించారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన విద్యుత్తు సౌధ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యుత్తు సంస్థల ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రీన్ ఎనర్జీలో 3.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా రూ.3.92 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. లోవర్ సీలేరులో 115 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన రెండు హైడల్ పవర్‌ప్లాంట్లను 2029 నాటికి అందుబాటులోనికి తీసుకువస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 అమలు చేయడం ద్వారా రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో ఏడున్నర లక్షల మందికి ఉద్యోగాలు దక్కేలా పది లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. అప్పర్ సీలేరు వద్ద 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంటును స్థాపిస్తున్నామన్నారు. పీఎం కుసుమ్ కింద 1200 వ్యవసాయ ఫీడర్లను సోలార్ కరెంటు ఫీడర్లుగా మారుస్తున్నామని చక్రధరబాబు వెల్లడించారు.

ఠాగూర్ రామసింగ్‌కు లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు

ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాగూర్ రామసింగ్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఠాగూర్ రామసింగ్‌ను ఆయన అభినందించారు.

నేడు ఈశాన్య రుతుపవనాల నిష్క్రమణ

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో ఐదు వాతావరణ సబ్ డివిజన్ల నుంచి ఈశాన్య రుతుపవనాల నిష్క్రమణ సోమవారానికి వాయిదా పడింది. ఈ మేరకు ఆదివారం భారత వాతావరణశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 24వ తేదీన ఈశాన్య రుతుపవనాలు దక్షిణాదిలోని తమిళనాడు, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, దక్షిణ కర్ణాటక నుంచి వైదొలుగుతాయని ఈనెల 21న ప్రకటించింది. తర్వాత బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు కొనసాగడం, దక్షిణ తమిళనాడులో వర్షాలు కురవడంతో 24న కాకుండా 26వతేదీన నిష్క్రమిస్తాయని వెల్లడించింది. అయితే సోమవారానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని తాజాగా పేర్కొంది. కాగా ఈశాన్య రుతుపవనాల నిష్క్రమణపై వాతావరణశాఖలో గందరగోళం ఎందుకని కొందరు నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అందుకు తగిన వాతావరణం నెలకొన్నప్పుడు మాత్రమే ప్రకటన చేయాలని, నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రారంభం నుంచి పూర్తిగా వైదొలిగే వరకు ప్రకటించిన విధంగా జరుగుతుందని గుర్తుచేశారు. కాగా, ఆదివారం రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురిసింది. రాయలసీమలో చలి తీవ్రత పెరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రంలో 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అదే సమయంలో రాయలసీమలో ఆదివారం పగటి పూట ఎండ పెరగడంతో కర్నూలులో 35.3 డిగ్రీలు నమోదైంది.

బీజేపీలో చేరుతూ.. టీడీపీ వారిపై దాడి!

- ధర్మవరంలో వైసీపీ వర్గీయుల దాష్టీకం
- ఆరుగురికి గాయాలు.. వాహనాలు ధ్వంసం
- ఇరువర్గాలపై కేసుల నమోదు



దాడిలో గాయపడిన టీడీపీ వర్గీయులు లోకేశ్, షామీర్, జావీద్



శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో టీడీపీ నాయకుల వాహనాలపై దాడి చేస్తున్న వైసీపీ వర్గీయులు

ధర్మవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో టీడీపీ నాయకులపై వైసీపీ నుంచి బీజేపీలోకి చేరడానికి సిద్ధమైన జమీర్‌తోపాటు ఆయన వర్గీయులు ఆదివారం దాడి చేశారు. దీంతో ఆరుగురు గాయపడ్డారు. రెండు కార్లు, రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. టీడీపీకి చెందిన షాహీర్, జావీద్, భానుప్రకాశ్, పన్నెండేళ్ల చిన్నారి ఉబేష్, చిన్నారు లోకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఉస్మాన్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధర్మవరం పదో వార్డుకు చెందిన క్రిష్టాపురం జమీర్ అహమ్మద్ వైసీపీకి గుడ్‌బై చెప్పి బీజేపీతో జతకలిశారు. ఇటీవల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌ను కలిసి, బీజేపీలో చేరేందుకు అనుమతి తీసుకుని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పదో వార్డుకే చెందిన టీడీపీకి చెందిన కొందరు నాయకులు వాహనాల్లో ఆదివారం మధ్యాహ్నం అటు వైపు వెళ్లారు. పల్లవి థియేటర్ సమీపంలో బీజేపీలో చేరికకు వైసీపీ వర్గీయులు ఏర్పాట్లు చేసుకుంటున్న ప్రదేశానికి వాహనాలు చేరుకోగానే.. వైసీపీ వర్గీయులు రాళ్లు రువ్వారు. దీంతో టీడీపీ నాయకులు వాహనాలను నిలిపి ఎందుకు రాళ్లు వేస్తున్నారని ప్రశ్నించారు. అయితే వారి మాట వినిపించుకోకుండా ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో వాహనాలను ధ్వంసం చేశారు. తమను చుట్టుముట్టి కర్రలతో దాడి చేశారని, ఆ సమయంలో పోలీసులు అక్కడే ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డామని బాధితులు తెలిపారు. అక్కడి నుంచి పోలీసుల సాయంతో స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు భారీగా స్టేషన్ వద్దకు చేరుకున్నారు. గాయపడిన వారిని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, బందోబస్తు మధ్య చికిత్స చేయించారు. వైసీపీ హయాంలో ఆ పార్టీలో ఉన్న జమీర్ వర్గం.. టీడీపీ వర్గీయులను వేధించిందని, భౌతిక దాడులు చేసిందని బాధితులు వాపోయారు. అలాంటివారిని కూటమి పార్టీ అయిన బీజేపీలోకి ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని పట్టించుకోవద్దు!

- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసైనికుల కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ



మంగళగిరి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఈ మధ్య కాలంలో కొంతమంది మూర్ఖులు జనసేన పార్టీ, కూటమి ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి అనవసరమైన విషయాలను జనసైనికులు పట్టించుకోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సూచించారు. జనసేన పార్టీ క్రియాశీల సభ్యుల కుటుంబాలకు ఆదివారంమంగళగిరిలో ఆయన బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక నాయకుడికి దూరదృష్టి, ప్రణాళిక లేకపోతే ప్రజలు ఎంత నష్టపోతారో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తెలిసొచ్చిందన్నారు. కొంత మంది సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్ గురించి, ఆయన పదవి గురించి మాట్లాడుతున్నారని, ఆయన ఏనాడూ పదవుల గురించి మాట్లాడలేదని, రాజకీయాల్లో మార్పు కోసం నిజాయితీ, నిబద్ధత, ధైర్యంతో నిలబడ్డారని చెప్పారు. పవన్ కల్యాణ్.. జనసేన పార్టీని స్థాపించినప్పటి నుంచి విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని సూచించారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 11.20 లక్షల సభ్యత్వాలు చేయగలిగామన్నారు. క్రియాశీల సభ్యులు పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేయాలని సూచించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే సోదరుల వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు



జనవరి 13న ఉమామహేశ్వరరెడ్డి పెట్టిన పోస్టు

అనంతపురం న్యూటౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరెడ్డి(25) అనుమానాస్పదంగా మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం సోముల దొడ్డి సమీపంలోని నాగిరెడ్డిపల్లి రస్తా వద్ద రైలుపట్టాలపై ఆదివారం ఉదయం అతని మృతదేహం లభ్యమైంది. ఈ యువకుడు తోపుదుర్తికి చెందిన మల్లిరెడ్డి కుమారుడని రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్‌పీ ఎస్ఐ వెంకటేశ్, ఏఎస్ఐ రఫీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను పిలిపించారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరులు, అనుచరుల వేధింపుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మల్లిరెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ఉమామహేశ్వర రెడ్డి తోపుదుర్తి సోదరులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతుంటారు. దీంతో వైసీపీ హయాంలో వారు ఒకసారి పిలిపించి మందలించినట్లు తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ, అనంతపురంలో నివాసం ఉం టున్నాడు. ప్రేమ వ్యవహారం కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చన్న చర్చ కూడా జరుగుతోంది. తన స్నేహితుడితో కలిసి సోముల దొడ్డి ప్రాంతానికి శనివారం రాత్రి వెళ్లిన ఉమామహేశ్వరరెడ్డి, కాసేపటి తర్వాత అతన్ని వెనక్కి పంపినట్లు తెలిసింది. తెల్లవారేసరికి రైల్వేట్రాక్‌పై మృతిచెంది కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ మింగి మానసిక రోగి మృతి

జీజీహెచ్(కాకినాడ), జనవరి 26(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మింగిన మానసిక రోగి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరుకు చెందిన పెనుమళ్ల రమ్య స్మృతి(35) మానసిక రుగ్మతలతో బాధపడుతోంది. కుటుంబీకులు ఆమెను శనివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె అక్కడ కీ ప్యాడ్ సెల్‌ఫోన్‌ను మింగేసింది. ఆమెకు శస్త్ర చికిత్స చేసి వైద్యులు సెల్‌ఫోన్‌ను తొలగించారు. కానీ అన్నవాహికకు సంబంధించిన ఈసోఫేగస్ పూర్తిగా దెబ్బతింది. వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు శనివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. రాజమహేంద్రవరం వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె ప్రాణాలు విడిచిందని మృతురాలి తండ్రి ఆరోపించారు.



శ్రీవారి సేవలో జస్టిస్ మన్మథరావు

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. – ఆంధ్రజ్యోతి, తిరుమల

శ్రీసత్యసాయి జిల్లాలో జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి పర్యటన



జస్టిస్ శ్రీనివాస్ రెడ్డికి ఖాద్రీశుడి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

కదిరి లీగల్/గాండ్లపెంట/నంబులపూలకుంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆదివారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించారు. జిల్లా పోర్టు ఫోలియో జడ్జి కూడా అయిన ఆయన, కదిరిలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం గాండ్లపెంట మండలం కటారుపల్లిలో యోగి వేమన ఆలయాన్ని, సమాధిని సందర్శించారు. ఆ తర్వాత నంబులపూలకుంట మండలం గూటిబైలు సమీపంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమానును సందర్శించారు. ఆలయంలో తిమ్మమాంబ, బాల వీరయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సింగపూర్‌లో ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలు



సింగపూర్‌లో జరిగిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో తారకరామం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీ జనార్దన్, మురళీమోహన్, నందమూరి రామకృష్ణ తదితరులు

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సింగపూర్‌లోని ఆర్యసమాజ్ ఆడిటోరియంలో ఆదివారం సింగపూర్ జై ఎన్టీఆర్ టీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, మాజీ ఎంపీ మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ సభ్యుడు భగీరథ సంపాదకత్వంలో ప్రచురించిన 'తారకనామం' పుస్తకం, ఎన్టీఆర్‌పై టీడీ జనార్దన్ రూపొందించిన 'తెలుగువారి గుండెబలం' పాటను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ మహోన్నతమైన ఎన్టీఆర్‌కు కొడుకుగా పుట్టడం తన అదృష్టమన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డును ప్రకటిస్తే తెలుగు వారికి సంతోషం కలుగుతుందన్నారు. జనార్దన్ మాట్లాడుతూ ఏపీ రాజకీయాల్లో ఎన్టీఆర్‌ను ధ్రువతారగా అభివర్ణించారు.

బాలకృష్ణకు పురందేశ్వరి అభినందనలు

చాగల్లు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నటుడు బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడం పట్ల ఆయన సోదరి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి అభినందనలు తెలిపారు. ఆదివారం తూర్పుగోదావరిజిల్లా చాగల్లు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. బాలకృష్ణ తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా నిరూపించుకుని వరుస విజయాలతో చక్కగా రాణిస్తున్నారన్నారు. రాజకీయాలలోను, సేవారంగాల్లోను విశేష సేవలందిస్తూ అందరి మన్ననలనూ పొందుతున్నారన్నారు. కాగా, కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో గతంలో నిలుపుదలచేసే ట్రైన్‌లు, గతంలో ఆగే ట్రైన్‌లు ఆపే విధంగా కృషి చేయాలని పలువురు కోరగా తప్పక రైళ్ల ఆగేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విశాఖ కోర్టుకు లోకేశ్

- సాక్షిపై పరువు నష్టం కేసులో హాజరవనున్న మంత్రి

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సాక్షి పత్రికపై వేసిన పరువునష్టం కేసులో విశాఖపట్నం 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో జరగనున్న క్రాస్ ఎగ్జామినేషన్‌కు మంత్రి నారా లోకేశ్ సోమవారం హాజరవుతున్నారు. ఈ కేసులో ఇప్పటికే రెండుసార్లు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. సాక్షి తరపున మొత్తం ఐదుగురు లాయర్లు వాదిస్తున్నారు. 'చినబాబు చిరుతిండి.. రూ.25 లక్షలండి' హెడ్డింగ్‌తో 2019 అక్టోబరు 22న సాక్షి పత్రికలో ఓ కథనాన్ని ప్రచురించారు. పూర్తి అవాస్తవాలతో తన పరువుకు నష్టం కలిగించేలా ఈ కథనాన్ని వేశారంటూ లోకేశ్ కోర్టులో పిటిషన్ వేశారు.

విమానాశ్రయ టెర్మినల్ డిజైన్‌పైనా ఆరా

- నేడు రాజమండ్రికి ఏవియేషన్ బృందం రాక

రాజమహేంద్రవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి విమానాశ్రయంలో నిర్మిస్తున్న కొత్త టెర్మినల్ డిజైన్‌లో ఏమైనా లోపం ఉందా అనే కోణంలోనూ విచారణ చేయనున్నారు. టెర్మినల్‌లో కూలిన సంఘటనపై చెన్నైకు చెందిన నిట్ బృందం రెండు రోజుల పాటు విచారణ జరిపింది. టెర్మినల్ కూలడానికి కారణంగా చెబుతున్న బోల్ట్‌ను ఆదివారం టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపారు. కాగా.. ఇద్దరు సభ్యులతో కూడిన ఏవియేషన్ టీమ్ సోమవారం ఇక్కడకు వచ్చి కొత్త టెర్మినల్ డిజైన్‌పై విచారణ చేయనున్నారు.

ఏపీ బాగుపడాలంటే వైసీపీ ఉండకూడదు

- సాయిరెడ్డిలాగా మిగిలినవారూ బయటపడాలి: ఆదినారాయణరెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ బాగుపడాలంటే వైసీపీ ఉండకూడదని కడప జిల్లా జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కడపలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్ పాపాల చిట్టా మొత్తం తెలిసిన ఏకైక వ్యక్తి విజయసాయిరెడ్డి వైసీపీలో ఇమడలేకే పార్టీ నుంచి బయటకు వచ్చారు. అదే దారిలో వైసీపీలో ఉండలేని మిగతా వారు కూడా బయటపడాలి. చేసిన పాపం వెంట రాక తప్పదన్నట్లుగా అధికారంలో ఉన్నన్ని రోజులు లెక్కలేనితనంతో విర్రవీగి అంతా తామే అన్నట్లుగా ఏ-1 జగన్‌రెడ్డి, ఏ-2 విజయసాయిరెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అప్పుల ఊబిలోకి నెట్టేశారు. అలాంటి వారి మధ్య సఖ్యత ఎందుకు చెడిందో వారిద్దరికే తెలియాలి' అని అన్నారు.

టీడీపీ ప్రజావేదిక షెడ్యూల్

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రజావేదిక షెడ్యూల్‌ను ఆ పార్టీ ప్రకటించింది. ఈ నెల 27న కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీరెడ్డి, 28న మంత్రి సవిత, ఎమ్మెల్యే సౌమ్య, 29న మంత్రి సత్యప్రసాద్, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి, 30న మంత్రి శ్రీనివాస్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ బాబ్జీ, 31న మంత్రి సంధ్యారాణి, సీపీసీ చైర్మన్ సుజాత ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొంది.

సొండి కులానికి 4 మద్యం షాపులు

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మద్యం విక్రయాలపై ఆధారపడి జీవించే సొండి కులానికి 4 మద్యం షాపులు కేటాయిస్తూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా ఉత్తర్వులు జారీచేశారు. గీత కులాలతో పాటు ఈ షాపులకు కూడా దరఖాస్తులు ఆహ్వానించి, లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేస్తారు. ఒకరికి గరిష్ఠంగా ఒక షాపు మాత్రమే కేటాయిస్తారు. కానీ ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించవచ్చు.

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and postgraduate courses at select colleges/institutes across India.
Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.
Prizes & Rewards: Up to INR 100,000 for one year
Last Date to Apply: 31-01-2025 ***Application mode:*** Online only
Short Url: www.b4s.in/aj/LGIGS1

Tagore National Fellowship for Cultural Research (TNFCR)

Description: Tagore National Fellowship for Cultural Research (TNFCR) 2024-25 is an initiative of the Ministry of Culture, Government of India to promote Indian art and culture.
Eligibility: Applicants must be an Indian or a foreign national with 5 years of experience in guiding/conducting research or the same experience in art fields. They must have their original research papers published in reputed and a refereed journals/books.
Prizes & Rewards: Fellowship offers an honorarium of up to 80,000 for two years and other benefits.
Last Date to Apply: 15-02-2025
Offline Application mode: Via post at Nodal Institutions under the Ministry of Culture, Government of India
Short Url: www.b4s.in/aj/TNFC4

Intuit Rise Girl Child Education Program

Description: Intuit India is dedicated to empowering underprivileged girl students from Class 8 through graduation by providing comprehensive educational support. This support will help these students achieve their full potential, paving the way for a brighter future!
Eligibility: Female students from Class 8 to graduation across India who are enrolled and continuing their education are eligible. Applicants must have secured a minimum of 90% in the previous academic year. The annual family income of applicants must be less than INR 3.5 lakh. Children of employees of Intuit India and Buddy4Study are not eligible.
Prizes & Rewards: Scholarship of up to INR 46,305
Last Date to Apply: 16-02-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/IRGC4

buddy4study.com



యూపీఎస్సీ సివిల్స్ కొత్త మార్పులతో నోటిఫికేషన్

దిక్సూచి DIKSUCHI



జనవరి 22న, "979 పోస్టులతో" UPSC సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్-2025 వెలువడింది. గత ఏడాది (2024లో) వెయ్యికి పైగా ఖాళీలతో, అంతకుముందు సంవత్సరం(2023లో) 1100లకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ వచ్చింది.

అయితే మొత్తం భర్తీ చేసే సర్వీసులను ఈసారి 23కు పెంచడం జరిగింది(గత ఏడాది 21 సర్వీసులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది). ఈసారి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (IRMS)ను విభజించి, ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ - ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్ - ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్‌లుగా చేయడంతో ఈసారి భర్తీ చేసే సర్వీస్‌ల సంఖ్య 23కు పెరిగింది.

ముఖ్యమైన తేదీలు:

- **అప్లికేషన్ల స్వీకరణ:** 2025 జనవరి 22
- **చివరి తేదీ:** 2025 ఫిబ్రవరి 12 (సాయంత్రం 6 గంటల వరకు)
- **ప్రిలిమినరీ పరీక్ష:** 2025 మే 25
- **హాల్ టిక్కెట్స్ విడుదల:** 2025 ఏప్రిల్
- **మెయిన్స్ పరీక్ష ప్రారంభం:** 2025 ఆగస్టు 22
- **మెయిన్స్ ఫలితాల ప్రకటన:** తరవాత వెల్లడిస్తారు.

వయోపరిమితి:

జనరల్ అభ్యర్థులకు: వయస్సు 21-32 సంవత్సరాల మధ్య ఉండాలి. (2 ఆగస్టు 1993 - 1 ఆగస్టు 2004 మధ్య జన్మించి ఉండాలి)
OBC: గరిష్ఠ వయోపరిమితిలో 3 ఏళ్ల సడలింపు
SC & ST: గరిష్ఠ వయోపరిమితిలో 5 ఏళ్ల సడలింపు
డిఫెన్సు సర్వీస్‌లో అంగవికలురైన వారికి: గరిష్ఠ వయోపరిమితిలో 3 ఏళ్ల సడలింపు
ఎక్స్-సర్వీస్‌మన్: గరిష్ఠ వయోపరిమితిలో 5 ఏళ్ల సడలింపు
PwD: బెంచ్ మార్క్ డిజెబిలిటీ కలిగివున్న వారికి గరిష్ఠ వయోపరిమితిలో 10 ఏళ్ల వరకు సడలింపు.
గమనిక: డిఫెన్సు సర్వీస్‌లో అంగవికలురయినవారికి, ఎక్స్-సర్వీస్‌మన్‌కి, PwD వారికి తమ కులాల ప్రాతిపాదికన లభించే వయోపరిమితి సడలింపు కూడా కలిపి వర్తిస్తుంది. అనగా ఒక వ్యక్తి PwD, SC/ST సామాజికవర్గ మినహాయింపును కలిపి పొందినట్లైతే గరిష్ఠంగా 47 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితి సడలింపు పొందగలరు.

అటెంప్ట్‌ల సంఖ్య:

- జనరల్ అభ్యర్థులకు: 6
- OBC: 9
- SC & ST: పరిమితిలేదు
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు 100 రూపాయలు. మహిళలు, ఇతర అన్ని కేటగిరి అభ్యర్థులందరికీ ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఈ సంవత్సరం వచ్చిన మార్పులు

- సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు కనీస విద్యార్హతలైన గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హాజరుకావచ్చు. గతంలో కేవలం ప్రిలిమినరీకి మాత్రమే ఈ అవకాశం ఉండేది, మెయిన్స్ పరీక్షలకు హాజరు కావాలంటే మాత్రం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ సమర్పించాలి. ప్రస్తుతం ఇంటర్వ్యూకి ముందు నిర్దేశిత గడువులోగా ఉత్తీర్ణతా సర్టిఫికెట్ సమర్పిస్తే సరిపోతుంది.
- రిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు కోరుతున్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ప్రిలిమినరీ అప్లికేషన్ లోనే సమర్పించాల్సివుంది. గతంలో ఈ నియమం ప్రిలిమ్స్ దశలో లేదు.
- అదేవిధంగా OBCలు కుల ధృవీకరణ పత్రంతో పాటుగా, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్‌ను కూడా దాఖలు చేయాలి. నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలకు(అనగా 2021-22, 2022-23, 2023-24కు) సంబంధించినదై ఉండాలి. OBC సర్టిఫికెట్ 01-04-2024, 11-02-2025 మధ్య జారీ అయినదై వుండాలి.
- EWS రిజర్వేషన్‌కు అర్హులైనవారు కూడా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, నిర్దేశిత అధికారితో 01-04-2024, 11-02-2025 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వ క్రయిటీరియా ప్రకారం జారీ చేసిన ఇన్‌కమ్ అండ్ అసెట్ సర్టిఫికెట్‌ను ప్రిలిమినరీ అప్లికేషన్ దశలోనే సమర్పించాలి.
- ఈసారి "సర్వీస్ ప్రిఫరెన్స్"లను కూడా ప్రిలిమినరీ ఎగ్జామ్ అప్లికేషన్‌లోనే ఎంచుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా "క్యాడర్ ప్రిఫరెన్స్"లను ప్రిలిమ్స్ పరీక్ష అయిన 10 రోజుల తరువాత సమర్పించాలి.
- UPSC పరీక్షలకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి. తొలిసారిగా పరీక్షకు హాజరయ్యేవారు ముందుగా UPSC వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాల్సి ఉంటుంది. ఈ వన్ టైమ్ రిజిస్ట్రేషన్లో సమర్పించిన వివరాలను (డేట్ ఆఫ్ బర్త్ మినహా), సమర్పించిన తేదీ నుంచి - 18 ఫిబ్రవరి 2025లోపుగా ఎప్పుడైనా సవరించుకొనే వీలుంటుంది.
- ప్రిలిమినరీ అప్లికేషన్‌లో సమర్పించిన ఏదైనా వివరాలను సవరించాలనుకొంటే, 2025 ఫిబ్రవరి 12 నుంచి ఫిబ్రవరి 18లోగా సరిచేసుకోవచ్చు.
- అడ్రసు, ఉన్నత విద్యార్హతలకు సంబంధించి, లేదా సర్వీస్/కేడర్‌ల ఎంపికకు సంబంధించి మార్పు చేర్పులు చేసుకోవడానికి మెయిన్స్ పరీక్షల తరువాత 15 రోజుల గడువు ఉంటుంది. అయితే అభ్యర్థులు ముందస్తుగానే జాగ్రత్తగా అప్లికేషన్‌ను నింపడం మంచిది.
- అభ్యర్థి రూపం దరఖాస్తుతో సమర్పించే ఫోటోలో ఉన్న విధంగానే పరీక్ష, ఇంటర్వ్యూ సమయంలో కూడా ఉండాలి.

ఉదా: హెయిర్ స్టయిల్, గడ్డం, కళ్ళజోడు మొదలైనవి. అప్లికేషన్ ప్రారంభ తేదీకి పది రోజులకంటే ముందు తీయించుకొన్న ఫోటోలను సమర్పించరాదు. అనగా 12 జనవరి 2025 కంటే ముందు తీయించుకొన్న ఫొటోలను అంగీకరించరు. ఫొటో కింది భాగంలో అభ్యర్థి పేరు, ఫోటో తీసిన తేదీని విధిగా పేర్కొనాలి.

గమనిక: చివరితేదీ వరకు దరఖాస్తు దాఖలు చేయకుండా తాత్సారం చేయవద్దు. ఒక్కోసారి చివరి రోజుల్లో సర్వర్ ఇబ్బందులు వస్తే కష్టం అవుతుంది.



ఎం. బాలలత
సివిల్స్ మెంటార్

'బిట్స్' అడ్మిషన్స్

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) అడ్మిషన్లు 2025 జనవరి 21 నుంచి మొదలయ్యాయి. ఆసక్తిగల అభ్యర్థులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ bitsadmission.comను సందర్శించి దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. చివరి తేదీ, పరీక్ష తేదీ తదితర వివరాలు త్వరలో వెల్లడిస్తామని వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. బిట్స్‌కు మనదేశంలో పిలానీ, గోవా, హైదరాబాద్‌ల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.

- బిట్స్ ఎట్ పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ పరీక్ష. మూడు గంటల్లో 130 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్/బయాలజీ(ఎంచుకునే స్ట్రీమ్‌ను బట్టి), ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్‌ల్లో ప్రశ్నలు ఉంటాయి.
- సంవత్సరంలో రెండు పర్యాయాలు ఈ ఎంట్రెన్స్‌ను నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ సౌకర్యాన్ని బట్టి ఏ సెషన్ అయినా రాయవచ్చు లేదా రెండు సెషన్లు కూడా రాసుకోవచ్చు. రెండింటిలో అత్యుత్తమంగా వచ్చిన మార్కులనే మెరిట్ సమయంలో పరిగణనలోకి తీసుకుంటారు.

ఇస్రోలో ఇంటర్న్‌షిప్

'ఇస్రో'లో ఇంటర్న్‌షిప్ చేయాలని మీ కలా! అయితే అలాంటి వారి కోసం అవకాశం ఎదురు చూస్తోంది. ఇంజనీర్లు, డిప్లొమా హోల్డర్లు, మాస్టర్స్ డాక్టోరేట్ అభ్యర్థులు దీనిని ఉపయోగించుకోవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా భారత పౌరులై ఉండాలి. ఇంటర్న్‌షిప్ కాలానికి ఎలాంటి స్టయిఫండ్ చెల్లించరు.
స్టూడెంట్ ప్రాజెక్ట్ ట్రైనీ స్కీమ్: దీనికి దరఖాస్తు చేసుకోవాలనుకునే బీఈ/బీటెక్ చదువుతున్న విద్యార్థులు అయితే ఆరో సెమిస్టర్ పూర్తి చేసి ఉండాలి. ఎంఈ/ఎంటెక్ అభ్యర్థులు మొదటి సెమిస్టర్ పూర్తి చేయాలి. బీఎస్సీ/డిప్లొమా అభ్యర్థులు ఫైనల్ ఇయర్ చదువుతుండాలి. ఎమ్మెస్సీ వారు మొదటి సెమిస్టర్, పీహెచ్‌డీ వారైతే కోర్సు వర్క్ పూర్తి చేయాలి.
కాలపరిమితి: ఇంజనీరింగ్/గ్రాడ్యుయేట్/డిప్లొమా అభ్యర్థులకు 45 రోజులు. ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ వారికి 120 రోజులు, పీహెచ్‌డీ అభ్యర్థులకు 30 నెలలు ఉంటుంది. వివరాలకు www.isro.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జోన్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ జోనుల్లో **266** జోన్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ వెలువడింది.

- అహ్మదాబాద్ - 123,
- చెన్నై - 58,
- గువహటి - 43,
- హైదరాబాద్ - 42.

హైదరాబాద్ జోన్ కింద తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలు వస్తాయి.
అర్హత: గ్రాడ్యుయేషన్ **చివరి తేదీ:** ఫిబ్రవరి 9
పరీక్ష: 2025 మార్చి
వెబ్‌సైట్: www.centralbankofindia.co.in/en

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

విభిన్నమైన పాత్రలో...



సుధీర్‌బాబు నటించనున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకత్వంలో ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్ తదితరులు నిర్మించనున్నారు. తాజాగా, ఈ సినిమా నిర్మాణంలో 'జీ స్టూడియోస్' సీఈఓ ఉమేశ్ కే.ఆర్.భన్సాల్ భాగమయ్యారు. ఇందులో సుధీర్‌బాబు క్యారెక్టర్ విభిన్నంగా ఉండబోతోందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమా కథాంశం కేరళలోని అనంత పద్మనాభస్వామి ఆలయం నేపథ్యంలో ఉండనుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మొదలుకానుంది.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

- నందమూరి బాలకృష్ణ



ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కోరారు. ఇది నా ఒక్కడి కోరిక కాదు, తెలుగు ప్రజలందరి కోరిక అన్నారు. పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన బాలకృష్ణను ఆయన నివాసంలో ఆదివారం కిషన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు శాలువా కప్పి సత్కరించారు. పలు రంగాల్లో విశేషమైన సేవలందించిన బాలకృష్ణ గారికి కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడం సంతోషకరమన్నారు. అందుకే స్వయంగా కలిసి అభినందించి, శుభాకాంక్షలు తెలిపేందుకు బాలకృష్ణ గారికి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. బాలకృష్ణ అనేక ఏళ్లుగా హీరోగా, ప్రజాప్రతినిధిగా తనదైన ముద్ర వేశారనీ, గత పదిహేను సంవత్సరాలుగా బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్‌గా సేవలు అందిస్తు వేలాదిమందికి క్యాన్సర్ నుంచి విముక్తి కల్పించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ తనయుడిగా పుట్టడం నా అదృష్టం, ఆయన నాకు గురువు కూడా' అన్నారు. పద్మభూషణ్‌ను బిరుదుగా కన్నా బాధ్యతగా భావిస్తున్నాని, ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా పనిచేస్తానని, మంచి పనులు మరింత కొనసాగించేలా ఈ అవార్డు ప్రోత్సాహమిచ్చిందని అన్నారు. తన సేవలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)



'జన నాయగన్'గా విజయ్



తమిళ సినీ హీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ నటిస్తున్న 69వ చిత్రానికి 'జన నాయగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసి రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటించారు. ఫస్ట్‌లుక్‌ను కూడా రిలీజ్ చేశారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహించే ఈ చిత్రం కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతోంది. పూజా హెగ్డే హీరోయిన్. ఇతర పాత్రల్లో గౌతమ్ వాసుదేవ్ మేనన్, బాబీ డియోల్, ప్రియమణి, మమితా బైజు, ప్రకాష్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో టీవీకే పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విజయ్.. సినిమాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. దీంతో విజయ్ నటించే చివరి చిత్రం ఇదేనంటూ కోలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. అందుకు తగినట్టుగానే ఈ చిత్రం టైటిల్‌ను ఖరారు చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

చిత్రసీమను ఆహ్వానిస్తున్నాం

● ఏపీటీఎఫ్‌సీసీని స్థాపించిన టీజీ వెంకటేశ్



రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం కర్నూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏపీటీఎఫ్‌సీసీ)ను ఏర్పాటు చేసి విధివిధానాలు ప్రకటించారు. వ్యవస్థాపక ఛైర్మన్‌గా టీజీ వెంకటేశ్, అధ్యక్షుడిగా సినిమా డైరెక్టర్, నిర్మాత కిరణ్ టీకే, సలహాదారుడిగా ఏపీఎఫ్‌సీసీ మాజీ అధ్యక్షుడు బీవీ రెడ్డి ఉన్నారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో కళలు, కళాకారులకు కొదవ లేదు' అన్నారు. సినిమా చిత్రీకరణ కోసం ఆకర్షణీయమైన ప్రదేశాలు, సహజ సిద్ధమైన ప్రకృతి వనరులు, అద్భుత కట్టడాలు, చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని, సినీ పరిశ్రమను కర్నూలు సహా రాయలసీమ జిల్లాలకు ఆహ్వానిస్తున్నాం' అని తెలిపారు.

కర్నూలు (ఆంధ్రజ్యోతి)

వసూళ్లతోనే గొప్ప సినిమా అవ్వదు



సిద్ధార్థ్

భారీ బడ్జెట్‌తో నిర్మించి, ఎక్కువ వసూళ్లు సాధిస్తేనే మంచి సినిమా, లేకుంటే మంచి చిత్రం కాదు అనే అభిప్రాయాలకు రావడం ఈ మధ్యకాలంలో పెరిగిందనీ, అది సరికాదని సినీ నటుడు సిద్ధార్థ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఒక సెక్స్‌వర్కర్ అత్యాచారానికి గురై కన్నుమూస్తే, కనీసం సానుభూతి చూపకపోగా తప్పు అంతా ఆమెదే అన్నట్లు మాట్లాడే దేశంలో నివసిస్తున్నాం' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. "నేను స్త్రీవాదిని. మహిళలను కొట్టడం, అవమానించడం, కించపరిచడం, ప్రత్యేక గీతాలు లాంటివి చేసే పాత్రలు నాకు ఎన్నో వచ్చాయి. అలాంటి స్క్రిప్ట్‌లను మొహమాటం లేకుండా తిరస్కరించాను" అని ఆయన చెప్పారు. 'సినిమాలో కథానాయకుడు చేసే మంచి పనులు, నిజ జీవితంలో ఎంతోమంది సామాన్యులు చేస్తున్నారు. హీరోలం మేము కాదు, సాటిమనిషి పట్ల సౌహార్ధత, స్పందించే హృదయం కలిగిన సామాన్యులే అసలైన హీరోలు' అన్నారు. ఈ చర్చాగోష్ఠికి హిందుస్తానీ సంగీత విద్వాంసురాలు, నటి అదితీరావు హైదరీ తల్లి విద్యారావు సమన్వయకర్తగా వ్యవహరించారు. తన అత్తమ్మతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని సిద్ధార్థ్ అన్నారు. చిన్నా సినిమా చిత్రీకరణపై సంభాషణ సాగుతున్నప్పుడు, విద్యారావు భావోద్వేగానికి లోనవ్వగా, "అత్తమ్మ! ప్లీజ్ ఏడవకండి. 'మా అమ్మను కన్నీరు పెట్టనివ్వకుండా చూడండి' అని ఇక్కడికి వచ్చేముందు మీ అమ్మాయి అదితీ నా దగ్గర మాట తీసుకుంది" అని సిద్ధార్థ్ ఊరడించారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)



సలామ్ సైనికా

దేశభక్తి చిత్రం 'సలామ్ సైనికా' ట్రైలర్‌ను ఆదివారం అమరావతి అసెంబ్లీ భవనంలో రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మన సైనికుల విషయంలో ప్రతి భారతీయుడు బాధ్యతతో మెలగాలనే సందేశంతో ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమా చిత్రీకరణ అంతా ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగింది' అని అన్నారు. అమర సైనికుల భార్యా పిల్లలు అనాథలు అవుతున్నారు, వారికి అండగా వుండే బాధ్యత ప్రతి భారతీయుడు తీసుకోవాలని 'సలామ్ సైనికా' సినిమా ద్వారా సందేశమిస్తున్నామని దర్శకుడు చిగురుపాటి సుబ్రమణ్యం తెలిపారు. చిగురుపాటి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలో దేవ్, సాయి, సురేష్, శ్రీభవ్య, సోనీరెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు, 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

ప్రతీకారం కాదు ఆత్మగౌరవం

● జానీ మాస్టర్ కేసుపై స్పందించిన బాధితురాలు



షేక్ జానీ బాషా (జానీ మాస్టర్) తనను లైంగికంగా వేధించాడని ఓ మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు చేయడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బెయిలు మీద మీద వచ్చిన ఆయన తన తప్పేమీ లేదని వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. దీనిపై బాధితురాలు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "నేనొక యోధురాలిని. మంచి కోసం పోరాటం చేస్తున్నా. నన్ను ఆదర్శంగా తీసుకొని పది మంది అమ్మాయిలు ధైర్యంగా మారినా చాలు. జానీ మాస్టర్‌పై ప్రతీకారం తీర్చుకొనేందుకు నేను కేసు పెట్టలేదు. ఆత్మగౌరవం కోసమే ఫిర్యాదు చేశాను. అమ్మాయిలంటే ఆటబొమ్మలు కాదు. వాళ్లు 'నో' చెబితే దాన్ని గౌరవించాలి. నాలుగేళ్ల తర్వాత ఎందుకు కేసు పెట్టావని అందరూ ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో నేను మైనర్‌ని. అప్పట్లో ఆయనకున్న పలుకుబడితో పోరాడే శక్తి నాకు లేదు. అయినా, ఆయనలో మార్పు వస్తుందేమోనని చూశా. ఆయన మారలేదు. వేధింపులు మరింత పెరగడంతో పోలీసులను ఆశ్రయించాను" అని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 27 జనవరి 2025




ఇంట్లో సైక్లింగ్ చేస్తే...

చాలామంది సమయాభావం వల్ల ఇంట్లోనే సైక్లింగ్ చేస్తూ ఉంటారు. ఇది కూడా ఆరోగ్యానికి పలువిధాలుగా తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

- ఇంట్లో సైక్లింగ్ చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం పెరుగుతాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గి మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- ఉదయాన్నే సైక్లింగ్ చేస్తే శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలై రోజంతా ఉత్సాహంగా అనిపిస్తుంది.
- సైక్లింగ్ వల్ల హార్మోన్లు సమతూకంలో పనిచేస్తాయి. నిరుత్సాహం, కోపం, చిరాకు లాంటి లక్షణాలు తగ్గుతాయి.
- ప్రతిరోజూ ఒకే సమయానికి ఇంట్లో సైక్లింగ్ చేస్తూ ఉంటే వయసు పైబడడం వల్ల వచ్చే పలు మానసిక సమస్యలు తగ్గుముఖం పడతాయి. శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. శరీరంలోని అవయవాలన్నీ శక్తితో ఉంటాయి. కండరాలు బలోపేతమవుతాయి. బద్ధకం దరిచేరదు.
- శరీరంలోని అదనపు క్యాలరీలు ఖర్చయి బరువు నియంత్రణలో ఉంటుంది. జీవక్రియలన్నీ వేగవంతమవుతాయి.

ముఖాన్ని ఇలా మెరిపించండి!

ముఖం అందంగా ఆరోగ్యంగా కనిపించాలని అందరూ కోరుకుంటూ ఉంటారు. రసాయనభరితమైన సౌందర్య సాధనాలు కాకుండా ఇంట్లో దొరికే వాటితోనే ప్యాక్ తయారుచేసుకుని వాడితే ముఖం మెరిసేలా చేసుకోవచ్చు. ఆ వివరాలు...



- పండిన అరటిపండును తొక్కతీసి చిన్న ముక్కలుగా కోసి ఒక గిన్నెలో వేయాలి. చెంచాతో వాటిని గుజ్జులా చేయాలి. అందులో రెండు చెంచాల పాలు, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరవాత మంచినీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మానికి తేమ అంది సహజసిద్ధంగా మెరుస్తుంది.
- ఒక గిన్నెలో ఒక చెంచా గ్లిజరిన్, ఒక చెంచా గులాబీ నీళ్లు, ఒక చెంచా బంగాళదుంప రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని కింది నుంచి పైకి రాస్తూ ముఖానికి, మెడకి పట్టించాలి. ముక్కుకు ఇరుపక్కలా, నుదుటి మీద సున్నితంగా మర్దన చేయాలి. అరగంట ఆరిన తరవాత నీళ్లతో కడిగేసుకోవాలి. ఈ ప్యాక్.... బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది. నలుపుదనమంతా తొలగిపోయి ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది.
- ఒక గిన్నెలో అయిదు చెంచాల బార్లీ గింజల పొడి వేసి అందులో గోరువెచ్చని నీళ్లు చల్లుతూ ముద్దలా చేయాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దిగా తీసుకుంటూ ముఖమంతా పరచాలి. పదిహేను నిమిషాలు ఆరిన తరవాతముని వేళ్లతో మెల్లగా రుద్దుతూ మిశ్రమాన్ని తొలగించి నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మంపై పేరుకున్న మృతకణాలు, మురికి తొలగిపోతాయి. ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అరగ్లాసు పాలు, మూడు చెంచాల ఓట్స్ వేసి ఉడికించాలి. చల్లారిన తరవాత ఇందులో ఒక చెంచా పెరుగు, ఒక చెంచా తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖమంతా పట్టించాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల బ్లాక్ హెడ్స్ తొలగిపోయి ముఖం తాజాగా కనిపిస్తుంది.

స్ఫూర్తి

ఒకప్పుడు వ్యవసాయ కూలీ. రోజు గడవడమే కష్టమయ్యేది. కానీ ఇప్పుడు... స్వయంశక్తితో ఎదిగి... కోటి రూపాయల టర్నోవర్ దాటిన కంపెనీకి అధిపతి అయ్యారు. జనపనార సంచుల తయారీ చేపట్టి... మరికొందరు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆమెకు ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. పట్టుదలగా ప్రయత్నిస్తే అసాధ్యమేదీ లేదంటున్న కల్పనతో 'నవ్య' మాటామంతి.



స్వయంకృషితో ఎదిగి... మార్గదర్శిగా నిలిచి

"జీవితమంటేనే ఎన్నో ఆటుపోట్లు. అన్నిటినీ తట్టుకొని ముందుకు వెళితేనే జీవనం సాగించగలుగుతాం. రోజంతా కష్టపడినా ఇల్లు గడవని పరిస్థితుల నుంచి నేడు నా కాళ్లపై నేను నిలబడే స్థాయికి ఎదిగాను. నాలాంటి మరికొంతమంది పేద మహిళలకు ఉపాధి మార్గమయ్యాను. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంది. దీని వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ మాత్రమే కాదు... ఎన్నో త్యాగాలు కూడా ఉన్నాయి. హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామంలోని ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం మాది. మా ఇంటికి సమీపంలో ఉండే దాసరి బాబుతో నాకు పెళ్లయింది. ప్రేమ వివాహం. మాకు ఇద్దరు కూతుళ్లు... అంజలి, అలేఖ్య. ఇంజనీరింగ్ చదువుతున్నారు. నేను, మావారు కలిసి వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసేవాళ్లం. సంపాదనతో కుటుంబ పోషణ కష్టమయ్యేది. 2001లో డ్వాక్రా మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరాను. కొద్ది రోజులకే అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. సంఘంలో చేరాక కుట్టు విుషన్ నేర్చుకున్నాను. కుట్టు పని మొదలుపెట్టాను.

రుణం తీసుకొని...

అయితే కుట్టు పనితో వచ్చేది ఇంట్లో కనీస ఖర్చులకు సరిపోయేది కాదు. దాంతో 2009లో స్వయం సహాయక సంఘం నుంచి లక్ష రూపాయల రుణం తీసుకుని, కిరాణా షాపు పెట్టాను. ఐదేళ్లకు ఆ రుణం తీరడంతో పిండి గిర్నీ మొదలుపెట్టాను. అదేసమయంలో నాకు కాస్త హిందీ తెలియడంతో... 'సెర్ప్' అధికారులు నన్ను 'కమ్యూనిటీ రీసెర్స్ పర్సన్' (సీఆర్‌పీ)గా ఎంపిక చేశారు. అందులో భాగంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో స్వయంసహాయక సంఘాల మహిళలకు పొదుపుపై శిక్షణ ఇచ్చాను.

పిల్లలకు దూరంగా...

సీఆర్‌పీగా 2016-19 మధ్య ఇలా చాలా పర్యటనలకు వెళ్లాను. వెళ్లినప్పుడల్లా 45 రోజులపాటు అక్కడే ఉండాల్సి వచ్చేది. ప్రయాణం, వసతి, భోజనం తదితర ఖర్చుల కోసం కొంత డబ్బు ఇచ్చేవారు. దాంతోనే మా ఇల్లు గడిచేది. మేం వెళ్లే ప్రాంతాల్లో సెల్ సిగ్నల్స్ ఉండేవికావు. దానివల్ల రోజుల తరబడి మావారు, పిల్లలతో మాట్లాడటం కుదిరేది కాదు. అన్నేసి రోజులు పిల్లలకు దూరంగా గడపడమంటే ఎంతో బాధగా ఉండేది. కళ్లల్లో నీళ్లు తిరిగేవి. పిల్లలను వదిలి టూర్లకు వెళ్లడం ఎందుకని బంధువులు, సన్నిహితులు అనేవారు. కానీ నేను, నా కుటుంబం ఏ లోటూ లేకుండా జీవించాలంటే బాధను దిగమింగుకోవాలి. కొన్ని త్యాగం చేస్తేనే ముందుకు సాగడం సాధ్యం. పిండిగిర్నీ మావారికి అప్పగించి నేను ఇతర రాష్ట్రాలకు వెళ్లేదాన్ని.

తలకిందులైనా...

కాస్త నిలదొక్కుకొంటున్నాం అనుకొనేలోపు కరోనా కుదిపేసింది. జీవితం తలకిందులైంది. పిండిగిర్నీపై సంపాదన లేక, మావారు రైస్‌మిల్లులో పనికి వెళ్లారు. సంపాదన సరిపోక అప్పులు పెరిగాయి. వీటి నుంచి బయటపడాలంటే మరో వ్యాపారం చూసుకోవాలని అనుకున్నాను. కానీ ఏ వ్యాపారం పెట్టాలి? యూట్యూబ్‌లో వెతుకుతంటే జనపనార సంచులు (జ్యూట్ బ్యాగ్స్) తయారీ గురించి తెలిసింది. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు సాధించవచ్చని చెప్పడంతో 2021లో 'స్త్రీ నిధి' పథకం ద్వారా రెండు లక్షలు రుణం తీసుకున్నాను. హైదరాబాద్ నుంచి ముడిసరుకు తెచ్చాను. ఇంట్లో ఉన్న మిషన్ మీద బ్యాగులు తయారు చేసి, స్థానికంగా అమ్మాం. లాభాలు పెద్దగా రాకపోవడంతో నలుగురం కలిసి ప్రారంభించిన ఈ ప్రాజెక్టు నుంచి ముగ్గురు తప్పుకున్నారు. అప్పుడు, పిల్లల స్కూలు ఫీజులు... ప్రతి రూపాయికీ వెతుక్కోవాల్సి వచ్చేది. కేంద్ర ప్రభుత్వ 'లఖ్‌పతి దీదీ' పథకం ద్వారా రుణం తీసుకొని, రూ.15 లక్షలతో నానోఓవెన్ మిషన్ తీసుకువచ్చాం. చాలామంది వద్దని వారించారు. వారి మాటలు నాలో మరింత పట్టుదలను పెంచాయి. బ్యాగుల తయారీ మొదలుపెట్టాం.

మరికొందరికి ఉపాధి...


మా బ్యాగులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. లాభాలు కనిపించాయి. రెండు దఫాలుగా మరో 11 లక్షల రుణం తీసుకొని వ్యాపారాన్ని విస్తరించాం. లాభాలను పెట్టుబడిగా మలిచి ఉత్పత్తిని పెంచుకొంటూ వెళ్లాం. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా బ్యాగులు తయారు చేస్తూ, వారి నమ్మకాన్ని, ఆదరణను పొందాం. ఆరంభంలో నేను, మావారు చుట్టుపక్కల ఊళ్లకు వెళ్లి బ్యాగులు అమ్మేవాళ్లం. ఇప్పుడు వివిధ కంపెనీల నుంచి ఎన్నో ఆర్డర్లు వస్తున్నాయి. ముడిసరుకును బెంగళూరు, చెన్నై, బెంగళూరు నుంచి తెప్పిస్తున్నాం. ప్రస్తుతం శాయంపేటలోని మా తయారీ కేంద్రంలో ఐదుగురు మహిళలు పని చేస్తున్నారు. మా టర్నోవర్ ఏడాదికి 1.25 కోట్ల రూపాయలకు చేరింది. ఖర్చులన్నీ పోనూ నెలకు రూ.75 వేలు మిగులుతుంది. రెండేళ్ల కిందట డీఆర్‌డీఏ అధికారుల నుంచి 'ఉమన్ లీడర్‌షిప్' అవార్డు అందుకున్నాను.

> **అరుదైన అవకాశం...**
>
> 
>
> గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే వేడుకల్లో పాల్గొనే అద్భుతమైన, అరుదైన అవకాశం నాకు లభించింది. 'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ' (సెర్ప్) సహకారంతో పారిశ్రామికవేత్తగా ఎదిగినందుకు గానూ నాకు ఈ ఆహ్వానం అందింది. వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడంతోపాటు ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులను కలిసే అదృష్టం దక్కినందుకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. చిన్నప్పటి నుంచీ నేను పడిన కష్టాలకు, ఒక మహిళగా స్వయంకృషితో ఎదిగి, పారిశ్రామికవేత్తగా విజయం సాధించినందుకు నాకు దక్కిన గౌరవం ఇది.

• తడుక రాజనారాయణ, వరంగల్

అన్నపూర్ణలా ఆకలి తీరుస్తున్నారు...

రోజూ ఉదయం పదిగంటల తరువాత ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లా రాజ్‌పూర్ గ్రామంలో ఒక ట్రక్కు బయలుదేరుతుంది. ఆ చుట్టుపక్కల ఏడు గిరిజన గ్రామాల్లో పర్యటిస్తుంది. గామ కూడలిలో ఆ వ్యాన్ ఆగగానే... ఆకలితో ఉన్న ప్రజలు దాని దగ్గరకు చేరుకుంటారు. వారందరికీ సంతృప్తిగా భోజనం అందించాక... వ్యాన్ మరో గ్రామానికి బయలుదేరుతుంది. దాదాపు నాలుగున్నర సంవత్సరాలుగా వందల మందికి కడుపు నింపుతున్న ఈ ప్రయత్నం వెనుక ఉన్న అన్నపూర్ణ.... 55 ఏళ్ల బిపిన్‌దేవి.



"ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని చివరి జిల్లాలో ఉన్న మా ప్రాంతంలో కనీస అభివృద్ధికి నోచుకోని గ్రామాలు ఎన్నో. అక్కడ వ్యవసాయం, పశువుల పెంపకం మాత్రమే ప్రజల ఆదాయ మార్గాలు. వర్షాలు సరిగ్గా పడకపోవడంతో కొన్నేళ్ళుగా సాగు లాభదాయకంగా ఉండడం లేదు. ఉపాధి కల్పించే పరిశ్రమలు కూడా పెద్దగా లేవు. దీంతో ప్రజలు తమ కుటుంబాలకు తిండి పెట్టడం కోసం ఎన్నో కష్టాలు పడాల్సి వస్తోంది. ఆఖరికి పిల్లలు కూడా ఆకలితోనే నిద్రపోవడం చూసి చాలా బాధ కలిగింది" అని చెబుతారు బిపిన్ దేవి. తన ఆవేదనను భర్త కల్లు యాదవ్‌తో ఆమె పంచుకున్నారు. అన్నార్తుల ఆకలి తీర్చాలనే ఆమె ఆలోచనకు చిన్న కిరాణా దుకాణం నడిపే కల్లూ యాదవ్‌తో పాటు వారి కుమారులు నీరజ్, మోహిత్ కూడా మద్దతిచ్చారు. ఈలోగా కరోనా రావడంతో... గ్రామాల పరిస్థితులు మరింత దిగజారాయి. దాంతో తక్షణమే బిపిన్ దేవి రంగంలోకి దిగారు. 'చాచీ కీ రసోయ్' పేరుతో ఆహార పంపిణీ ప్రారంభించారు. "అంతకుముందు కూడా మా చుట్టూ ఉండే పేదలకు, ఆకలితో ఉన్నవారికి సాయం చెయ్యడానికి ఎప్పుడూ వెనుకాడలేదు. అయితే ఈసారి మేమే వారి దగ్గరకు వెళ్లాలని అనుకున్నాం. దుకాణం కోసం సరుకులు తెచ్చుకోవడానికి మా దగ్గర ఒక వ్యాన్ ఉంది. దాన్ని సంచార ఆహార శాలగా మార్చాం. ఇంటి దగ్గర వండిన ఆహారాన్ని తీసుకొని గ్రామాల్లో పంచడం మొదలుపెట్టాం" అని ఆమె గుర్తు చేసుకున్నారు.

కాలి గాయాలైనా...

ప్రతి గ్రామం రెండు కిలోమీటర్ల లోపే ఉండడంతో మధ్యాహ్నం అయ్యేలోగా భోజనం పంపిణీ పూర్తయిపోతుంది. రోజువారీగా అందించే భోజనంలో అన్నం, రొట్టెలు, పప్పు, కూర ఉంటాయి. "రోజూ తెల్లవారుజామునే లేచి పని ప్రారంభిస్తాను. మా అబ్బాయిలు, స్థానిక మహిళలు వంటలో సాయం చేస్తారు. ఒక్కోసారి ఎక్కువమందికి వండాల్సి ఉంటుంది. మూడేళ్ళ కిందట... గ్రామస్తుల కోరిక మేరకు భారీగా వంట చెయ్యాల్సి వచ్చింది. పొయ్యిలోంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. నా చేతులు కాలి బొబ్బలెక్కాయి. వెంటనే వంట ఆపెయ్యాలని మా నా భర్త, పిల్లలు చెప్పారు. ఆకలితో ఉన్న ఎంతో మంది నేను తీసుకువెళ్ళే భోజనం కోసం ఎదురుచూస్తున్నప్పుడు... నా బాధ చాలా చిన్నదనిపించింది. వంట పూర్తి చేశాను. ఆహార పదార్థాల్ని గ్రామాలకు తీసుకువెళ్ళి వడ్డించాను. వారు సంతృప్తిగా తినడం చూసి నా నొప్పిని మరచిపోయాను" అని అంటారు బిపిన్‌దేవి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా భోజనం పంపిణీ కొనసాగించాలనే ఆమె సంకల్పాన్ని ఈ సంఘటన మరింత బలోపేతం చేసింది.


ఆ మాటలే ఆదర్శం...

ఏవైనా ఆటంకాలు ఎదురైతే తప్ప... దాదాపు రోజూ ఆమె వంట వ్యాన్ గ్రామాలకు ఠంచనుగా వెళ్తుంది. దాన్ని ఆమె పిల్లల్లో ఒకరు నడుపుతారు. "మా సోదరులిద్దరం నాన్నతో పాటు మా కిరాణా దుకాణంలోనే పని చేస్తాం. ఎవరు అడిగినా లేదనకుండా అమ్మ సాయం చెయ్యడం మా చిన్నతనం నుంచి చూస్తూ పెరిగాం. అందుకే... ఈ ఆలోచన ఆమె చెప్పినప్పుడు ఆశ్చర్యంగా అనిపించలేదు. మాది పొదుపుగా బతికే కుటుంబం. అమ్మ ఆలోచనను ఆచరణలో పెట్టడం కోసం ఖర్చుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని అనుకున్నాం. వంట సామాన్లకు, వాహనం డీజిల్‌కు, ప్లేట్లు, గ్లాసుల్లాంటి వాటికి నెలకు 60 వేల రూపాయల వరకూ ఖర్చవుతోంది. మా దుకాణం, చిన్న పొలం మీద వచ్చే ఆదాయంతో... మేము జీవిస్తూ, ఇతరులకు సాయం చేస్తున్నాం. "మన అవసరాలు గడుస్తూ, నలుగురికీ మంచి చేస్తే చాలు. భారీగా డబ్బు వెనకేసుకోకపోయినా పరవాలేదు" అంటారు మా అమ్మానాన్నా. వారి మాటలే మాకు ఆదర్శం" అని చెబుతారు బిపిన్‌దేవి కుమారులు. "ఆకలి చావుల గురించి ఎన్నో కథలు విన్నాను. అలాంటి దుస్థితి ఎవరికీ రాకూడదు. సాటి మనుషుల కోసం నేను చేస్తున్నదానికి సేవ అనేది పెద్ద మాట. సమాజంలో వ్యక్తిగా ఇది నా బాధ్యత" అంటున్నారు బిపిన్‌దేవి.



మంచి నిద్ర కోసం...

రోజంతా ఎన్నో పనులతో శరీరం అలసిపోతూ ఉంటుంది. అలసట తీరి అవయవాలన్నీ విశ్రాంతి పొందాలంటే శరీరానికి మంచి నిద్ర అవసరం. ప్రతిరోజూ కనీసం ఏడు లేదా ఎనిమిది గంటలు నిద్రించడం ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. నిద్ర బాగా పట్టాలంటే ఏ ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం!



తేనె : ప్రతిరోజూ పడుకునేముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో రెండు చెంచాల తేనె కలుపుకుని తాగాలి. తేనెలో ట్రిప్టోఫాన్ అనే అమైనోయాసిడ్ ఉంటుంది. ఇది శరీరంలో సెరటోనిన్, మెలటోనిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో శరీరంలోని హార్మోన్లు ప్రేరేపితమై గాఢంగా నిద్ర వస్తుంది.



అరటిపండు : మధ్యరాత్రి వేళల్లో కొంతమందికి అకస్మాత్తుగా మెలకువ వస్తుంది. తరవాత నిద్ర పట్టక అవస్థ పడుతూ ఉంటారు. అలాంటి సమయాల్లో బాగా పండిన అరటిపండు తింటే వెంటనే నిద్ర పడుతుంది.



బీన్స్ : వీటిలో బి 6, బి 12 విటమిన్లతోపాటు మెగ్నీషియం, కాల్షియం వంటి పోషకాలు కూడా ఉంటాయి. ఇవన్నీ కలిసి నిద్రను ప్రేరేపిస్తాయి. రాత్రి భోజనంలో బీన్స్‌ను కూర రూపంలో తీసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది.



కివి : ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫోలేట్లు, పీచుపదార్థాలు, పొటాషియంతోపాటు కె, సి, ఇ విటమిన్లు ఉంటాయి. ఇవన్నీ శరీరంలో ఒత్తిడిని, ఆందోళనను తగ్గిస్తాయి. ఫలితంగా మెదడు విశ్రాంతి పొందుతూ నిద్ర వచ్చేలా చేస్తుంది. నిద్రలేమితో బాధపడేవారు, వృద్ధులు ప్రతిరోజూ ఒక కివి పండును తింటూ ఉంటే నాలుగు వారాల్లో సమస్యను అధిగమించవచ్చు.



గసగసాల పాలు : ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర చెంచా గసగసాలు వేసి పావు గంట నానబెట్టండి. స్టవ్ మీద గిన్నెపెట్టి ఒక గ్లాసు పాలు పోసి వేడిచేయండి. ఇందులో నానిన గసగసాలు వేసి బాగా మరిగించండి. అయిదు నిమిషాల తరవాత స్టవ్ మీది నుంచి పాలను దించి వడకట్టి కొద్దిగా బెల్లం కలుపుకుని తాగండి. అరగంటలో మంచి నిద్ర వస్తుంది. ఉదయం లేవగానే ప్రశాంతంగా, ఉత్సాహంగా అనిపిస్తుంది.



బాదం : రాత్రి పడుకునేముందు అయిదు బాదం పప్పులు తింటే హాయిగా నిద్ర పడుతుంది. బాదాంలో మెగ్నీషియం, ట్రిప్టోఫాన్ ఉంటాయి. ఇవి శరీరంలోని కండరాలు విశ్రాంతి పొందేలా చేస్తాయి. దీంతో మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తయి శరీరాన్ని నిద్రకు సిద్ధం చేస్తుంది. అలాగే వాల్‌నట్స్, ఓట్స్, గుమ్మడి గింజలు, చెర్రీలు మంచి నిద్రను ప్రేరేపిస్తాయి.



అశ్వగంధ పాలు : అశ్వగంధ మంచి ఆయుర్వేద ఔషధం. ఇందులో మత్తును కలిగించే ట్రై ఇథైల్ గ్లైకాల్ ఉంటుంది. ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో అర చెంచా అశ్వగంధ పొడి కలుపుకుని తాగితే వెంటనే నిద్ర వస్తుంది. ఒత్తిడి, ఆందోళన, అలసట తగ్గిపోతాయి. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.



చామంతి టీ : చామంతి టీ పొడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ నిద్ర వచ్చేలా చేస్తాయి. ఒక కప్పు వేడి నీటిలో ఒక చామంతి టీ బ్యాగ్ వేసి రెండు నిమిషాలు ఉంచండి. తరవాత ఈ గోరువెచ్చని టీని మెల్లగా తాగండి. పావు గంటలో మంచి నిద్ర పడుతుంది.

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే..!

పెరిగే పిల్లలకు పోషకాహారం తప్పనిసరి. శారీరక ఎదుగుదలతోపాటు పిల్లల మానసిక వికాసానికి నిపుణులు సూచిస్తున్న ఆహార పదార్థాలు ఇవే...



- పిల్లలు బడికి వెళ్లే ముందు ఉడికించిన గుడ్డు తినిపించాలి. కేరట్, బీట్‌రూట్ ముక్కలు జత చేసిన ఆమ్లెట్ కూడా మంచిదే. దీనివల్ల శరీర పెరుగుదలకు కావాల్సిన ప్రోటీన్ అందుతుంది.
- ఓట్స్‌ను ఉడికించి దానికి దానిమ్మ గింజలు, స్ట్రాబెరీ ముక్కలు చేర్చి తినిపించవచ్చు. వీటివల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో బాదం, కాజు, పిస్తా, వాల్‌నట్, డ్రై అంజూర్, ఖర్జూరం లాంటివి తినిపించడం వల్ల పిల్లలు పొడవుగా పెరుగుతారు. రోగనిరోధక శక్తి కూడా లభిస్తుంది.
- బడి నుంచి ఇంటికి రాగానే రాగి జావ పెట్టడం మంచిది. దీనివల్ల నీరసం, అలసట తగ్గి పిల్లలు ఉత్సాహంగా ఉంటారు.
- ప్రతిరోజూ మధ్యాహ్న భోజనంలో ఆకు కూరలు, పప్పు దినుసులు, నెయ్యి చేర్చి తినిపించాలి. వీటివల్ల కాల్షియం, ఇతర పోషకాలు అంది ఆరోగ్యంగా పెరుగుతారు.
- ఇడ్లీ, దోశ, శాండ్‌విచ్, పన్నీర్‌తో తయారుచేసిన వంటకాలు తినిపించడంవల్ల తక్షణ శక్తి లభిస్తుంది.
- ప్రతిరోజూ ఉదయాన్నే ఒక గ్లాసు పాలు తాగించాలి. భోజనంలో మజ్జిగను చేర్చాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు కూరగాయయలు ఉడికించి తయారుచేసిన సూప్ తాగించవచ్చు. వీటివల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ ఏర్పడదు.
- కాలానుగుణంగా లభించే యాపిల్, అరటి, జామ, ద్రాక్ష, మామిడి పండ్లను పిల్లలచేత తినిపించాలి. అప్పుడే వారికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు అందుతాయి. తరచూ పల్లీలు, బెల్లం, నువ్వులు పెడితే రక్తహీనత లాంటి సమస్యలు రావు.
- చిక్కుళ్లు, బఠానీలు, మొలకలను తినడం అలవాటు చేయాలి. బ్రకోలీ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, టమాటా, దోస, కీర లాంటి కూరగాయలను ఆహారంలో చేర్చి పిల్లలకు పెట్టడం మంచిది.


గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఆకాశ్ ఆర్మీ లాంచర్

మోదీ తలపాగా ప్రత్యేక ఆకర్షణ

గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ పసుపు, ఎరుపు వర్ణాలతో కూడిన తలపాగా 'సఫా'ను ధరించారు. ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల్లో వివిధ ప్రాంతాలకు చెందిన తలపాగాలను ధరించడం ద్వారా అక్కడి సంస్కృతిని మోదీ ప్రతిబింబింపజేస్తున్నారు. గతేడాది గణతంత్ర వేడుకల్లో రాజస్థానీలు ధరించే బహుళ రంగుల తలపాగాను ఆయన ధరించారు. కాగా, కర్తవ్యపథ్‌లో చెత్తను ఏరడం ద్వారా 'స్వచ్ఛభారత్' ప్రాముఖ్యతను ప్రధాని మోదీ గణతంత్ర వేడుకల్లో చాటిచెప్పారు.


కర్తవ్యపథ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటో, ప్రధాని మోదీ

కర్తవ్యపథ్‌లో సైనిక సత్తా

గణతంత్ర పరేడ్‌లో త్రివిధ దళాల విన్యాసాలు.. సాయుధ పాటవానికి అద్దం పట్టిన వేడుకలు

» వేడుకలకు 10వేల మందికి పైగా అతిథులు

న్యూఢిల్లీ, జనవరి 26: భారత 76వ గణతంత్ర వేడుకలు మన సైనిక సత్తాకు వేదికగా నిలిచాయి. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలు త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలను చాటిచెప్పాయి. ఎలైట్ బృందాల కవాతులు, క్షిపణులు, స్వదేశీ ఆయుధ వ్యవస్థలతో సహా సైనిక శక్తిని ఘనంగా ప్రదర్శించాయి. దేశ ఘన సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుంబియాటో సైనిక విన్యాసాలను ఆసాంతం ఆసక్తిగా తిలకించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ఆయన సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేడుకలకు రావడం ఆకట్టుకుంది. ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్, పలువురు కేంద్ర మంత్రులు, దేశ అత్యున్నత సైనికాధికారులు, విదేశీ దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నారీ శక్తి

గణతంత్ర వేడుకల్లో మహిళా బృందాల పరేడ్, మహిళ, శిశు అభివృద్ధికి సంబంధించిన శకటాల ప్రదర్శనతో కర్తవ్యపథ్‌లో నారీశక్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఐశ్వర్య జాయ్ నేతృత్వంలో 148 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ మహిళా బృందం, సీనియర్ అధికారిణి ఏక్తా కుమారి నేతృత్వంలోని ఎన్‌సీసీ బాలికల బృందం, మదేశ్ అశోక్, అంకితా కుమారి నేతృత్వంలోని ఎన్‌సీసీ సంయుక్త బ్యాండ్ బృందం పరేడ్‌లో పాల్గొన్నాయి. అలాగే, ఢిల్లీ పోలీసుకు చెందిన మహిళా బృందం వరుసగా రెండో ఏడాది బ్యాండ్ మాస్టర్ రుయంగునో కెన్సే నేతృత్వంలో బ్యాండ్ ప్రదర్శన నిర్వహించింది. ఆర్మీ, నావికాదళ, వైమానిక దళ మహిళా దళాల కవాతులకు సీనియర్ మహిళా అధికారిణులు లెఫ్టినెంట్ రవీందర్‌జీత్ రంధ్వా, లెఫ్టినెంట్ కమాండర్ మణి అగర్వాల్, ఫ్లైట్ లెఫ్టినెంట్ రుచి సహ నేతృత్వం వహించారు. అలాగే, డీఆర్‌డీవో బృందం కవాతుకు శాస్త్రవేత్త సునీతా జెనా నేతృత్వం వహించారు. 'మాతృత్వం, జీవిత చక్రం నిరంతర విధానం, మహిళల నేతృత్వంలో అభివృద్ధి' అనే థీమ్‌తో మహిళా శిశు అభివృద్ధి శాఖ శకటాన్ని ప్రదర్శించింది. కవాతులో 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు సందడి చేయగా, వాటిలో మహిళా సాధికారతను ప్రతిబింబించేవి 26 ఉన్నాయి. సుమారు 15 మంది మహిళా పైలట్ల బృందం ఫ్లైపాస్ట్‌లో ప్రతిభను ప్రదర్శించింది.


'ప్రళయ్' ప్రదర్శన

ఇండోనేసియా దళం బ్యాండ్

స్వదేశీ పరిజ్ఞానంతో డీఆర్‌డీవో తయారు చేసిన ప్రళయ్ క్షిపణిని తొలిసారిగా గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించారు. ఇది ఉపరితలం నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే స్వల్పశ్రేణి క్షిపణి. దీని పరిధి 150 నుంచి 500 కిలోమీటర్ల వరకు ఉంటుంది. 500 నుంచి వెయ్యి కిలోల బరువులను మోసుకెళ్లగలదు. ఇది అణ్వాయుధాలనూ తీసుకెళ్లగలదు. అలాగే, డీఆర్‌డీవో రూపొందించిన క్షిపణులను పరేడ్‌లో ప్రదర్శించారు.


ఇండోనేసియా కవాతు దళం, బ్యాండ్ దళం ఈసారి తొలిసారిగా గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాయి. ఇండోనేసియా మిలటరీ దళాలు విదేశీ గడ్డపై కవాతు, బ్యాండ్ ప్రదర్శన నిర్వహించడం కూడా ఇదే తొలిసారి. ఇండోనేసియా త్రివిధ దళాలకు చెందిన 152 మంది కవాతులో పాల్గొనగా, మరో 190 మంది బ్యాండ్ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రతి నెలా చివరి ఆదివారాలలో నిర్వహిస్తున్న మన్ కీ బాత్ (రేడియో) కార్యక్రమాల్లో పాల్గొన్న సుమారు 400 మందిని గణతంత్ర వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

5వేల మంది కళాకారులు..

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 5వేల మందికి పైగా జానపద, గిరిజన కళాకారులు.. 45 నృత్య రూపాలను ప్రదర్శించారు. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'జయతి జయ మామా భారతం' పేరుతో 11 నిమిషాల పాటు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని దేశంలోని గిరిజన, జానపద రూపాల గొప్పదనం, వారసత్వాన్ని కొనసాగించేలా ప్రదర్శించిన నృత్య రీతులు విశేషంగా ఆకట్టుకున్నాయి. గణతంత్ర వేడుకలకు గ్రామ సర్పంచ్‌లు, విపత్తు సహాయక కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పారాలింపిక్ అథ్లెట్లు సహా సుమారు 10వేల మంది ప్రత్యేక అతిథులు వేడుకలకు హాజరయ్యారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ కింద పునరుత్పాదక శక్తిని వినియోగించే రైతులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

ఆకట్టుకున్న శకటాలు

బలమైన, సురక్షితమైన భారత్ థీమ్‌తో త్రివిధ దళాలకు చెందిన శకటం సాయుధ దళాల మధ్య విస్తృత సమైక్యతా స్ఫూర్తిని ప్రతిబింబించింది. అధునాతన ఆయుధ వ్యవస్థలతో దేశీయంగా రూపొందించిన అర్జున్ యుద్ధ ట్యాంకు, తేజస్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లతో భూమి, నీరు, ఆకాశంలో ఏకకాలంలో యుద్ధం చేయగలిగిన ఉమ్మడి సైనిక సామర్థ్యాలను ప్రదర్శించింది. నలుగురు అధికారులు, ఐఎన్‌ఎస్ సూరత్, ఐఎన్‌ఎస్ నీలగిరి, ఐఎన్‌ఎస్ వాఘ్‌షీర్ నమూనాలతో భారత సముద్ర ప్రయోజనాలను పరిరక్షించగల బలమైన ఆత్మనిర్భర్ నావికా దళానికి ప్రతీకగా ఇండియన్ నేవీకి చెందిన శకటం నిలిచింది. నలుగురు అధికారులు, 144 మంది సిబ్బందితో కూడిన ఐఏఎఫ్ బృందం తొలుత మూడు మిగ్-29 ఎయిర్‌క్రాఫ్ట్‌లతో ఫ్లై-పాస్ట్ నిర్వహించింది. బీఎస్‌ఎఫ్‌కు చెందిన ఒంటె దళం కవాతు ఆకర్షణగా నిలిచింది. డేర్ డెవిల్స్‌గా ప్రసిద్ధి పొందిన కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్ చేసిన మోటార్ సైకిల్ విన్యాసాలు కళ్లు తిప్పుకోనివ్వలేదు. చివరిగా వాయుసేనకు చెందిన రాఫేల్, సుఖోయ్, జాగ్వార్, డోర్నియర్ తదితర 22 యుద్ధ విమానాలు, 11 రవాణా విమానాలు, 7 అపాచీ, ఎంఐ-17 హెలికాప్టర్లు చేసిన ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో వేడుకలు ఘనంగా ముగిశాయి.


రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ రూపొందించిన శకటం

దండకారణ్యంలో జాతీయజెండా రెపరెపలు

» ఛత్తీస్‌గఢ్‌లోని ఏజెన్సీ గ్రామాల్లో తొలిసారి

» హిడ్మా గ్రామంలో బస్సు సర్వీస్ ప్రారంభం


బీజాపూర్ జిల్లా కొర్‌గట్టు గ్రామంలో జాతీయజెండా ఎగురవేస్తున్న బలగాలు

చర్ల, జనవరి26(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్ట్ ప్రభావిత బీజాపూర్ దండకారణ్యంలో మొదటిసారి జాతీయ జెండాలు రెపరెపలాడాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం కొండపల్లి, కొర్‌గట్టు, జీడిపల్లి తదితర గ్రామాల్లో జాతీయ జెండాలు ఎగిరాయి. కేంద్ర బలగాల అధికారులు భారీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి స్థానికులకు జాతీయ జెండా ఎగుర వేస్తున్న దృశ్యాలు చూపించారు. అలాగే స్థానిక విద్యార్థులతో ర్యాలీ కూడా నిర్వహించారు. మావోయిస్ట్ నేత హిడ్మా సొంతూరైన కొర్‌గట్టు గ్రామం నుంచి బస్‌సర్వీస్ ట్రయల్‌రన్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాల నిఘాలో ప్రత్యేకమైన బందోబస్తు నడుమ బస్సును కొర్‌గట్టు గ్రామం నుంచి పామేడు గ్రామం వరకు నడిపించారు. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసీలకు దుస్తులు అందజేశారు. మావోయిస్టు నేత హిడ్మా ప్రభావం ఉన్న ప్రాంతాలు కావడంతో 5 నెలల క్రితం కేంద్ర బలగాలు ఇక్కడ పోలీస్ క్యాంపులు ఏర్పాటు చేశాయి.

అబ్బుర పర్చిన డేర్ డెవిల్స్ విన్యాసాలు



మోటార్ సైకిళ్లతో సైనికుల బృందం నిర్వహించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. 'డేర్ డెవిల్స్'గా పేరొందిన ఆర్మీ సైనికులు మోటార్ సైకిళ్లపై అసాధారణ నైపుణ్యాలు ప్రదర్శించింది. ఈ ప్రదర్శనలో ముఖ్యంగా కెప్టెన్ డింపుల్ సింగ్ భాటి.. అందరి దృష్టినీ ఆకర్షించారు. కదులుతున్న మోటార్‌సైకిల్‌పై అమర్చిన 12 అడుగుల నిచ్చెనపై నుంచి ఆమె రాష్ట్రపతి ముర్ముకు గౌరవ వందనం సమర్పించారు. తద్వారా ఆర్మీలో ఈ ఘనత సాధించిన తొలి మహిళా అధికారిగా ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

లోకం తీరు



సైఫ్‌పై దాడి కేసు నిందితుడి

వేలిముద్రలు ఎక్కడ?

» ఘటనాస్థలంలో 19 నమూనాల సేకరణ

» దేనితోనూ సరిపోని షరీఫుల్ ముద్రలు



ముంబై, జనవరి 26: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి కేసు కీలక మలుపు తిరిగింది. ముంబైలోని ఆయన ఇంట్లోకి చొరబడి ఆయనపై దాడి చేసిన నిందితుడు, బంగ్లాదేశ్ జాతీయుడైన షరీఫుల్ ఇస్లాం షెహజాద్ వేలిముద్రలు, ఘటనాస్థలి నుంచి సేకరించిన వేలిముద్రలతో సరిపోలేదు. ఈ మేరకు మహారాష్ట్ర సీఐడీని ఉటంకిస్తూ జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. షరీఫుల్ రెండు చేతుల నుంచీ పది వేలిముద్రలను సేకరించి సీఐడీకి చెందిన ఫింగర్ ప్రింట్ బ్యూరోకు పంపగా, ఘటనా స్థలి నుంచి సేకరించిన 19 వేలిముద్రల శాంపిల్స్‌లో ఏ ఒక్కదానితోనూ సరిపోలేదు. ఈ మేరకు నివేదికను పుణెలోని సీఐడీ సూపరింటెండెంట్‌కు నివేదించారు. చిత్రం ఏమిటంటే.. సైఫ్‌పై దాడికి సంబంధించి షరీఫుల్‌ను అదుపులోకి తీసుకునే ముందే అనుమానంతో వేర్వేరు చోట్ల ఇద్దరిని ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ ఇద్దరికీ ఈ కేసుతో సంబంధం లేదని నిర్ధారించుకొని వదిలేశారు.

సనాతన వైదిక దేశం ఏర్పాటే లక్ష్యం

» ధర్మ్ సంవాద్‌లో తీర్మానం

మహాకుంభ్‌నగర్, జనవరి 26: భారత్‌ను సనాతన వైదిక దేశంగా మార్చడమే లక్ష్యమని పేర్కొంటూ ఆదివారం ఇక్కడ ముగిసిన ధర్మ్ సంవాద్ సమావేశంలో తీర్మానించారు. కుంభమేళా సందర్భంగా ఇక్కడ శ్రీపంచ దశాహ్నం జున అఖాడా ఆధ్వర్యంలో స్వామి నరేంద్ర నాథ్ సరస్వతి అధ్యక్షతన రెండు రోజుల పాటు ఈ సమావేశం జరిగింది. ఇస్లామిక్ జిహాద్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా హిందువులపై దాడులు జరుగుతుండడాన్ని ఈ సమావేశం ఖండించింది. వక్ఫ్ బోర్డును తక్షణమే రద్దు చేయాలని డిమాండు చేసింది. సనాతన ధర్మ పరిరక్షణకు పోరాటం చేస్తున్న ఘాజియాబాద్‌లోని దస్నాదేవి మందిర ప్రధాన అర్చకుడు, మహామండలేశ్వర్ యతి నరసింగానంద్ గిరికి మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించింది.

ప్రత్యేక ఆకర్షణగా 'ఏటికొప్పాక' శకటం



న్యూఢిల్లీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుమల వేంకటేశ్వర్వుడు, వినాయకుడు, ఇతర బొమ్మలతో శకటాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శన వచ్చినప్పుడు పధాని నరేంద్ర మోదీ చేతులు ఊపుతూ కళాకారులకు అభివాదం చేశారు. మరోవైపు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లు చప్పట్లు కొడుతూ సంతోషం వ్యక్తం చేశారు.

ఉత్తమ ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి

గణతంత్ర వేడుకల్లో ఉత్తమ ప్రదర్శనకు కేంద్రం ప్రత్యేక బహుమతులు అందజేయనున్నది. అందుకు ఎస్ఎంఎస్ కాంటెస్టను నిర్వహిస్తోంది. ఇందులో మొదటి కేటగిరిలో సీఆర్పీఎఫ్ బలగాల కవాతు, రెండో కేటగిరిలో రక్షణ బలగాల కవాతు, మూడో కేటగిరిలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన శకటాలు, నాలుగో కేటగిరిలో వివిధ రాష్ట్రాల శకటాలు ఉన్నాయి. ఏపీకి చెందిన ఏటికొప్పాక బొమ్మల శకటం నాలుగో కేటగిరిలో చాయిస్ నంబర్ 6 కింద ఉంది. MYGOVPOLL (SPACE) 357037,6 అని టైప్ చేసి 7738299899 నంబర్‌కు ఎస్ఎంఎస్ చేయడం ద్వారా ఏపీ శకటాన్ని గెలిపించవచ్చని ఐఅండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా www.mygov.in వెబ్‌సైట్‌లో యాక్టివిటీస్ సెక్షన్‌లో పోల్/సర్వే అనే ఆప్షన్‌కు వెళ్లి కూడా నేరుగా ఓటు వెయ్యొచ్చని పేర్కొన్నారు.

నావిక్‌కు సరికొత్త కిక్!

పౌర, సైనిక సేవలు మరింత మెరుగు.. 29న ఎన్‌వీఎస్-02 ఉపగ్రహ ప్రయోగం

» షార్‌లో వందో ప్రయోగానికి ఇస్రో సిద్ధం

» జీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా నావిక్..!

సూళ్లూరుపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇస్రో ఈ నెల 29న రెండో తరం నావిక్02 (ఎన్‌వీఎస్02) ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఈ శాటిలైట్‌ను జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి పంపనుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో ఇప్పటి వరకూ 99 ప్రయోగాలు చేపట్టిన ఇస్రోకిది వందో ప్రయోగం కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ జీఎస్ఎల్వీ-ఎఫ్15/ఎన్‌వీఎస్-02 మిషన్ లక్ష్యం. రెండేళ్ల క్రితం ఎన్‌వీఎస్-01 ప్రయోగాన్ని చేపట్టగా.. మరింత మెరుగైన సేవలందించేలా ఎన్‌వీఎస్-02ను ప్రయోగిస్తున్నారు. అమెరికా జీపీఎస్ తరహాలోనే భారత్‌కు చెందిన నావిక్‌ను పౌర, సైనిక అవసరాల కోసం రూపొందించారు. నావిగేషన్, వ్యవసాయం, అత్యవసర సేవలు, విమానాల నిర్వహణ, మొబైల్ లోకేషన్ ఆధారిత సేవలను ఇది మెరుగుపరుస్తుంది. ఎన్‌వీఎస్-02 భారత్‌తోపాటు దాని పరిసర ప్రాంతాల్లో కచ్చితమైన నావిగేషన్ సమాచారాన్ని అందిస్తుంది. జీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా దీన్ని అందుబాటులోకి తీసుకురావడం భారత్ లక్ష్యం. ఇక జీఎస్ఎల్వీ-ఎఫ్15 అనేది జీఎస్ఎల్వీ సిరీస్‌లో 17వ ప్రయోగం. దేశీయంగా అభివృద్ధి చేసిన క్రయోజనిక్ ఇంజన్‌ను ఉపయోగించి చేపట్టే 8వ ప్రయోగం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నాలుగు గ్లోబల్ నావిగేషన్ వ్యవస్థలు మాత్రమే ఉన్నాయి. వాటిలో అమెరికాకు చెందిన జీపీఎస్, రష్యాకు చెందిన గ్లోనాస్, యూరోపియన్ యూనియన్‌కు చెందిన గలీలియో, చైనాకు చెందిన బీడౌ అనే నాలుగు మాత్రమే గ్లోబల్ నావిగేషన్ వ్యవస్థలు. భారత్‌కు చెందిన నావిక్, జపాన్ క్యూజెడ్ఎస్ఎస్ ప్రస్తుతానికి ప్రాంతీయ వ్యవస్థలే అయినప్పటికీ.. భవిష్యత్తులో గ్లోబల్ వ్యవస్థలుగా మారే అవకాశం ఉంది.

ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్వీ-ఎఫ్15

శ్రీహరికోటలో వందో రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇక్కడి సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ నెల 29న ఉదయం 6:23 గంటలకు ప్రయోగించనున్న జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ఆదివారం రెండో ప్రయోగ వేదికపైకి చేరుకుంది. మూడు దశల అనుసంధాన పనులు పూర్తిచేసిన శాస్త్రవేత్తలు రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాన్ని అమర్చి.. రెండో ప్రయోగ వేదికపై తుది పరీక్షలు నిర్వహించారు. ప్రయోగానికి ముందు నిర్వహించే రిహార్సల్‌ను కూడా ఆదివారం పూర్తి చేశారు. శ్రీహరికోటలో ఇస్రోకు ఇది వందో ప్రయోగం కావడంతో పాటు ఈ ఏడాది షార్ నుంచి మొదటి ప్రయోగం కావడం విశేషం.

త్వరలోనే మూడో లాంచ్ ప్యాడ్ పనులు ప్రారంభం

శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌లో మూడో లాంచ్ ప్యాడ్‌తో పాటు తమిళనాడులోని కులశేఖరపట్నంలో మరో లాంచ్ ప్యాడ్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. ఆదివారం ఆయన షార్‌లోని భాస్కర అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. పనులు ప్రారంభించాక నాలుగేళ్లలో నిర్మాణం పూర్తవుతుందని పేర్కొన్నారు. మూడో ప్రయోగ వేదిక నుంచి 20-25 టన్నుల బరువు గల రాకెట్ ప్రయోగాలు చేపట్టవచ్చన్నారు. రెండో లాంచ్ ప్యాడ్‌ను అనుసంధానం చేస్తూ అధునాతన వసతులతో మూడో ప్రయోగ వేదిక ఉంటుందన్నారు. ఈ ఏడాది మరిన్ని ప్రయోగాలు ఉంటాయన్నారు. గగనయాన్ ప్రయోగ ఏర్పాట్లు కూడా చకచకా జరుగుతున్నాయన్నారు. అంతరిక్షంలో నిర్మించబోయే భారత స్పేస్ స్టేషన్‌కు మరో రెండు డాకింగ్ ఉపగ్రహ ప్రయోగాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.

'ఉగ్ర' డ్రోన్ల ఉపద్రవం!

ఆఫ్రికా దేశాల్లో కొన్నేళ్లుగా నిఘా, పర్యవేక్షణకు డ్రోన్లను వినియోగించిన ఉగ్రవాద సంస్థలు



ప్రపంచంలోని పలు దేశాల్లో.. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో ఉగ్రవాదులు ఇటీవల తరచుగా డ్రోన్ దాడులతో భయాందోళనలు సృష్టిస్తున్నారు! కానీ అవన్నీ చిన్నాచితకా దాడులు. సూడాన్‌లో ఆస్పత్రిపై జరిగింది చాలా పెద్ద దాడి. సింగపూర్‌లోని 'ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ పొలిటికల్ వయొలెన్స్ అండ్ టెర్రరిజం రిసెర్చ్'కు చెందిన ర్యాబెన్‌దాస్ ప్రకారం.. ఇన్నాళ్లుగా ఆఫ్రికాలోని ఉగ్రవాదులు 'ప్యాసివ్-డిఫెన్సివ్' ప్రయోజనాల నిమిత్తమే డ్రోన్లను ఎక్కువగా వాడుతున్నారు. అంటే.. నిఘా, పర్యవేక్షణ, చిత్రీకరణ వంటివాటికి మాత్రమే. ఉదాహరణకు.. 2020లో కెన్యాలోని మండాలో ఉన్న అమెరికా మిలటరీ బేస్ చిత్రీకరణకు అల్‌షహాబ్ అనే ఉగ్రవాద సంస్థ డ్రోన్లను ఉపయోగించింది. ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ (ఐఎస్‌డబ్ల్యూఏపీ).. 2022 జూలైలో నైజీరియాలో సైనిక స్థావరాలపై నిఘాకు డ్రోన్లను ఉపయోగించింది. నెల తర్వాత ఆ స్థావరాలపై ఆ సంస్థ సభ్యులు దాడులు చేశారు. కానీ, కొద్దిరోజులుగా వారు వాటిని 'యాక్టివ్-అఫెన్సివ్' రీతిలో.. అంటే బాంబుదాడులకు వాడుతున్నారు. ఈ దాడులకు వారు వినియోగిస్తున్నవి కూడా మార్కెట్లో సులభంగా దొరికే, పౌర ప్రయోజనాలకు ఉపయోగించే క్వాడ్‌కాప్టర్లేనని ర్యాబెన్‌దాస్ వెల్లడించారు. అలాంటి దాడుల్లో అతిపెద్దది తాజాగా సూడాన్‌లో జరిగిన దాడి. ఇది ఇలాగే కొనసాగి.. టెర్రరిస్టులు తమ దాడులకు డ్రోన్లనే ప్రధాన ఆయుధాలుగా ఎంచుకుంటే పెనుప్రమాదమేనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఊహించడానికే భయంగా..

ఏడెనిమిదేళ్ల క్రితం దాకా డ్రోన్లను అంతా విచిత్రంగా చూసేవారు! కానీ.. పెళ్లిళ్లలో డ్రోన్ ఫొటోగ్రఫీ పాపులర్ అయ్యాక అవి అందరికీ చిరపరిచితమయ్యాయి. క్రమంగా వ్యవసాయం, మైనింగ్, టెలికం, విపత్తుల నిర్వహణ, జియో మ్యాపింగ్, అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పర్యవేక్షణ.. ఇలా చాలా రంగాల్లో డ్రోన్ల సేవలు విస్తృతమయ్యాయి. ఇంతవరకూ మంచిదే. ఒకచోట నుంచి చేతిలో కంట్రోలర్ ద్వారా డ్రోన్‌ను కావాల్సిన చోటుకు పంపి కావాల్సిన పని చేయించుకునే వీలున్న నేపథ్యంలో.. ఆ డ్రోన్లను సూడాన్ తరహాలోనే ప్రపంచంలోని మిగతా ప్రాంతాల్లో కూడా ఉగ్రవాదులు ఇష్టం వచ్చినట్టు వాడితే? 2008లో ముంబైలో పాక్‌కు చెందిన లష్కరే తాయిబా ఉగ్రవాది కసబ్, అతడి సహచరులు సృష్టించిన విధ్వంసం గుర్తుందా? తుపాకులు ధరించి.. కనపడ్డవారిని కనపడినట్టుగా విచక్షణరహితంగా కాల్పులు జరిపిన అలాంటి రాక్షసమూక డ్రోన్లను వాడడం ప్రారంభిస్తే? ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించడానికి, ప్రాణనష్టం, ఆస్తి నష్టం కలిగించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఉగ్రవాదులు ఈ టెక్నాలజీని వాడుకుంటే? అనే ఆలోచనకే వణుకు పుడుతోంది. ఉగ్రవాదులే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తీవ్రవాదులు, వేర్పాటువాదులు వాటిని ఆయుధాలుగా మార్చుకుని సామాన్యప్రజలే లక్ష్యంగా విరుచుకుపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది మణిపూర్‌లో అల్లర్లు జరిగిన సమయంలో కూడా.. విద్రోహ శక్తులు డ్రోన్ బాంబులతో రెండుచోట్ల దాడులకు పాల్పడ్డాయి! జనవాసాలపై డ్రోన్లతో బాంబుదాడులు చేయడాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఆ దాడులను 'ఉగ్రవాద చర్య'గా ఆయన అభివర్ణించారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కౌట్రుక్, సెంజం చిరాంగ్ ప్రాంతాల్లో జరిగిన ఆ రెండు దాడుల్లో ఇద్దరు పౌరులు మరణించగా ఒక మహిళ సహా 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై ఈ ముప్పును ఎదుర్కొనే చర్యలు చేపట్టాయి. అస్సాం రైఫిల్స్ విభాగం అక్కడ 'డ్రోన్ నిరోధక వ్యవస్థ'ను ఏర్పాటు చేసింది.

అంతపెద్ద రష్యానే తట్టుకోలేక..

చూడ్డానికి చిన్నగా కనిపిస్తాయిగానీ.. పక్కాగా వాడితే డ్రోన్లు సృష్టించే విధ్వంసం అంతా ఇంతా కాదు! అగ్రరాజ్యమైన అంత పెద్ద రష్యాయే.. ఉక్రెయిన్ ప్రయోగిస్తున్న డ్రోన్ల దెబ్బకు తట్టుకోలేక సతమతమవుతోంది. ఉక్రెయిన్ డ్రోన్ల బారి నుంచి తన యుద్ధట్యాంకులను కాపాడుకోవడానికి ప్లైవుడ్ షీట్లు, రూఫ్ ప్యానెలింగ్ రేకులు, ఇనుప చువ్వలతో రక్షణ కవచాలు కట్టి వాటిని గుడిసెల్లా తయారుచేస్తోంది! దీంతో ఉక్రెయిన్ సైనికులు వాటిని 'టర్టిల్ ట్యాంకు'లు అంటూ ఎగతాళి చేస్తున్నారు! అంతేనా.. తమ దేశ భూభాగాలను ఆక్రమించిన రష్యా సైనికులపై ఉక్రెయిన్ డ్రాగన్ డ్రోన్ల ద్వారా నిప్పుల వర్షం కురిపించి వారిని వణికిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. తమపై దండయాత్రకు దిగిన రష్యాను రెండేళ్లకుపైగా ఉక్రెయిన్ నిలువరించగలుగుతోందంటే దానికి ప్రధాన కారణం ఆ దేశం వాడుతున్న డ్రోన్లే!! అయితే అలా దేశాల మధ్య గొడవల్లో.. సరిహద్దుల్లో డ్రోన్ల ముప్పును ఎదుర్కొనేందుకు సైన్యం వద్ద రకరకాల ప్రణాళికలు ఉంటాయి. మన సైన్యం కూడా సరిహద్దుల ఆవలి నుంచి వచ్చే డ్రోన్లను పసిగట్టి, వాటి పనిపట్టడానికి ఇప్పటికే పలు ఏర్పాట్లు చేసింది. అలా కాకుండా.. ఫొటోగ్రఫీకి వాడే డ్రోన్లకే బాంబులు అమర్చి దేశంలోని ప్రధాన నగరాలపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడితే? ఆ రోగ్ డ్రోన్ల ముప్పును ఎదుర్కొనేందుకు మన పోలీసులు సన్నద్ధంగా ఉన్నారా అనేదే వెయ్యి రూకల ప్రశ్న!! నిజానికి.. ఎన్ఎస్‌జీ మాజీ చీఫ్ ఎంఏ గణపతి ఈ ముప్పును 2021లోనే ఊహించారు. డ్రోన్ దాడులను ఎదుర్కొనేలా దేశంలోని పోలీసు దళాలను నవీకరించాలని ఆయన అప్పట్లోనే సూచించారు. ఈమేరకు వివిధ రాష్ట్రాల పోలీసులకు.. మానేసర్ (గురుగ్రామ్)లోని తమ ఎన్ఎస్‌జీ శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ ఇస్తున్నట్టు 2022లో ఒక ఇంటర్వ్యూలో తెలిపారాయన.

-సెంట్రల్ డెస్క్





జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎస్ విజయానంద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు



హైకోర్టు వద్ద జాతీయ పతాకానికి చీఫ్ జస్టిస్ ఠాకూర్ సెల్యూట్



గణతంత్ర దినోత్సవ వేడుకలలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభివాదం

ఆకలితో ఏ కుటుంబం నిద్రపోకూడదు

రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. సంపూర్ణ పేదరిక నిర్మూలన సాధించడం ద్వారా ఏ కుటుంబమూ ఆకలితో నిద్రపోకుండా, గౌరవప్రదంగా జీవించడమే లక్ష్యంగా పనిచేస్తాం.

- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్

(మొదటి పేజీ తరువాయి)

అప్పులు చేసి సమస్యలు సృష్టించిందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీయే సర్కారు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చి అభివృద్ధి పథం వైపు నడిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును తిరిగి గాడిలో పెట్టేందుకు నిధులు సమకూర్చిందన్నారు. అమరావతిలో నిలిచిపోయిన పనులు పునఃప్రారంభించేందుకు సహకారం అందించిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా తమ ప్రభుత్వం పయనిస్తోందన్నారు. ప్రధాని కలలు కన్న వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించే దిశగా నడుస్తున్నామన్నారు.

[redacted] పరిశ్రమలకు నీరు అందించడంతో పాటు అగ్రిటెక్ విధానం ద్వారా వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తాం. నూతన జల విధానం ద్వారా నదుల అనుసంధానంతో రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2026 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. గోదావరి-పెన్నా అనుసంధానం ద్వారా 2026 జూన్ కల్లా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తాం. గోదావరి నది నుంచి వరద నీటిని బనకచర్ల రెగ్యులేటర్ ద్వారా రాయలసీమలో వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయ ఉత్పత్తుల్లో మార్పులు తీసుకొచ్చి ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ కల్పించేందుకు చర్యలు చేపడతాం' అని గవర్నర్ అన్నారు.

[redacted] భద్రత, పచ్చదనం కల్పిస్తాం. ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది. రాష్ట్రాన్ని అవకాశాల కేంద్రంగా మారుస్తాం. ఉద్యోగార్థులను సైతం ఉద్యోగాలు కల్పించేవారిగా తీర్చిదిద్దుతాం. విద్యా సంస్థల్లోని నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు యువతకు రేపటి అవకాశాల కేంద్రాలుగా మారుతాయి. రాష్ట్రంలో జననాల రేటు తగ్గిపోతోంది. రాబోయే రోజుల్లో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశముంది. ఈ సంక్షోభాన్ని నివారించడానికి ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంచనుంది. మెగాపోర్టులు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు, వివిధ తరహా రవాణాలను అందుబాటులోకి తెస్తాం. విద్యుత్ కొరత లేకుండా సౌర, పవన, హైడ్రో విధానం ద్వారా ఉత్పత్తి చేపడుతున్నాం. పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రోడ్ల మరమ్మత్తులు చేపట్టడంతో పాటు లింకు రోడ్లు, పట్టణాలకు కనెక్టివిటీ పెంచుతున్నాం. వ్యర్థాల నిర్వహణ చర్యలతో పాటు చెత్త నుంచి విద్యుత్ తయారీకి శ్రీకారం చుట్టాం' అని పేర్కొన్నారు.

[redacted] చర్యలు చేపట్టాం. [redacted] వినియోగించుకోవడం ద్వారా నేరాలు తగ్గాయి. రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో ప్రభుత్వం నేరుగా ప్రజలతో మమేకమవుతోంది. సంఘ వ్యతిరేకశక్తులు, డ్రగ్స్, గంజాయి, మహిళలపై అఘాయిత్యాలు వంటి వాటిపై ఉక్కుపాదం మోపాం. ఎక్సైజ్ పాలసీలో పారదర్శకత తీసుకొచ్చాం. వాట్సాప్ ఇంటిగ్రేషన్ ద్వారా ప్రజలకు స్మార్ట్‌ఫోన్ ద్వారా సర్వీసులు అందించే చర్యలు తీసుకుంటున్నాం. వాట్సాప్ ద్వారా 150 రకాల సర్వీసులు అందిస్తున్నాం. ప్రజల భాగస్వామ్యంతో సమష్టి ప్రయత్నాలతో వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోగలమని ఆశిస్తున్నాం. 2047 కల్లా దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 22 కొత్త పాలసీలను తీసుకొచ్చింది. స్వర్ణాంధ్ర సాధన ప్రయత్నంలో 15 శాతం వృద్ధి రేటు సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ముందుకు దూసుకెళ్తుంది. ఏపీ బ్రాండ్ విలువను తిరిగి తీసుకొస్తాం. ఇటీవల దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆ మేరకు ప్రయత్నాలు చేపట్టాం. సంక్షేమం, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దూసుకెళ్తుంది. ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి. తద్వారా ఆరోగ్య, ఐశ్వర్య, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలి' అని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సూక్తులను ప్రస్తావించారు.

ఆకట్టుకున్న శకటాలు

గణతంత్ర వేడుకల్లో వివిధ శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ప్రణాళిక శాఖలు, గృహ నిర్మాణం, పరిశ్రమలు, పర్యాటక, సమగ్రశిక్ష, పాఠశాల విద్య, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆరోగ్యం కుటుంబ సంక్షేమం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, జలవనరులు, రైతు సాధికార సంస్థ, మత్స్య, సీఆర్‌డీఏ, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధిశాఖ పల్లె పండుగ, ఇంధన, ఉద్యాన శాఖలు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రియల్‌టైమ్ గవర్నెన్స్ శకటాలను ప్రదర్శించారు. నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి శకటం, నాణ్యమైన ఉత్పత్తులు, బ్రాండింగ్ ఉద్యాన శాఖ శకటం, గ్లోబల్-బెస్ట్ లాజిస్టిక్స్ సీఆర్‌డీఏ/మున్సిపల్ శాఖ శకటాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. గవర్నర్ నుంచి ఆయా శాఖల అధికారులు అవార్డులు స్వీకరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి భవిష్యత్తు దార్శనికతపై ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలను నగర ప్రజలు తిలకించేందుకు వేడుకల అనంతరం బెంజ్‌సర్కిల్, రామవరప్పాడు రింగ్, గుణదల, ఏలూరు రోడ్డు, కంట్రోల్‌రూం, బందర్‌రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ప్రదర్శన నిర్వహించారు.

నేతల రాకతో కేరింతలు

గణతంత్ర వేడుకల్లో చంద్రబాబు, పవన్, లోకేశ్ సహా, మంత్రులు, అధికారులు, నేతలు పాల్గొన్నారు. బాబు, పవన్, లోకేశ్ స్టేడియంలోకి ప్రవేశించేటప్పుడు యువత, విద్యార్థులు కేరింతలతో సందడి చేశారు.

ఘనంగా 'ఎట్ హోం'

» హాజరైన సీఎం, డిప్యూటీ సీఎం, హైకోర్టు సీజే

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన 'ఎట్ హోం కార్యక్రమం ఘనంగా జరిగింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, గుడియా దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు హాజరయ్యారు. సాయంత్రం 4.30 గంటలకు రాజ్‌భవన్ చేరుకున్న ముఖ్యమంత్రి.. ఉపముఖ్యమంత్రితో కలిసి.. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఎట్ హోం వేదిక వద్దకు తీస్కొని వచ్చారు. గవర్నర్ అతిథులందరి వద్దకూ వెళ్లి పేరుపేరునా ఆప్యాయంగా పలుకరించారు. ఆయన, చంద్రబాబు, పవన్ కాసేపు ముచ్చటించుకున్నారు. లోకేశ్ మిగిలిన అతిథుల మాదిరిగానే రౌండ్ టేబుల్ వద్ద కూర్చున్నారు. ఇది చూసిన వెంటనే ప్రొటోకాల్ అధికారులు ఆయన్ను వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఓ గంట తర్వాత జాతీయ గీతాలాపనతోనే కార్యక్రమం ముగిసింది. మండలి డిప్యూటీ చైర్మన్ జకీయా ఖానమ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, ఎస్.సవిత, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, సీఎస్ కె.విజయానంద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా అధికార, ప్రతిపక్ష నాయకులను, న్యాయమూర్తులను, అధికారులను 'ఎట్ హోం'కు ఆహ్వానించడం ఆనవాయితీ. ఆదివారం 'ఎట్ హోం'కు సీపీఐ నేత కె.రామకృష్ణ రాగా.. వైసీపీ నుంచి ఒక్కరు కూడా హాజరుకాలేదు. కాంగ్రెస్ నుంచీ ఎవరూ రాలేదు.



పరేడ్‌లో పోలీసుల కవాతు





రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన మానవ వనరుల విభాగం శకటం, బహుమతిని అందుకుంటున్న ఆ విభాగం అధికారులు

హైకోర్టులో ఘనంగా గణతంత్ర వేడుకలు

» జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన చీఫ్ జస్టిస్ ఠాకూర్

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ హైకోర్టు భద్రతా సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ ధీరజ్‌సింగ్ మాట్లాడుతూ సమాజ పురోగమనానికి అవసరమైన లక్ష్యాలను సాధించడంతో పాటు భారతదేశ ప్రజాస్వామిక లక్ష్యాన్ని, రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతను న్యాయ వ్యవస్థ నిర్వహిస్తోందన్నారు. న్యాయవ్యవస్థ ప్రకాశవంతంగా పనిచేయడానికి, కోర్టులపై భారాన్ని తగ్గించడానికి న్యాయ సంస్కరణలు దోహదపడ్డాయన్నారు. అంతకు ముందు హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి మాట్లాడారు. స్వాతంత్ర సమరంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించారన్నారు. న్యాయవాదుల విజయాలు కోర్టు హాళ్లకే పరిమితం కాకూడదని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అట్టడుగువర్గాలకు చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు సచివాలయం సమీపంలోని ఏపీ న్యాయసేవాధికార సంస్థ వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలి: సీఎస్

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలని, అప్పుడే రాజ్యాంగ నిర్మాతల కలలు సాకారమవుతాయని సీఎస్ విజయానంద్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమరావతి సచివాలయంలో మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం సీఎస్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతలు ముందు చూపుతో పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా, ఆర్థిక అసమానతలను తొలగించేలా అన్ని అంశాలను పొందుపర్చి గొప్ప రాజ్యాంగాన్ని అందించారని పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. లక్ష్యాల సాధనకు అధికార యంత్రాంగం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీఏడీ ముఖ్య కార్యదర్శి మీనా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర సాధన

» తన నివాసంలో జెండా ఎగరవేసిన సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్ర విజన్-2047ల లక్ష్య సాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో కృషి చేద్దామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం ఉండవల్లిలోని తన నివాస ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి, దేశ ప్రజలందరూ ప్రజాస్వామ్యపు నీడలో సురక్షితంగా, సుభిక్షంగా జీవించడానికి వీలుగా రూపొందించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన వేళ భారతదేశ ప్రజలందరికీ ఎక్స్ వేదికగా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహనీయుల త్యాగాలను స్మరించుకుందామని పేర్కొన్నారు.



సృజనాత్మకతకు మారుపేరు ఏటికొప్పాక బొమ్మలు

మరోవైపు ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఏపీకి చెందిన ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రదర్శనపై సీఎం చంద్రబాబు స్పందించారు. ప్రపంచ ప్రఖ్యాతమైన మన ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రధాని మోదీతో సహా ప్రముఖులందరినీ ఆకట్టుకుందని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పర్యావరణ హితమైన, సహజ సిద్ధమైన వనరులతో చేసే మన ఏటికొప్పాక బొమ్మలు ఆంధ్రప్రదేశ్ కళాకారుల సృజనాత్మకతకు మారుపేరుగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. 'బొమ్మలమ్మ .. బొమ్మలు' అంటూ సాగే పాటతో కర్తవ్యపథ్‌లో సాగిన శకటాల పరంపరలో మన ఏటికొప్పాక బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, దీనికి కారణమైన వారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు.

అసెంబ్లీ 75 రోజులైనా జరగాలి

» అప్పుడే ప్రజా సమస్యలపై లోతైన చర్చ: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై లోతైన చర్చ జరగాలంటే అసెంబ్లీ సమావేశాలు ఏడాదిలో కనీసం 75 రోజులైనా జరగాల్సిన అవసరం ఉందని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. అమరావతిలోని అసెంబ్లీ భవనం వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన తర్వాత మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. స్పీకర్ మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఇన్నేళ్లయినా సమాజంలో పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి, అసమానతలు, లింగ వివక్షత, ఉగ్రవాదం, మతతత్వం, మాదక ద్రవ్యాల వాడకం, మహిళలపై హింస వంటి సవాళ్లు ఉన్నాయని, వాటిని పరిష్కరించుకొనేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభల పనిదినాలు తగ్గిపోవడం చూస్తుంటే ప్రజాస్వామ్యం బలహీనమౌతున్నట్లు అనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 1983లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బడ్జెట్ సమావేశాలే 45 రోజులపాటు జరిగేవని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలందరికీ శాసనసభ నియమాలు, పద్ధతులపై అవగాహన కల్పించేందుకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించాలని భావిస్తున్నామని, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వంటి వారిని ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాదిగ కార్పొరేషన్ అధ్యక్షురాలు ఉండవల్లి శ్రీదేవి, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇక, సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందినప్పుడే సమాజంలోని అసమానతలు పూర్తిగా తొలగుతాయని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. అసెంబ్లీ భవన ప్రాంగణంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.



శాసనసభ వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు



టీడీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, నేతలు షరీఫ్, అశోక్‌బాబు తదితరులు

త్యాగధనులను స్మరించుకోవాలి: పల్లా శ్రీనివాస్

» టీడీపీ కేంద్ర కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలంతా స్వేచ్ఛావాయువు పీల్చడానికి ఎందరో సమరయోధుల త్యాగాలే కారణమని, త్యాగధనులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పల్లా శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణతో పాటు ప్రజల హక్కులను కాపాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఏపీని అభివృద్ధిలో శిఖరాగ్రాన నిలపడమే లక్ష్యంగా పని చేస్తోందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజారెడ్డి రాజ్యాంగం నడిచిందని, నేడు కూటమి పాలనలో అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందని పేర్కొన్నారు.

విజన్-2047 లక్ష్యంతో ముందుకు: అగ్రి వర్సిటీ వీసీ

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యసాధనకు వ్యవసాయ పరిశోధన, విస్తరణ విభాగాల్లో శాస్త్రవేత్తలు పునరంకితం కావాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరు లాంలోని అగ్రి వర్సిటీలో జాతీయ జెండాను వీసీ ఆవిష్కరించారు. వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, అరణ్యభవన్‌లో అటవీ దళాల ముఖ్యఅధికారి చిరంజీవ్‌చౌదరి జెండా ఎగురవేశారు.

ఉద్యోగులకు అవార్డులు

పశుసంవర్థక శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16 మంది అధికారులకు డైరెక్టర్ దామోదర్‌నాయుడు రాష్ట్రస్థాయి పురస్కారాలు అందజేశారు. మరోవైపు విశిష్ట సేవలు అందించిన ఎక్సైజ్ అధికారులు, ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో పురస్కారాలు, ప్రశంసా పత్రాలను ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అందించారు.



గుంటూరు డిప్యూటీ కమిషనర్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎక్సైజ్ విభాగం డైరెక్టర్ నిషాంత్ కుమార్

నా గుండెలపై కూర్చున్న వ్యక్తిని గుర్తించా

- నా హత్యకు కుట్ర జరిగిందనడానికి నాటి కలెక్టర్ రాసిన లేఖే ఆధారం: రఘురామ



గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీఐడీ కార్యాలయంలో తన గుండెలపై కూర్చున్న తులసిబాబును గుర్తుపట్టానని నాటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఐదో కోర్టు మేజిస్ట్రేట్ లత ఎదుట ఆయన ఆదివారం హాజరయ్యారు. ఆమె సమక్షంలో గుంటూరు జిల్లా జైలులో నిర్వహించిన నిందితుడి గుర్తింపు పరేడ్ ప్రక్రియలో రఘురామ పాల్గొన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న తులసిబాబుతో పాటు అతనితో సరి సమానంగా ఉన్న మరో ఐదారుగురిలో ఆయన గుండెలపై కూర్చుని కొట్టిన వ్యక్తిని గుర్తించే ప్రక్రియను నిర్వహించారు. అనంతరం జైలు బయట రఘురామ మీడియాతో మాట్లాడారు. తన ఎదుట నిలబడినవారిలో తన గుండెలపై కూర్చున్న వ్యక్తిని గుర్తించానని తెలిపారు. 'నా గుండెలపై కూర్చొని ఉన్న సమయంలో ఆయన ముఖానికి ఉన్న కర్చీఫ్ జారింది. అప్పట్లో తులసిబాబును దగ్గర్నుంచి చూడటంతో పరేడ్‌లో ఆయన్ను స్పష్టంగా గుర్తుపట్టాను. తులసిబాబు గురించి టీవీలో చూశా. తులసిదళం అని, గుడివాడలో ఎమ్మెల్యేను ఆయనే గెలిపించాడని అనేక రకాల వార్తలొచ్చాయి. నాపై హత్యాయత్నం కేసులో నిందితుడికి గుడివాడ ఎమ్మెల్యే సహకారం అందించిన విషయాన్ని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చూసుకుంటారని అనుకుంటున్నా. ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు పార్టీలో ఎటువంటి పదవి లేదని తెలిసింది. ఆయన్ను పార్టీకి దూరంగా ఉంచుతారేమోనని, సాధారణ సభ్యత్వం నుంచి పక్కన పెడతారేమోనని భావిస్తున్నా. తులసిబాబు చరిత్ర గుడివాడ ప్రాంత వాసులకే కాకుండా ప్రకాశం జిల్లా వారికి బాగా తెలుసు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ కార్యాలయంలోకి ఎటువంటి అనుమతి లేకుండా నేరుగా లోపలకు వెళ్లగలిగిన స్థాయి తులసిబాబుకు మాత్రమే ఉండేది. అతనితో పాటు నాపై దాడి చేసినవారిలో మరికొందరు అనుమానితులు ఉన్నారు' అని రఘురామ పేర్కొన్నారు. తనపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితురాలు, నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి పరారీలో ఉన్నారని, ప్రస్తుతం ఆమె ఏ కలుగులో దాక్కున్నారోనని రఘురామరాజు అన్నారు. ముందస్తు బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ఆ పిటిషన్‌లో తాను కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఇదే కేసులో నిందితుడు విజయ్‌పాల్ తరహాలో ప్రభావతి కూడా పెద్ద లాయర్లను పెట్టుకుంటారేమో చూడాలని రఘురామ చెప్పారు.

లేఖ రాసిన నాటి కలెక్టర్‌ను విచారించాలి

హైదరాబాద్‌లో తనను అరెస్టు చేయడానికి కొద్ది గంటల ముందే ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ రాసిన లేఖే తన హత్యకు కుట్ర జరిగిందనడానికి మరో ఆధారమని రఘురామ తెలిపారు. 'వీఐపీ వస్తున్నారు.. జీజీహెచ్‌లో గుండె వైద్య నిపుణుడిని అందుబాటులో ఉంచాలని సూపరింటెండెంట్‌ను అప్రమత్తం చేస్తూ ముందుగానే కలెక్టర్ లేఖ రాశారు. ఆ లెటర్ రాయాల్సి వచ్చిందో విచారణలో తేలాల్సి ఉంది. నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌పై కేసు నమోదైనా ఎందుకు సస్పెండ్ చేయలేదో, ఆయనకు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడంలేదు. నాపై హత్యాయత్నం కేసులో విచరణ సాఫీగానే జరుగుతుందని భావిస్తున్నా. ఆలస్యమైనా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది' అని రఘురామ తెలిపారు.

మరింత చేరువగా సచివాలయాలు

(మొదటి పేజీ తరువాయి)

జనాభాలోపు ఉన్న సచివాలయాలను 'విభాగం-సీ'గా వర్గీకరించారు. 'విభాగం-ఏ' కింద ఉన్న సచివాలయాల్లో కనీసం ఆరుగురు సిబ్బందిని, 'విభాగం-బీ' సచివాలయాల్లో కనీసం ఏడుగురు, 'విభాగం-సీ' సచివాలయాల్లో కనీసం 8మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఆయా సచివాలయాల పరిధిలోని జనాభా సంఖ్యనుబట్టి సిబ్బందిని పెంచుతారు. ఆస్పిరేషనల్ సిబ్బందిని నియమిస్తారు. వీరికి ఏఐ, ఐటీ, డ్రోన్స్ తదితర సాంకేతికతలపై శిక్షణ ఇస్తారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సరిపోను మిగిలిన సిబ్బందిని ఆయా శాఖలకు సంబంధించిన ఇతర విభాగాలకు కేటాయిస్తారు. గిరిజన ప్రాంతాల్లో ఏవైనా నివాసిత ప్రాంతాలు 10కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువగా ఉంటే అలాంటి ప్రాంతాలను పంచాయతీ, రెవెన్యూ గ్రామాల నుంచి విడదీయకుండా దగ్గరగా ఉన్న సచివాలయాలకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. అదనపు సిబ్బందిని ఆయా ప్రాంతాల్లో నియమిస్తారు. పంచాయతీ కార్యదర్శి/వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులను గ్రామ/వార్డ్ హెడ్‌గా పిలుస్తారు. మూడంచెల గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు జిల్లా, మండల స్థాయిలో వేర్వేరుగా కార్యాలయాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణకు సిబ్బందిని నియమిస్తారు. సచివాలయాలను వైజ్ఞానిక సమాజాల సృష్టి కేంద్రాలుగా మార్చాలని, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, కృత్రిమ మేథ, ఎంఎస్‌ఎంఈలకు సౌకర్యాలు కల్పించడం, ఆహారతయారీ, ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటారని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ పేర్కొన్నారు.

సైనిక విమానాల్లో గెంటేస్తారా?

- అక్రమ వలసదారులతో అమెరికా పంపిన రెండు విమానాలను తిరస్కరించిన కొలంబియా

న్యూయార్క్: అనుమతి లేకుండా తమ దేశంలో అక్రమంగా నివసించేవారిని వెళ్లగొట్టడం అమెరికా చాలాకాలంగా చేస్తున్న పనే! డీపోర్టేషన్ పేరుతో ఏటా లక్షలాది మందిని పంపించేస్తుంటుంది. కానీ.. ఇప్పుడు ట్రంప్ సర్కారు అక్రమ వలసదారులను ఆగమేఘాల మీద పంపించడానికి సైనిక విమానాలను వాడుతుండడం, అదీ అత్యంత అమానవీయంగా వారి కాళ్లు, చేతులను గొలుసులతో కట్టేసి పంపిస్తుండడంపై లాటిన్ అమెరికన్ దేశాలు మండిపడుతున్నాయి. రెండురోజుల క్రితం మెక్సికోకు ఇలాగే సైనిక విమానాల్లో కొందరిని డీపోర్ట్ చేయబోతే.. ఆ దేశం అంగీకరించలేదు. దీంతో గత్యంతరం లేక.. వారిని అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన 'ఎయిర్ ఆపరేషన్స్' విభాగానికి చెందిన నాలుగు విమానాల్లో పంపించింది. తాజాగా కొలంబియా దేశం కూడా.. తమ దేశానికి అమెరికా పంపిన రెండు సైనికవిమానాలను తిరగ్గొట్టింది. వలసదారులను అమెరికా ప్రభుత్వం నేరగాళ్లలా చూస్తోందంటూ కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో మండిపడ్డారు. తమ దేశానికి చెందిన వలసదారులను అమెరికా పౌరవిమానాల్లో పంపితే స్వాగతిస్తామని.. ట్రంప్ సర్కారు వారిని మర్యాదతో, గౌరవంతో చూడాలని ఆయన ట్వీట్ చేశారు. అంతేకాదు.. తమ దేశంలో 15,660 మంది అమెరికన్లు సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్నారని పేర్కొనడం ద్వారా, తాము కూడా వారిని అలాగే డీపోర్ట్ చేయగలమని పరోక్షంగా హెచ్చరించారు. అటు బ్రెజిల్ విదేశాంగ శాఖ కూడా.. వలసదారుల చేతులు, కాళ్లకు గొలుసులు వేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. నిజానికి అమెరికా చరిత్రలో ఇలా మాస్ డీపోర్టేషన్‌కు మిలటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌ను వాడడం ఇదే మొదటిసారి. గురువారం నుంచి ఆ ప్రక్రియను చేపట్టిన ఆ దేశ ఇమ్మిగ్రేషన్ విభాగం.. ఇప్పటికి ఆరు విమానాల్లో అక్రమవలసదారులను దేశం నుంచి గెంటేసింది. ఒక్కో సైనిక విమానంలో ఎనభై మంది చొప్పున.. రెండు విమానాల్లో 160 మందిని, వారి చేతులు, కాళ్లకు గొలుసులు కట్టి గ్వాటెమాలాకు విమానాల్లో పంపింది. మెక్సికో నుంచి వచ్చి అమెరికాలో తీవ్ర నేరాలకు పాల్పడినవారిని మరో నాలుగు సైనిక విమానాల్లో పంపాలని భావించింది. కానీ.. మెక్సికో అభ్యంతరం చెప్పడంతో వారిని మాత్రం ఇమ్మిగ్రేషన్ విభాగానికి చెందిన ఎయిర్ ఆపరేషన్స్ (ఏఐవో) విమానాల్లో డీపోర్ట్ చేసింది. కాగా, ట్రంప్ ప్రస్తుతం చేపట్టిన మాస్ డీపోర్టేషన్‌లో ఇంకా మనోళ్ల వంతు రాలేదుగానీ.. గత కొద్ది సంవత్సరాలుగా చూస్తే వందలాది భారతీయులను అమెరికా డీపోర్ట్ చేసింది. అమెరికా కస్టమ్స్ అండ్ ఇమ్మిగ్రేషణ్ గణాంకాల ప్రకారం.. 2019 నుంచి 2024 వరకు 6,395 మంది డిపోర్ట్ చేసింది.



గుండెల నిండా దేశభక్తి

దేశభక్తిని చాటుకునేందుకు విధులు అడ్డంకి కాదని నిరూపించిందామె. విశాఖ నగరంలో ఓ జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికురాలు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇలా జాతీయ జెండాను పోలిన రంగులతో కూడిన దుస్తులు ధరించి జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి పాత జైలు రోడ్డుపై చెత్తను తొలగిస్తూ 'ఆంధ్రజ్యోతి' కంటపడింది.

- విశాఖపట్నం

నాటి అరాచకాలపై దండయాత్ర!

లోకేశ్ పాదయాత్రకు రెండేళ్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అరాచక పాలనపై సమరశంఖం పూరించిన లోకేశ్ పాదయాత్ర చేపట్టి సోమవారంతో రెండేళ్లు ముగుస్తాయి. రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ తెలుగుదేశం యువనేత, ప్రస్తుత ఐటీ, మానవవనరుల మంత్రి లోకేశ్ 2023 జనవరి 27న పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కుప్పం వరదరాజస్వామి పాదాల చెంత నుంచి నడక సాగించారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు 3,132 కిలోమీటర్లు నడిచారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ పాదయాత్ర సాగించారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించి, ప్రజాప్రభుత్వాన్ని స్థాపించడంలో ఆయన పాదయాత్ర కీలకభూమిక పోషించింది. యువగళం సాగిన 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 చోట్ల టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించారంటే పాదయాత్ర ప్రభావమెంత ఉందో అర్థమవుతోంది. యాత్ర మొదలుపెట్టాక తారకరత్న హఠాన్మరణం, టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు వంటి అనివార్యమైన పరిస్థితుల్లో మినహా ఎలాంటి విరామమూ లేకుండా సాగింది. ఎండ, వాన, తుఫాన్లను సైతం లెక్కచేయకుండా లోకేశ్ ముందుకు సాగారు. 226 రోజుల పాదయాత్రలో కోటిన్నర మందిని కలిసి ఉంటారని అంచనా.

అడుగడుగునా ఆటంకాలు ఎదురైనా..

యువగళానికి అప్పటి పాలకులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో లోకేశ్ ప్రచార రథాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడేందుకు నిలబడే స్టూలును కూడా లాగేసుకున్నారు. మైకులు పట్టుకుపోయారు. చివరకు యాత్రను అడ్డుకోవడానికి నిరంకుశంగా జీవోయే తెచ్చారు. అయినా దేనికీ వెరవకుండా ప్రజల గొంతుకనే తన గళంగా వినిపిస్తూ.. వారికి భవిష్యత్‌పై భరోసా ఇస్తూ లోకేశ్ ముందుకు సాగారు. కుప్పం నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గానికి చేరేసరికి ప్రతి 20 కిలోమీటర్లకు ఒక కేసు చొప్పున మొత్తం 25 కేసులు యువగళం బృందంపై బనాయించారు. ఇందులో మూడు కేసులు లోకేశ్‌పైనే మోపారు. ఎన్ని వేదింపులు ఎదురైనా మొక్కవోని పట్టుదలతో ఆయన బృందం ముందడుగు వేసింది. చైతన్యానికి మారుపేరైన విజయవాడ వంటి నగరంలో ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి తెల్లవారుజామున 3.30 వరకు ఎదురుచూడడం., యువనేతపై వారికున్న అభిమానంతోపాటు అప్పటి జగన్ అరాచక ప్రభుత్వంపై వ్యతిరేకతకు అద్దం పట్టింది. రాయలసీమలో 124 రోజులపాటు 44 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,587 కిలోమీటర్ల మేర లోకేశ్ పాదయాత్ర చేశారు. గతంలో ఏ నాయకుడూ రాయలసీమలో ఇంత సుదీర్ఘ యాత్ర చేయలేదు. యువగళం పొడవునా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, వచ్చిన పరిశ్రమల విజయగాథలు.. జగన్ సర్కారు వైఫల్యాలను ఎత్తిచూపుతూ లోకేశ్ విసిరిన సెల్ఫీ చాలెంజ్‌లు అప్పటి వైసీపీ పాలకులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. తనను కలిసేందుకు వచ్చిన అభిమానులు, కార్యకర్తలను నిరాశపరచకుండా 'సెల్ఫీ విత్ లోకేశ్' కార్యక్రమంతో ప్రతి ఒక్కరితో ఫొటోలు దిగారు. 226 రోజుల యాత్రలో 3.5 లక్షల మందికిపైగా అభిమానులతో ఫొటోలు దిగారు.



యువగళం పాదయాత్రలో లోకేశ్ అభివాదం (ఫైల్)

యువగళం హామీల అమలు దిశగా..

పాదయాత్ర సందర్భంగా యువత, మహిళలు, వృద్ధులు, విద్యార్థులతోపాటు వివిధ రంగాల వారికి లోకేశ్ అనేక హామీలు ఇచ్చారు. ముఖ్యంగా రాయలసీమ ప్రజల కోసం కడపలో 'మిషన్ రాయలసీమ' పేరుతో డిక్లరేషన్ ప్రకటించారు. ఆ హామీలకు కార్యరూపం ఇస్తూ ఎన్నికల ముందు టీడీపీ కూటమి 'సూపర్ సిక్స్' మేనిఫెస్టోలో పొందుపరచింది. ఎన్నికల అనంతరం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన ప్రజాప్రభుత్వం.. లోకేశ్ హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. పగ్గాలు చేపట్టిన తొలిరోజునే మెగా డీఎస్సీ ఫైలుపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేశారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తానన్న లోకేశ్ హామీ అమలుకు ప్రణాళికాబద్ధమైన కృషి జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి ఏడు నెలల్లోనే రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు, 4 లక్షల మందికిపైగా ఉద్యోగాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. లోకేశ్ పాదయాత్ర హామీల అమలుకు ప్రత్యేక యంత్రాంగం సైతం ఏర్పాటైంది.

'ఎన్నికల' రోడ్లు రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

'సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఐఎఫ్)' కింద చేపట్టే రహదారులు కూడా భారీగా ఉన్నాయి. ఈ పరిణామం వైసీపీ నేతలకు, వారి పేరిట బిడ్లు వేసి వర్కులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు గట్టిషాకిచ్చింది. నిరుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు జగన్ సర్కారు పెద్దఎత్తున రోడ్ల నిర్మాణ పనులు ప్రకటించింది. కేంద్రం ఇచ్చే సీఆర్‌ఐఎఫ్ నిధులు సహా రాష్ట్ర వనరుల నుంచి రూ.2,300 కోట్ల విలువైన రహదారుల నిర్మాణానికి అనుమతులిచ్చారు. 2023 అక్టోబరు నుంచి 2024 ఏప్రిల్ మధ్య భారీగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. వీటిలో జాతీయ రహదారులు, సీఆర్‌ఐఎఫ్, నాబార్డు, విదేశీ సాయంతో నడిచే ప్రాజెక్టులు (ఈఏపీ), కేంద్ర ప్రాయోజిత పథకాల రోడ్లతో పాటు తుంగభద్ర పుష్కరాల రహదారి పనులు కూడా ఉన్నాయి. గ్రామీణ రోడ్లను జిల్లా ప్రధాన రహదారులుగా మార్చే దశలో ఉన్నవీ ఉన్నాయి. నాటి మంత్రులు, వైసీపీ ముఖ్య నేతల సిఫారసుల మేరకు పనులను మంజూరుచేసి ఆగమేఘాలపై టెండర్లు పిలిచారు. ఇందులో సింహభాగం వారు, వారి బినామీలుగా ఉన్న కొందరు కాంట్రాక్టర్లే దక్కించుకున్నారు. ఒప్పందాల ప్రకారం గత ఏడాది ఏప్రిల్ నాటికే కనీసం 40 శాతం పనులు చేసి ఉండాలి. కానీ కాంట్రాక్టర్లు 10 శాతం కూడా పూర్తిచేయలేదు. అత్యధిక వర్కులు ప్రారంభించనేలేదు. ఎన్నికల్లో మళ్లీ జగన్ గెలుస్తారని.. కొత్త ప్రభుత్వం వచ్చాక పనులు మొదలుపెడదామని చాలా మంది వేచిచూశారు. మరి కొందరు డబ్బులిస్తారో లేదో నన్న అనుమానంతో ధైర్యంగా పనులు చేయలేకపోయారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిచి అధికారంలోకి రావడంతో.. వైసీపీ నేతలు, వారి బినామీలు పనులు నిలిపివేశారు. కొందరు చేపట్టలేమని చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో ఆయా పనుల తాజా పరిస్థితిపై ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులోనే నివేదిక కోరింది. పెండింగ్‌లో ఉన్న రహదారి నిర్మాణ పనులు, అసలు ప్రారంభంకాని రోడ్లపై సంబంధిత సీఈ, ఈఎన్‌సీ నివేదికలు ఇచ్చారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం.. అసలు ప్రారంభమే కాని పనులను రద్దుచేసింది. మొదలుపెట్టి 25 శాతం పురోగతి సాధించని వాటినీ రద్దు పద్దులో చేర్చింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులిచ్చారు.

పనులు పునరుద్ధరించాలని పైరవీలు

ఇంకోవైపు.. ప్రభుత్వం రద్దుచేసిన పనులను పునరుద్ధరించాలని కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొస్తుండడం గమనార్హం. రద్దయినవాటిలో సింహభాగం వైసీపీ నేతలే దక్కించుకున్నారని తెలిసినా.. లోపాయకారీ ఒప్పందాలు చేసుకున్నారో ఏమో.. కూటమి నాయకులే వాటిని తిరిగి ప్రారంభించాలని ఒత్తిడి తెస్తున్నారు. వాటిని కొత్తగా చేపట్టాలని కోరితే ఇబ్బంది లేదు. కానీ పాత కాంట్రాక్టర్లతోనే వాటిని కొనసాగించాలని డిమాండ్ చేయడం విస్మయపరుస్తోంది. వారి వెనక కొందరు వైసీపీ నేతలు ఉన్నట్లు తెలిసింది. రద్దుచేసిన రహదారి పనులను తిరిగి కొనసాగించాలనుకుంటే కొత్తగా టెండర్లు పిలిచి ఏజెన్సీలకు అప్పగించడం పద్ధతి. అలా కాకుండా పాత కాంట్రాక్టర్లతోనే చేయించాలని పైరవీలు చేయడం చర్చనీయాంశమైంది.

7 నెలలు.. 6 లక్షల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

'బ్రాండ్ ఏపీ' నినాదం పారిశ్రామికవేత్తల్లో భరోసా నింపింది. ప్రపంచ స్థాయి నగరంగా రాజధాని అమరావతిని తిరిగి పట్టాలెక్కించడంతో వారి ఆశలు చిగురించాయి. ఫలితంగా గతంలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత చూపి.. తర్వాత జగన్ పాలనతో విసుగెత్తి వెళ్లిపోయిన వారు కూడా నిదానంగా రాష్ట్రానికి రావడం ప్రారంభించారు. దీంతో పెట్టుబడులకు ఊపొచ్చిందని అధికార వర్గాలు సైతం చెబుతున్నాయి. దీనికితోడు సుదీర్ఘ తీరప్రాంతం సహా రాష్ట్రంలోని సహజ వనరులు వంటివి పారిశ్రామికవేత్తలను మరింత ఆకర్షిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఏడు నెలల్లోనే ఏకంగా రూ.6,33,726 కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయి. వీటి రాకతో 4 లక్షల మందికి పైగా ఉద్యోగాలు రానున్నాయి. ఇక దావో్స్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా సీఎం చంద్రబాబు 'బ్రాండ్ ఏపీ' నినాదాన్ని జోరుగా ముందుకు తీసుకెళ్లారు. ఈ ప్రయత్నం విజయవంతమైందని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి.

ఎన్టీపీసీ భారీ పెట్టుబడి

కూటమి పాలన ప్రారంభమైన తర్వాత ప్రైవేటురంగంలోని పారిశ్రామికవేత్తలతోపాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చాయి. వీటిలో ఎన్టీపీసీ హరిత ఇంధన రంగంలో ఏకంగా రూ.1,85,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 57,000 మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ సంస్థ కార్యకలాపాలను చేపట్టేందుకు వీలుగా ఇటీవల ప్రధాని మోదీ విశాఖలో శంకుస్థాపన చేశారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు రావడం వల్ల స్థిరమైన ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ), ఏపీ జెన్కో.. సంయుక్త భాగస్వామ్యంతో పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టులు స్థాపించేందుకు ఒప్పందం చేసుకుంది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 7000 మందికి ఉద్యోగాలు కల్పించే ఈ కేంద్రాన్ని కర్నూలు జిల్లాలో స్థాపించనున్నారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్స్ సంస్థ అనకాపల్లి జిల్లాలో రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఉక్కు పరిశ్రమను స్థాపించేందుకు సిద్ధమైంది.

అనుబంధ శాఖలు కదలాలి!

2019-24 మధ్య పారిశ్రామిక వ్యతిరేక ధోరణులకు అలవాటుపడ్డ నాటి జగన్ ప్రభుత్వ తీరుకు అనుగుణంగానే అధికార యంత్రాంగం వ్యవహరించింది. కానీ, ఇప్పుడు పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా మార్చాలని కూటమి ప్రభుత్వం శత విధాలా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక అనుబంధ శాఖలు కూడా స్ఫూర్తిమంతంగా పనిచేయాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు. 2014-19 మధ్య నాటి పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులుగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారులు జేఎస్‌వీ ప్రసాద్, ఎస్ఎస్ రావత్, సాల్మన్ ఆరోకియా రాజ్, కార్తికేయ మిశ్రాలు పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నించారు. పారిశ్రామిక వేత్తలతో కీలక సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో సీఎం చంద్రబాబు దావోస్ పెట్టుబడుల సదస్సుకు వెళ్లక ముందే వీరంతా అక్కడకు చేరుకుని సన్నాహక ఏర్పాట్లు చేసేవారు. దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో ముందుగానే క్రియాశీల భేటీలను నిర్వహించేవారు. దాని ఫలితంగానే అశోక్ లేలాండ్, ఏషియన్ పెయింట్స్, హీరో ఫాక్స్‌కాన్, హెచ్‌సీఎల్ ఎలక్ట్రానిక్స్ తయారీ లాంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి.

తిరిగొచ్చిన గతం

(మొదటి పేజీ తరువాయి)

పనితీరుపై నమ్మకంతో పారిశ్రామిక సానుకూల వాతావరణం నెలకొందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే పారిశ్రామిక అనుబంధ శాఖలు వాటిని అందిపుచ్చుకునేలా వ్యవహరించడం లేదన్న విమర్శలున్నాయి. 'ఏపీ బ్రాండ్' ప్రమోషన్‌లోనూ అవి వెనుకబడుతున్నాయన్న వాదన ఉంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు తక్షణమే ప్రోత్సాహక విధానంపై దృష్టిపెట్టి పెట్టుబడులపై కసరత్తు చేసేలా చూడాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. అనుబంధ శాఖల్లోనూ రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు.

ఏడు నెలల్లో వచ్చిన పెట్టుబడులు ఇవీ.. రూ.కోట్లలో

పరిశ్రమ	పెట్టుబడి	ఉద్యోగాలు	ప్రాంతం
ఎన్టీపీసీ హరిత ఇంధనం	1,85,000	57,000	విశాఖపట్నం
ఆర్సెలార్ మిట్టల్ స్టీల్స్	1,35,964	55,000	అనకాపల్లి
ఎన్‌హెచ్‌పీసీ అండ్ జెన్కో	1,00,000	7,000	కర్నూలు
బీపీసీఎల్	96,962	3,000	రామాయపట్నం
రిలయన్స్	65,000	2,55,000	రాష్ట్రమంతా
ఎల్జీ ఎలక్ట్రానిక్స్	5,001	1,945	శ్రీసిటీ
ఎస్ఏఈఎల్ సోలార్‌ఎంహెచ్‌పీ -1	1,728.42	1,035	అనంతపురం, కడప
ఎస్ఏఈఎల్ సోలార్‌ఎంహెచ్‌పీ -2	1,728.42	1,035	కడప, నంద్యాల
టీసీఎస్	----	10,000	విశాఖపట్నం
టాటా పవర్	2,000	1,380	అనంతపురం
గ్రీన్‌కో(3 ప్రాజెక్టులు)	18,599	4,825	రాష్ట్రంలో
ఆస్త్ర గ్రీన్ ఎనర్జీ	8,240	4,000	ఉమ్మడి కడప
ఎకోరెన్ ఎనర్జీ ఇండియా	5,535	630	కర్నూలు
హీరో ఫ్యూచర్ ఎనర్జీస్	2,000	650	
క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రీడ్-3	2,000	650	నంద్యాల, కడప
టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ	2,000	1,380	కర్నూలు
యాక్షన్ టెసా	1,175	2,500	
ఎకోరెన్ ఎనర్జీ ఇండియా	567	170	అనంతపురం
ఎకోరెన్ ఎనర్జీ ఇండియా	227	1,735	అనంతపురం, కడప
మొత్తం	6,33,726.84	4,08,285	

రంగంలోకి బడా 'పుష్ప'లు!

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ప్రకారం ప్రభుత్వం దగ్గర ఉన్న నిల్వల కన్నా ఎన్నోరెట్లు ఎక్కువగా స్మగ్లర్ల వద్ద దుంగలు ఉన్నాయని తెలుస్తోంది.

కొవిడ్‌తో పడిపోయిన మార్కెట్

ఎర్రచందనంతో తయారైన వస్తువులు ఇంట్లో ఉండటం అదృష్టంగా అనేక దేశాల్లో భావిస్తారు. అయితే కొవిడ్ తర్వాత ఎర్రచందనానికి అంతర్జాతీయంగా డిమాండ్ పడిపోయింది. ప్రభుత్వం గ్లోబల్ టెండర్లకు వెళ్లినా ధర పలకలేదు. మన దగ్గర నుంచి ఎర్రచందనం ప్రధానంగా చైనాకు చేరుతుంది. అక్కడ ఫర్నిచర్ సహా రకరకాల బొమ్మలు, వస్తువులు తయారవుతాయి. అక్కడినుంచి జపాన్, థాయ్‌లాండ్, మలేషియాకు ఎగుమతి అవుతాయి. కొవిడ్ కాలంలో చైనాలోని పరిశ్రమలన్నీ దాదాపుగా మూతపడటంతో డిమాండ్ పడిపోయింది. దీంతో మన దగ్గర స్మగ్లింగ్ కార్యకలాపాలూ తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ఏపీ, కర్ణాటక, తమిళనాడుల్లోని రహస్య స్థావరాల్లో స్మగ్లర్లు వీటిని దాచి ఉంచారు. అడవుల్లో కూలీల కదలికలు పెద్దగా లేకపోవడంతో స్మగ్లింగ్ తగ్గుముఖం పట్టిందని పోలీసు, అటవీ వర్గాలు భావించాయి.

దొరుకుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

చైనాలో పరిశ్రమలు ఒక్కటొక్కటిగా మళ్లీ తెరుచుకున్నాయి. దీంతో స్మగ్లర్లు గోడౌన్ల నుంచి దుంగలను బయటకు తీసి రకరకాల మార్గాల్లో స్మగ్లింగ్ మొదలుపెట్టారు. ఇటీవల పట్టుబడిన స్మగ్లర్లు రాంప్రసాద్, రవిశంకర్ విచారణలో ఇచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేసి రూ.3.5కోట్ల విలువైన 155 దుంగలను రహస్య స్థావరాల నుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుజరాత్‌కు చెందిన ఉత్తంకుమార్, నందకిశోర్, సోనీ, జోషి హన్స్‌రాజ్, మీర్జాయి, పరేష్‌జి అనే అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. తమిళనాడులోని ఓ గోడౌన్‌లో దాచిన ఎర్రచందనాన్ని అసోంకు తరలిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలో తనిఖీ చేసి రూ.4.5కోట్ల విలువచేసే 413 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన నరేంద్రకుమార్, అసోంకు చెందిన బినోయ్‌కుమార్, రాజస్థాన్‌కు చెందిన విజయ్ జోషీని అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వానికి మంచి అవకాశం

చైనాలో ఎర్రచందనంతో వస్తువులు తయారుచేసే పరిశ్రమలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం కూడా దుంగల అమ్మకాలతో ఆదాయం పెంచుకునే దిశగా ఆలోచించాల్సి ఉంది. తిరుపతిలోని తిమ్మినాయుడు పాలెం వద్ద గల ఎర్రచందనం సెంట్రల్ గోడౌన్‌లో ఇప్పటికే దాదాపుగా 5,400 టన్నుల ఎర్రచందనం నిల్వ ఉంది. స్మగ్లర్ల కన్నా ముందే కదిలి, గ్లోబల్ టెండర్లు పిలిస్తే ఉపయోగం ఉంటుంది. ప్రభుత్వం నుంచి అధికారికంగానే, తక్కువ ధరకు దొరికే అవకాశం ఉంటే స్మగ్లర్ల వద్ద కొనాల్సిన అవసరం చైనా పరిశ్రమలకూ ఉండదు. దీనితో స్మగ్లింగ్‌కు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.